గీతామృత మహోదధయే నమః

# శ్రీమద్భగవద్గీత-
# మానవకర్తవ్యము

(తృతీయ సుమం)

MEMORIAL LIBRARY
V.R. NARLA
D.P.R.I.
Acc. No. 56

294.5924
SRI

శ్రీకృష్ణానందాశ్రమ గీతాప్రచారసంఘం
రిజిష్టర్డు నెం. 308/67
దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్-36

ii

మూకం కరోతి వాచాలం పంగుం లంఘయతే గిరిం
యత్కృపా తమహం వందే పరమానంద మాధవం

ఓం

## గీతామృత మహోదధయే నమః

ఓం

కృష్ణానంద ముకుంద మురారే వామన మాధవ గోవింద
శ్రీధర కేశవ రాఘవ విష్ణో శ్రీనారాయణ చిద్రూప

# శ్రీమద్భగవద్గీత-
# మానవకర్తవ్యము

## (తృతీయ సుమం)


## శ్రీకృష్ణానందాశ్రమ గీతాప్రచారసంఘం

రిజిష్టర్డు నెం. 308/67

దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్-36

మాఘ-కీలక (ఫిబ్రవరి 1969) అమూల్యము



సర్వస్వామ్యసంకలితము

II

294.5924
CRI

294.5924
SRI
Dr. B.R. AMBEDKAR
OPEN UNIVERSITY
CALL NO:
ACC. NO: ...DL-56
AUTHOR:
TITLE:

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

AOUA105 B115

111

# శ్రీకృష్ణానందాశ్రమ గీతా ప్రచార సంఘం

రిజిస్టరు నెం. 308/67

## దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్-36

## ఓం గీతామృత మహోదధయే నమః

భగవద్గీతే భవద్వేషిణీం త్వాం అను సందధామి

## (తృ తీ య సు మం)

## వి జ్ఞ ప్తి

అభ్యాసక సోదరీ సోదరమణులారా,

పరమేశ్వర కటాక్షంచేత, అమూల్యమైన విజ్ఞానాన్ని, ఆనందాన్నీ అందజేసే పుస్తకాలను ప్రచురించటమనే మా సత్కర్మాచరణ నిర్విఘ్నంగా కొనసాగిస్తూ ఈ తృతీయ సుమాన్ని గూడా ప్రచురించి, అమూల్యంగానే—ఉచితంగానే—సాధకులకు ఇయ్యగలుగుతున్నందులకు ఆనందిస్తున్నాం.

(2) ప్రథమ, ద్వితీయ సుమాలు మీకు ఇదివరలో అంది ఉండకపోతే తెలియ జెయ్యండి. పంపిస్తాం.

(3) ఇదివరకు అభ్యాసానికి పూనుకోకపోతే ఇప్పుడైనా మొదలుపెట్టి మాకు తెలియజేస్తే మా చేతనైన చేయూత నిచ్చేందుకు ప్రయత్నిస్తాం.

(4) ఈ పుస్తకాలను అటూ ఇటూ పోనీకుండా భద్రంగా ఉంచుకొని చదువుతూంటే సంతోషిస్తాం.

మరోమాట.

(5) ఈ విధంగా పుస్తక రూపంలో మీ చేతుల్లోకి వచ్చి జ్ఞాన సాధనకు తోడ్పడే ఈ జంగమ రూప గీతా భవనం (mobile gita-Bhavan)తో పాటు హైదరాబాదు దిల్‌సుఖ్ నగర్‌లో శ్రీకృష్ణానందాశ్రమం అనే పేరుతో, భక్తులూ, సాధకులూ, పరమేశ్వర సేవా మహోత్సవాలను జరుపుకొంటూ ఆనందించేందుకు అనుకూలంగా వుండే విశాలమైన భవనం కూడా ఒకటి నిర్మిస్తున్నాం.

పరమేశ్వర కటాక్షంచేత

ఉన్నతాశయ సమన్వితులూ, ఉదార స్వభావోపేతులూ. అయిన స్నేహితుల సహకారంతో, ఇంతవరకు ప్లాను ప్రకారం ఆశ్రమభవనంలో సగ భాగం నిర్మింపబడిందని తెలియ జేయటానికి సంతోషిస్తున్నాం.

(6) ఈ సత్కార్మ నిరాటంకంగా నిర్వహింపబడేందుకుసహాయం చేస్తూన్న భక్తశిఖామణులకు మా వినయ పూర్వకృతజ్ఞతల నర్పిస్తున్నాం.

(7) (i) ఇకముందు క్రమక్రమంగా రాబోవు సుమాలను ప్రచురించి సాధకులకు ఉచితంగా అందజేయటానికీ (ii) ఆశ్రమ భవనంలో మిగిలిన సగ భాగం కూడా అచిరకాలంలో నిర్మించేందుకు స్నేహిత బృందం యొక్క ఇతోధిక సహకారాన్ని అర్ధిస్తున్నాం.

విరాళములు క్రింద ఇచ్చిన అడ్రసుకు పంప మనవి చేస్తున్నాం.

(8) మానవజన్మ వచ్చినందుకు ఉపనిషత్సారమైన గీతామాతోపదేశానుసారం మనకర్తవ్యమేమో తెలుసుకొని తప్పనిసరిగా చేయవలసిన మన అంతిమ ప్రయాణ సమయం రాకముందే. ఆ కర్తవ్యంలో ఏ కొంతైన చేయగలిగినట్లయితే. మనవెంట మనం ఆ చేసినసత్కార్మయొక్క సంస్కారాన్ని మాత్రమే తీసుకొనిపోతామనీ తక్కిన ఆ సిపాస్తులను ఇచ్చటనే వదలిపోతామనిన్నీ స్పష్టంగా తెలుసుకొని చేతనైన రీతిగా సత్కార్మలను చేయుటకూ, చేయించుటకూ, పూనుకోండని మరో మారు మనవి చేస్తున్నాం.

ఓం తత్సత్

**శ్రీకృష్ణానందాశ్రమ గీతా ప్రచార సంఘం**

అడ్రసు :

Sri Y. SRIHARI SARMA
**Treasurer: S/K Gita Prachara Sangham**
Andhra Bank Central Office
(Staff Department)
Sultan Bazar, Hyderabad-1

ఓం జగద్గురవేనమః

ఓం గీతామృత మహోదధయే నమః

ఓం

కృష్ణానంద ముకుంద మురారే వామన మాధవ గోవింద
శ్రీధర కేశవ రాఘవ విష్ణో శ్రీనారాయణ చిద్రూప

# నివేదన

స్నేహితులారా!

మూకం కరోతి వాచాలం పంగుం లంఘయతే గిరిం
యత్కృపా తమహం వందే పరమానంద మాధవం

ఎవనికృప మూగవాడికి మాట్లాడే శక్తినీ; కుంటివాడికి కొండను దాటే శక్తినీ కలుగజేస్తుందో అంటే మన చేతగాదు అని మనం నిరాశ చెందిన విషయాలు ఎవని దయవల్ల మనచేత అవుతవో అట్టి పరమానంద స్వరూపుడైన పరమేశ్వరునకు నమస్కారము.

ప్రారబ్ధం భుజ్యమానోఽపి
గీతాభ్యాసరతస్సదా
సముక్తస్సుఖీలోకే
కర్మణానోపలిప్యతే

ప్రారబ్ధాన్ని అనుభవిస్తున్న వాడైనా. నిరంతరంగా గీతను అభ్యసిస్తూ ఉంటే కర్మఫలం వానిని బంధించదు. పరమ సుఖరూప ముక్తిని పొందుతాడు. అని భగవద్వాక్యం.

అధ్యేష్యతేచయఇమం
ధర్మ్యం సంవాదమావయోః
జ్ఞానయజ్ఞేన తేనాహ
ఇష్టః స్యామితి మేమతిః

(గీ॥ 18 అ॥ 70శ్లో)

"ఎవరు ఈ గీతను అధ్యయనం చేస్తారో వారు అన్ని యజ్ఞాలలో శ్రేష్ఠమైన జ్ఞానయజ్ఞంచేత నన్ను అర్చించినవారు అవుతారు" అని గీతా వాక్యం.

కొన్ని సంవత్సరాలనుంచి హైదరాబాదు పట్టణంలోని వివిధప్రాంతాలలో నివసిస్తూ నిరంతరంగా శ్రీమద్భగవద్గీతాభ్యాసం చేస్తున్న మాకు

పై వాక్యాల అర్థం అనుభవంలోకి వస్తున్నది.

కనుక మేము విశ్వాసంతో చేస్తున్న సాధననూ, పొందుతున్న శ్రేయస్సునూ, స్నేహిత బృందానికి తెలియజేసి వాళ్ళుగూడా ఈ మార్గంలోకి వచ్చేట్లు చేయటం మా ముఖ్య కర్తవ్యంగా తలుస్తున్నాం.

దా ని కో సం

1. హైదరాబాదులోని వివిధ కేంద్రాలలో ఆదివారాలూ, సెలవు దినములూ, పండుగ దినములలో ప్రచార సభలను ఏర్పాటు చేస్తూ

ఇతర నగరాలలో గూడా అచ్చటి భక్తులు కోరినప్పుడు అచ్చటికి వెళ్ళి అచ్చటగూడ సాధక సంఘాలనూ. ప్రచార సభలనూ ఏర్పాటు చేస్తూ. ప్రతి సభలోనూ 4 గంటలసేపు (i) ధ్యానం (ii) మానసికఅర్చన (iii) నామ సంకీర్తనం (iv) గీతామననం (v) గీతాపారాయణం (vi) ప్రవచన శ్రవణం.

ఈ విధంగా కార్యక్రమాలు జరుపుతూ.

2. "శ్రీమద్భగవద్గీత = మానవ కర్తవ్యం" అనే పేరుతో అందరికీ అర్థమయ్యేటందుకు. వాడుకభాషలోనే. ఉపనిషత్సారాన్ని గీతోపదేశాన్ని సాధకులకు తెలియజేసే ఉద్దేశంలో చిన్న చిన్న పుస్తకాలను ప్రచురిస్తూ సాధకులకు ఉచితంగానే అందజేస్తూ

3. హైదరాబాదు దిల్‌సుఖ్ నగర్ కాలనీలో ఆశ్రమం ఒక దానిని స్థాపించి గీతా జయంతి మొదలైన ఉత్సవాలను చేస్తూ

నిష్కామంగా పరమేశ్వర సేవా గీతా ప్రచారసేవ చేస్తున్నాం

పరమేశ్వర కృపాకటాక్షాలచేత ఈ సేవ నిరాటంకంగా కొనసాగుతున్నది. అనేకులు గీతాభ్యాసం చేస్తూ శ్రేయోమార్గాన్ని అవలంబిస్తున్నారని చెప్పుకొనుటకు సంతోషిస్తున్నాం.

కర్తాకారయితాచైవ ప్రేరకశ్చానుమోదక:
సుకృతే దుష్కృతే వాపిచత్వారస్సమభాగిన:

అంటే పుణ్యకర్మ అయినా. పాపకర్మ అయినా (1) చేసేవాడు (2) చేయించేవాడు (3) చేయటానికి ప్రోత్సాహం కలిగించేవాడు (4)

చూచి సంతోషించేవాడు ఆ పుణ్యకర్మ పాపకర్మలఫలంలో సమభాగస్థులు అవుతారు.

కనుక మీరు ఈ పుస్తకాలవల్ల లాభం పొందుతూ ఈ గీతాభ్యాస ప్రచార రూప పుణ్యకర్మలో పాల్గొని; మీ స్నేహితులుకూడా పాల్గొనేట్లు చేస్తూ

మీ నగరాల్లోకూడా సాధక సంఘాల ఏర్పాటుచేసి, గీతాభ్యాసం చేస్తూ మాకు తెలియజేస్తే, మేముగూడా మీ పరిచయం భాగ్యాన్ని పొంది మీ నగరాల్లో జరిగే పరమేశ్వర సేవా మహోత్సవాల్లో పాల్గొని ఆనందిస్తాం.

ఓం తత్సత్

శ్రీకృష్ణానందాశ్రమ గీతా ప్రచార సంఘం



ఓం పరస్మైబ్రహ్మణేనమః

ఓం లీలామానుష విగ్రహాయనమః

ఓం శ్రీకృష్ణాయనమః

ఓం జగద్గురవేనమః

ఓం సంసారవైరిణేనమః

ఓం గీతామృతమహోదధయేనమః

# శ్రీమద్భగవద్గీత—మానవకర్తవ్యం

## తృతీయసుమం

## గీతాతత్త్వం

పరమేశ్వరుడు మనుష్య దేహాన్ని పొందక పోయినప్పటికీమాయ చేత పొందినట్లుగా మాత్రం కనబడుతూ, శ్రీకృష్ణనామంతో, జగద్గురు రూపంతో, దుఃఖభూయిష్టమైన సంసారాన్ని హరించేదిన్నీ, సర్వోపనిషత్తులసారమైనదిన్నీ అయిన గీతను ఉపదేశించాడని శాస్త్రాలన్నీ చెప్తున్నవి. స్వయంగా భగవద్గీత గూడా అమాటే చెప్తున్నది.

అజోఽపి సన్నవ్యయాత్మా,
భూతానామీశ్వరోఽపిసన్
ప్రకృతిం స్వామధిష్ఠాయ
సంభవామ్యాత్మమాయయా.

[గీ॥ 4—6]

నేను పుట్టుకలేనివాడనూ, నాశనం లేనివాడనూ. సమస్త చరాచర భూతములకు ప్రభువునూ; నియామకుడనూ అయినప్పటికిన్నీ నామాయా శక్తి చేత పుట్టినవానివలె, దేహం పొందినవానివలె కనబడుతున్నాడు. అనిభగవద్వాక్యార్థం.

సర్వశాస్త్రమయీగీతా, సర్వదేవమయీయతః
సర్వధర్మమయీ యస్మాత్, తస్మాదేతాం సమభ్యసేత్

సర్వశాస్త్రాలసారమూ, సర్వదేవతాస్వరూపమూ, సర్వ ధర్మమయమూ గనుక గీతను అభ్యసించాలి అని సజ్జనులంతా బోధిస్తున్నారు.

కనుక గీతా తత్త్వం తెలుసుకోటానికి మనం ప్రయత్నం చెయ్యాలి. ప్రథమ ద్వితీయ సుమాలలో కొంతవరకు తెలుసుకొన్నాం. ఏం తెలుసుకొన్నాం అంటే—

## ప్ర థ మ సు మ ం లో

i "భగవద్గీత" అంటే భగవంతునిచేత ఉపదేశింపబడ్డ ఉపనిషత్సారమనీ. అధ్యాత్మవిద్యఅనీ, బ్రహ్మవిద్యఅనీ

ii "ఉపనిషత్" అంటే అజ్ఞానాన్ని పోగొట్టి దుఃఖరూపమైన సంసారాన్ని అంతం చేసేది. ఆనందరూపమైనబ్రహ్మమునుపొందించేదిఅనీ.

iii 'అధ్యాత్మవిద్య' 'బ్రహ్మవిద్య' అంటేనీవు దేహం, ఇంద్రియాలు. మనస్సుమొదలైన వీటిలో ఏదీకావనీ వీటన్నిటినీ ప్రకాశింపజేసే 'ఆత్మవు' పరమాత్మవు. పరబ్రహ్మవు అని నీ నిజస్వరూపాన్ని నీకు బోధించే విద్యఅనీ.

**iv** 'సంసారం' అంటే సమస్త దుఃఖాలకు, బాధలకు, కారణమైన జననమరణ ప్రవాహం అంటే తల్లి కడుపులోనుంచి ఒక దేహంతో బయటపడటం = పుట్టటం, నానా కష్టాలు అనుభవించి కొంతకాలంఅయిన తరువాత ఆ దేహాన్ని విడిచిపెట్టి పోవటం. = చచ్చిపోవటం మళ్ళా మళ్ళా పుట్టడం మళ్ళా మళ్ళా చావటం అనీ

**v** 'మానవుడు' అంటే తన నిజస్వరూపాన్ని తాను ఆత్మ అని తెలుసుకోటానికి ప్రయత్నంచేసేవాడనిన్నీ

**vi** 'మోక్షం' అంటే సంసారం నుంచి విడుదల అనిన్నీ కొంతవరకు తెలుసుకొన్నాం.

## 2. ద్వితీయ సుమంలో

**i** 'దుఃఖాదిసప్తకం' అంటే 1) దుఃఖం, 2) శరీరం, 3) కర్మ, 4) రాగద్వేషాదులు, 5) అభిమానం, 6) అవివేకం, 7) అజ్ఞానం అనీ

**ii** దుఃఖం శరీరం వల్ల కలుగుతున్నదనీ

**iii** శరీరం మనం చేసే మంచీ చెడ్డా కర్మలవల్ల కలుగుతున్నదనీ

**iv** కర్మలు మనకుండే రాగద్వేషాదుల వల్ల చేస్తున్నామనీ (Likes and dislikes)

కనుక రాగద్వేషాదులను నశింపజేసుకోవాలనీ దాని కోసమే మనం మనుష్యులమై పుట్టామనిన్నీ రాగద్వేషాదులను నశింప చేసుకొంటే దుఃఖం పోతుందనిన్నీ

విపులంగా తెలుసుకొన్నాం.

## 3. ఈ తృ తీ య సు మ ం లో

1) దుఃఖాదిస ప్తకంలో మిగిలిన మూడు

అ) అభిమానం

ఆ) అవివేకం

ఇ) అజ్ఞానం

అంటే ఏమిటో అవి ఎందుకు కల్గుతున్నవో వీటిని తీసేసుకోటం ఎట్లాగో ఈ విషయాలనూ,

2) "జ్ఞానం'' అంటే ఏమిటో. దాన్ని ఎందుకు సంపాదించాలో ఈ విషయాలను గురించి, ఉపనిషత్తులు. గీత. ఏంబోధిస్తున్నవో మరింత లోతుకుపోయి, విపులంగా తెలుసుకొందాం.

## 4. అ భ్యా స ం

ఒక్కమాటమాత్రం సాధకులమైన మనం మరచి పోగూడదు. అదేమిటంటే ఈబ్రహ్మవిద్య మోక్షవిద్య తలకెక్కాలంటే

1) ఏకాగ్రత (Concentration of mind)

3) బుద్ధి నైశిత్యం Sharpness of Intellect)

ఈరెండుకావాలి,

అసలు తెలివిఅంటే 1) చెప్పింది వెంటనే గ్రహించగలశక్తి 2) గ్రహించిన దానిని జ్ఞాపకముంచుకొనే శక్తి ఈ రెండు కలిస్తేతెలివి అవుతుంది. ఈశక్తులు అభ్యాసంచేత పరమేశ్వర కటాక్షంచేత పొంద గల్గుతాం.

కనుక <u>అభ్యాసం ముఖ్యం నాయనా.</u> మనంఅభ్యాసం చేయకుండా ఎవరో హిమాలయా పర్వతాల్లోనుంచి, ఆకాశంనుంచి ఊడిపడిమనకుతీర్థ

మిచ్చి. నెత్తిన చెయ్యిపెట్టి అఘాంతం పైకి పంపిస్తాడనుకోటం బుద్ధి తక్కువ తనం (foolishness) అంటున్నవి శాస్త్రాలు. మనం. అభ్యాసం చేయకుండా. చౌకబేరంతో మనం మనదుఃఖాన్ని సంసారాన్ని తీసివేసుకోటం సంభవంకానేకాదు. ఇట్లా మనం కష్టపడకుండా తేలికైనది ఏదైనా ఉపాయం ఎవరైనా చెప్తారేమో అనేగా మనం ఇక్కడా అక్కడా ఉత్సవాలకూ ఉపన్యాసాలకూ, ఆయన్నూ ఈయన్నూ దర్శించటానికి కాశీకి రామేశ్వరానికి పోతూంటాము. కాని తేలికమార్గం ఎవ్వరు చెప్పటంలే. ఎవరైనా చెప్పాడో. అతడు మోసగాడే అన్నమాట నమ్మ నాయనా.

అర్జునుడు పరమేశ్వరుణ్ణి. జగద్గురువును ఆశ్రయించాడుకదా. "శిష్యస్తేఽహం శాధిమాంత్వాం ప్రపన్నం"(గీ॥ 2 అ॥ 7 శ్లో॥) నేను దుఃఖసముద్రంలో ఉన్నాను. ఒడ్డువపడవెయ్యి తండ్రి అంటే జగద్గురువు పరమేశ్వరుడు అయిన శ్రీకృష్ణపరమాత్మ.

"నీవు అట్లా చెయ్యి, ఇట్లాచెయ్యి. అట్లాచెయ్యవద్దు. ఇట్లాచెయ్యవద్దు'' అని దేనిని ఎట్లా అభ్యాసం చెయ్యాలో అది చెప్పి 'నీవు అట్లా చెయ్యాలి' అన్నాడుగాని నేను తీర్థమిచ్చి నెత్తిన చెయ్యిపెడ్తా. నీకొకసర్టిఫికెట్టు ఇస్తా. దాంతో నీదుఃఖం పోయి మోక్షం పొందుతావు. నీవేం చెయ్యనక్కరలేదు అర్జునా" అన్నాడా? లేదుగదా? మరి పరమేశ్వరుడే అననిదాన్ని ఈచిన్న చిన్నవాళ్లందరూ, మేమంతవాళ్ళం, ఇంతవాళ్ళం. మాకు చాలా శక్తులున్నవి మా పాదపూజలతో మాతీర్థ ప్రసాదాలతో మే మిచ్చేవిభూతులతో, మా శక్తి పాతంతో. మాకు చేసే భిక్షలతో. మాడిబ్బీలలో వేసే ధనంతో మీకు స్వర్గం మోక్షం వస్తయ్ అంటే ఆదిసత్యమవుతుందా?

కనుక బాగా ఆలోచించుకో. నీవు ఒళ్లు వంచి, గీతోపదేశం మీద విశ్వాసం ఉంచి అభ్యాసం చేయడానికి పూనుకో. అట్లా అభ్యాసంచేస్తే క్రమ క్రమంగా నీ అజ్ఞానం పోతుంది ఆనందం పొందుతావు. కాబట్టి ఈ రోజే కంకణం కట్టుకో! అభ్యాసం మొదలు పెట్టుబాబు. బాగుపడతావు. వేరే మార్గం లేదు.

శాస్త్రానుసారంగా నీవు చేసే అభ్యాసమే నిన్ను రక్షించి సంసార దుఃఖం నుంచి బయట పడవేస్తుందిగాని. ఏ దేవత ఏ దయ్యమూ ఏ భూతము ఏయోగి ఇంకా మరెవ్వరు నీకు రక్షకులుగారు.

'తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే
కార్యాకార్యవ్యవస్థితా
జ్ఞాత్వాశాస్త్రవిధానోక్తం
కర్మ కర్తుమిహార్హసి'

(గీ॥ 16అ. 24శ్లో.)

ఏది చేయతగింది యేదిచేయతగంది అనే నిర్ణయం చేసుకోటానికి శాస్త్రమే గీటు రాయి నాయనా. అంటున్నది. భగవద్గీత.

సద్గురువు అయినవాడు, బోధగురువు అయినవాడు. నీవు సత్ప్రవర్తన. వినమ్రత, జిజ్ఞాస కలిగినవాడవై, విశ్వాసంతో పరమేశ్వర తత్త్వం తెలుసుకోవాలని కుతూహలంతో ప్రార్థిస్తే నీకు శాస్త్రానుగుణ్యంగా చక్కగా బోధించి నిన్ను మార్గంలో పెడతాడు. ఇట్లాచెయ్యి అనిచేసి చూపిస్తాడేగాని అభ్యాసం చేయవలసిన వాడవు నీవే నాయనా. ఇంకో మార్గంలేదు అని తెలుసుకో అంటున్నవి శాస్త్రాలు.

'నాన్యః పంథా విద్యతేఽయనాయ'

(శ్వే. ఉ.)

ఈ అభ్యాసం చేయకుండా ఇవన్నీ మాకు అర్థంకావటంలేదు ఈ శాస్త్రాలు గీస్త్రాలు అసత్యాలు. మేం బాధపడలేం అని తృణీకార భావంతో తోసివేసి, మహావిలువగలిగిన మనుష్యజన్మను తినటం, తాగటం సినిమాలు, పిక్నిక్కులు, భరతనాట్యాలు, మోసాలు, అన్యాయాలు చేయటంతో పాడుచేసుకోవద్దు తండ్రీ. నీవు అభ్యసిస్తూ ఉన్న విద్య (Education) అనేది ఉన్నదే అది పైవిధంగా నీకు నీవు ద్రోహం చేసుకోటానికే పనికివస్తున్నదన్న సంగతి గుర్తెరుంగలేక పోతున్నావు. కనుక జాగ్రతనాయనా. నిన్ను నీవు ఉద్ధరించుకోటానికిశాస్త్రానుసారంగా ప్రయత్నించకపోతే, శాస్త్రానికి, ఉపనిషత్తులకూ, భగవద్గీతకూ, దానిని ఉపదేశించిన పరమేశ్వరునకు యేమీనష్టం, లోపం లేదు, రాదు.

ఈ జన్మను పాడు చేసుకున్నందు వలన కుక్క, నక్క, పంది, గాడిద మొదలైన నీచజన్మలను పొంది నీవే బాధపడతావు.

కనుక సద్బుద్ధిని ప్రసాదించుమని పరమేశ్వరుని ప్రార్థిస్తూ సజ్జన సాంగత్యములో కాలాన్ని సద్వినియోగం చేస్తూ ఒక మెట్టు మీద నుంచి ఇంకొక మెట్టు మీదికి ఎక్కటానికి నిరంతర ప్రయత్నం చేయాలి నాయనా.

1. అభ్యాసయోగయుక్తేన, చేతసా నాన్యగామినా
   పరమంపురుషందివ్యం యాతి పార్థానుచింతయన్
   (గీ. 8 అ. 8 శ్లో)

2. అభ్యాసయోగేనతతో,మామిచ్ఛాప్తుంధనంజయ
   (గీ॥ 12 అ 9 శ్లో.)

3. అభ్యాసేనతుకౌంతేయ,వైరాగ్యేణచగృహ్యతే
   (గీ॥ 6 అ 35 శ్లో.)

అని గీత మాటిమాటికి నీకు హితబోధ చేస్తూ నీవు చెయ్యాలసిన దానిని నీకు సందేహరహితంగా ఉపదేశిస్తున్నది.

కనుక అభ్యాసం చెయ్యినాయనా మనుష్య జన్మను సఫలం చేసుకొంటావు. పరమేశ్వరకటాక్షానికి పాత్రుడవవుతావు.

# దుఃఖాదిసప్తకం

## 5. అభిమానం.

ద్వితీయ సుమంలో దుఃఖాదిసప్తకంలో నాలుగోది. రాగద్వేషాలను గురించి విపులంగా తెలుసుకున్నాం గదూ.

ఈరాగద్వేషాదులు ఎందుకు కలుగుతున్నవి? అంటే అభిమానం వల్లఅని శాస్త్రం చెప్తున్నది కనుక 'అభిమానం'ను గురించి తెలుసుకొందాం.

అభిమానోమిథ్యాజ్ఞానం దేహాదౌఆత్మత్వప్రకారకజ్ఞానమితి'

అభిమానం అంటే—

దేహాదులయందు, అనగా దేహము, ఇంద్రియములు, మనస్సు బుద్ధి వీటియందు 'నేను' అనెడిభ్రాంతి జ్ఞానం తప్పుడు అభిప్రాయం అభిమానం అని చెప్పబడుతున్నది.

అంటే ప్రతివానికీ తన దేహానికి సంబంధించిన జాతి, వర్ణం ఆశ్రమం, వయస్సు, అవస్థ వీటిని గురించీ తాను చేయవలసిన పనుల గురించి, ఎన్నడు విడువకుండా ఉండే స్థిరమైన అభిప్రాయం, దీనినే అభిమానం అంటారు.

'ఆత్మానాత్మనోర్దేహాదీన్ స్వేఽ ధ్యస్య ఆత్మత్వేనాభిమన్యతే సో భిమాన ఆత్మనోబంధః'

(సర్వసార. ఉ. 1)

అంటేతాను నిజంగా ఆత్మస్వరూపము అయిఉన్నప్పటికీ అది తెలుసుకోలేక నేను పురుషుడను నేను స్త్రీని. మేము బ్రాహ్మణులం. క్షత్రియులం మేము గృహస్థులం సన్న్యాసులం నాకు ౩౦ ఏండ్లు. ౪౦ ఏండు. నేను మేల్కొని ఉన్నాను. నేను నిద్ర పోతున్నాను అని తాను కానట్టి దేహాదులకు సంబంధించిన పరిస్థితుల నన్నిటిని. ఇవి ఏమీలేనటు వంటి ఆత్మస్వరూప మైన తనయందు ఆరోపించుకోటం తప్పుభావనచే యటం అభిమానం అనబడుతున్నది. ఈఅభిమానం వల్లనే రాగద్వేషాదులు వస్తున్నవి. బంధం కలుగుతున్నది.

అదెట్లాఅంటేచూడు.

స్త్రీకి నేనుస్త్రీని అని అభిమానం ఉండటంచేత. భర్తను సేవించటం. గృహరక్షణ చేయుటం వంటచేయటం. పిల్లలను పోషించటం మొదలైన పనులందు. రాగాదులు కలుగుతున్నవనిమన అనుభవంలోఉందిగదూ.

అట్లాగే నేను పురుషుడను అని అభిమానం ఉండటంచేత రాగాది పూర్వకంగా, భార్యను సంపాధించుకోవాలి. వ్యవసాయమో. వ్యాపారమో. ఏదో చేసి డబ్బు సంపాదించాలి. కుటుంబాన్ని పోషించాలి. సంసారం నడపాలి అనే ప్రవృత్తి కలుగుతున్నది అట్లాగే. అందరికీ జాతి. వర్ణ. ఆశ్రమాలు మొదలైన దేహపరిస్థితుల అభిమానంవల్ల తమ తమ వ్యాపారాలలో పూనిక కలుగుతున్నది.

అభిమానం వల్లనే రాగద్వేషాలు కలుగుతున్నవి అని ఎటా చెప్పటం అంటే చూడు. దేహమేనేనుఅనే అభిమానం వున్న అవస్థలలో అంటే జాగ్రత్తు, స్వప్న అవస్థలలో రాగద్వేషాలు ఉంటున్నవి.

అభిమానంలేని గాఢసుషుప్తి సమయంలో అంటే నిద్రావస్థలో రాగద్వేషాదులు లేవు గదూ. దేహంమీద బట్టతొలగిపోయెనా !సిగుగాని

చలిగాని లేదు. వంటిమీద తేలు పాకిపోతున్నా భయంగాని దానిని చంపాలి అనే భావనగాని లేదుగదూ. అందువల్ల అభిమానం ఉంటే రాగద్వేషాలు ఉంటున్నవి. (దీనినే అన్వయం అంటారు)

అభిమానంలేనప్పుడు రాగద్వేషాలు లేవు. (దీనినే వ్యతిరేకం అంటారు.)

ఒకటి ఉన్నప్పుడు రెండవది ఉండడం, అది లేనప్పుడు ఆ రెండవది లేకుండటం. వీటిని అన్వయ వ్యతిరేకాలు అంటారు. కనుక ఇట్లా అన్వయ వ్యతిరేకాలుఅనే యుక్తులవల్ల విచారిస్తే అభిమానం వల్లనే రాగద్వేషాదులు కలుగుతున్నవి అనితెలుస్తున్నదిగదూ.

ఈ విచారంవల్ల లాభం యేమిటయ్యా అంటావేమో విను.

ముముక్షువు అంటే ముక్తిని కోరేవాడు అంటే దుఃఖసముద్రమైన సంసారంలో నుంచి బయటపడదలచుకొనేవాడు అంటే దుఃఖం రవ్వంత గూడా లేని పరమసుఖం కోరేవాడు (నిజానికి ప్రతివాడు ఇట్లాంటి సుఖాన్నే కోరుతున్నాడు. కాని దానికోసం యేం చెయ్యాలో తెలియక నానా బాధ పడుతున్నాడు) యేంచెయ్యాలో శాస్త్రం చెవుతున్నది. నీవు కోరే పరమ సుఖం కావాలంటే. అభిమానాన్ని విడిచిపెటాలి నాయనా. దాన్ని విడిచి పెట్టాలంటే. యేంచెయ్యాలో అది శాస్త్రం ఉపదేశించిన విధంగా తెలుసుకొని. అభ్యాసం చెయ్యి. నాయనా. అభిమానం పోతే రాగద్వేషాలు పోతవి. రాగద్వేషాలు పోతే కర్మలు చేయటం పోతుంది. కర్మలు చేయటం పోతే కర్మఫలమైన శరీరం అనేది రాదు. శరీరం లేకపోతే దుఃఖం ఉండదు. పరమసుఖం వస్తుంది. ఇదీ వరస తండ్రీ.

అంతేకాని దేవతలకు. దయ్యాలకు. మొక్కి ముడుపులుకట్టి. కానుకలు లంచాలు చెల్లించి. దరఖాస్తులు పెట్టుకొని బేరాలు ఆడితే నీ దుఃఖం

పోదురా అబ్బాయీ. పోకపోగా, ఇంకా ఎక్కువ అవుతుంది నాయనా అని శాస్త్రం నీ మేలుకోరి హితాన్ని బోధిస్తున్నది. కనుక ఈరోజునుంచి ఈ నిమిషంనుంచి శాస్త్రానుగుణ్యంగా నీ ప్రవర్తన మార్చుకోటానికి మొదలుపెట్టు. తపస్సు అంటే; ఈ ప్రయత్నమే. ఈ అభ్యాసమే సుమా·

# దుఃఖాదిసప్తకం

## 6. అవివేకం.

అయితే ఈ అభిమానం దేనివల్ల వచ్చింది. అంటే అవివేకం వల్ల అని శాస్త్రం బోధిస్తున్నది.

అవివేకం అంటే యేమిటి అంటే వివేకం లేకపోవడం. అవివేకం అంటే 'పృథగాత్మతా' ప్రకృతే పురుషుడు దేహమే జీవుడు, జీవుడే దేహం అనే తప్పుడు జ్ఞానంపోయి, అధ్యాసపోయి దేహమూ జీవుడు, ఈ రెండు వేరువేరుగా ఉన్నవని తెలుసుకోటం, యే విచారం చేత ఇట్లా తెలుస్తుందో అది వివేకం అన్నీ, ఈ విచారం, ఈ జ్ఞానం లేకపోవటం అవివేకం అనిన్నీ శాస్త్రమూ పెద్దలు చెప్తున్నారు.

ఆ విచారం చెయ్యటం ఎట్లాగో చూద్దాం పట్టు.

1) అభిమానానికి అవివేకమే ఎందుకు కారణంకావాలి? శరీరం కారణం ఎందుకు కాకూడదు అంటే విను. రక్తమాంసాదులతో కూడిన శరీరం క్షత్రియుడికి ఉంది. బ్రాహ్మణునకూ ఉంది. మరి ఒకడు నేను క్షత్రియుడను, మరి ఒకడు నేను బ్రాహ్మణుడను అనుకోటం దేనికి. కనుక అభిమానానికి శరీరం కరణం గాదని తెలుస్తున్నది గదూ.

(2) జట్టూ. బొట్టూ. కట్టూ జందెమూ. ఇలాంటి చిహ్నములు, గుర్తులు ఈ అభిమానానికి కారణం అవునేమో అంటే

ఇట్టి చిహ్నాలు వైశ్యునకు ఉంటున్నవి. క్షత్రియుడికి ఉంటున్నవి మరి ఇవన్నీ సమానంగా common గా ఇద్దరకీ ఉన్నప్పటికి ఒకడు నేను వైశ్యుడను అనుకొంటాడు, ఇంకొకడు నేనుఅక్షత్రియుడను అను

కుంటాడు దేనికి. కనుక ఈ గుర్తులు అభిమానానికి కారణం గాదు, అని విశదమవుతున్నది.

(3) పోనీ, స్త్రీ పురుషాభిమానంవలె, అవయవ విశేషం వల్ల అభిమానం గలుగ వచ్చుగదా అంటే విను.

నిద్రావస్థలోనూ మూర్ఛావస్థలోనూ సమాధి అవస్థలోనూ ఈఅవయవాలు జాగ్రత్స్వప్నాలలోవలె అట్లాగే ఉంటున్నప్పటికీ స్త్రీకి నేను స్త్రీని అని పురుషుడికి నేను పురుషుడను అనే అభిమానం ఆ నిద్రాది అవస్థలలో ఉంటున్నదా. లేదుగదూ. అందుచేత అభిమానానికి అవయవాలు కారణం గాదని తేలిందిగదూ.

4) పోనీ యేకులంలోని తల్లిదండ్రులకుపుట్టాడో అంటే ఆతల్లిదండ్రుల చేత విడువబడినశుక్లశోణితాలు కారణం కాకూడదాఅంటే విను.

తల్లిదండ్రులచేత విడిచి పెట్టబడ్డ వెంట్రుకలూ,గోళ్లూ, దంతాలూ మూత్రపురీషాదులకు నేటికిగూడ జాతిగాని. వర్ణంగాని ఆశ్రమంగాని ఈ మొదలైన వ్యవహారం అభిమానం ఉన్నదా లేదే?

అందుచేత తల్లిదండ్రులచేత విడువబడ్డ శుక్ల శోణితాలు అభిమానానికి కారణం గాదు.

అవివేకమే కారణం అంటున్నది శాస్త్రం.

ఈ పేర్లు గుర్తులు దేహాలకే గాని దేహంలోవున్న ఆత్మకు లేవని తెలుసుకోలేక పోవటం అవివేకం. అంటే పరమేశ్వరుడు ఉపదేశించిన విధంగా తనను ఆత్మను దేహంనుంచి వేరుచేసుకొని తెలుసుకోకపోవటం అవివేకం.

కనుక దేహాభిమానం అవివేకం వల్లనే గలుగుతున్నది అనేది సారాంశం—తేలిన విషయం.

ఈ విచారం వల్ల యేంలాభం అంటావేమోవిను.

ఆత్మకు, అంటే నీ నిజస్వరూపానికి, కాలత్రయంలో గూడా = జాగ్రత్స్వప్నసుషుప్తులందు ఎప్పుడూగూడా, జనన మరణ, నామ, రూప, జాతి, వర్ణ, గోత్ర, ఆశ్రమాది కల్పితమైన = అసత్యమైన వ్యవహారం లేనలేదు అనే వివేకం = జ్ఞానం సంపాదించుకోటమే ఈవిచారానికి ఫలం. ఈమాట నేఉపనిషత్తులన్నీ చెప్తున్నవి. అదేట్లాగో చూద్దాం.

1. నచర్మణో,నరక్తస్య న మాంసస్య
నచాస్థినః
నజాతి రాత్మనో జాతి ర్వ్యవహార
ప్రకల్పితా

(నిరాలంబ॥ ఉ॥ 21)

జాతి చర్మానికి లేదు. రక్తానికి లేదు. మాంసానికిలేదు, ఎముకలకు లేదు. ఆత్మకు లేదు. జాతి అనేది వ్యవహార నిమిత్తం కల్పింపబడింది.

2. నైవ స్త్రీ న పుమానేష
నచైవాయంనపుంసకః

(శ్వే. ఉ.5–10)

ఈ అత్మ స్త్రీ గాదు. పురుషుడు గాదు' నపుంసకుడుగాదు.

3. సర్వాశ్రమాదయో, దేహే మాయయా
పరికల్పితాః నాత్మనో బోధరూపస్య
మమతే సంతి సర్వదా
ఇతి యో వేద వేదాంతైః
సోఽతి వర్ణాశ్రమీ భవేత్

[నారద పరివ్రాజక ఉ॥ 6వ ఉపదేశం]

(1) దేవ, మనుష్య. తిర్యగాదిజాతులూ.
(2) బ్రాహ్మణ క్షత్రియాదివర్ణములూ.
(3) బ్రహ్మచర్యాది ఆశ్రమములూ.
(4) స్త్రీ పుంసాది లింగములూ.

ఈ భేదాలన్నీ శరీరములందు అవివేకంచేత కల్పింపబడ్డవిగాని, అద్వితీయమూ, అఖండమూ, చిద్రూపమూ అయిన ఆత్మకు (నాకు) అవి యేవియూ ఎన్నడూ లేవు. అని వేదాంత వాక్య శ్రవణాదికంచేత ఆత్మ తత్త్వానుభూతిని పొందినవాడు అతివర్ణాశ్రమీ అనబడుతాడు.

ఈ రీతిగా. ఉపనిషత్తుల యొక్క ఉపదేశాన్ని గీతోపదేశాన్ని విచారించి. దేనితోనూ సంబంధంలేని ఆత్మయైన తనను, కల్పితమైన. అసత్యమైన దేహంనుంచి వేరుచేసుకోలేక పోవటం అవివేకం అనబడుతున్నది.

కనుక సారాంశం యేమిటంటే, అవివేకంచేత అభిమానమున్నూ. అభిమానంచేత రాగద్వేషాదులున్నూ. రాగద్వేషాదులచేత కర్మములున్నూ కర్మములవల్ల శరీరమున్నూ. శరీరంవల్ల దుఃఖమున్నూ కలుగుతున్నవని శాస్త్రం నీ మేలుకొరకు ఉపదేశిస్తున్నది కాబట్టి మహాశ్రేయస్సును మోక్షమును పొందటానికి తగిన మానవ జన్మను పొందిగూడా తింటం, తాగటం మొదలైన ఇంద్రియార్థాలను అనుభవించటంలోనూ అనుభవించటానికి కావలసిన పదార్థాలను సంపాదించటంలోనూ నీ ఆయుష్కాలాన్ని పాడుచేసుకోకుండా. సజ్జన సాంగత్యంలో ఉంటూ పరమాత్మ తత్త్వ శ్రవణం చేస్తూ వివేకాన్ని. జ్ఞానాన్ని సంపాదించటంలో ఒక మెట్టునుంచి ఇంకోక మెట్టుమీదికి పోవటానికి ప్రయత్నం చేయాలి తండ్రి. ఈ ప్రయత్నమే తపస్సు, కనుక ఉట్టి తపస్సు చేయటానికి ఈ రోజే శపథం

చేసుకో నాయనా. ఈశ్వర కటాక్షానికి పాత్రుడవు కా బాబూ. శుభం కలుగుతుంది.

# దుఃఖాదిసప్తకం

## 7. అజ్ఞానం.

పైన మనం విచారించిన అవివేకం దేనివల్ల కలుగుతున్నది అంటే, అజ్ఞానం వలన కలుగుతున్నదని శాస్త్రం చెపుతున్నది.

అజ్ఞానం అంటె యేమిటో విను.

తెలియకపోవటం, దేనిని గురించి తెలయకపోవటం అంటే ప్రాపంచిక వస్తువుల గురించి తెలియకపోవడం గాదు మరేమిటంటే.

తను ఎవరో, తన స్వరూపం యేమిటో. పరమేశ్వరుడు యెవరో పరమేశ్వర స్వరూపం యేమిటో, తెలియకపోవటం.

1. తెలుసుకోలేకపోవటం ఒకటి.
2. తప్పుగా తెలుసుకోటం రెండు.

ఈ రెండు కలసీ అజ్ఞానం అనబడుతుంది అంటున్నది శాస్త్రం.

ఈ రీతిగా దుఃఖాదిసప్తకంలో మొదటిదిన్నీ మనం తీసేసుకోవాలని మహా ప్రయత్నం చేస్తున్నదిన్నీ అయిన దుఃఖానికి అసలు కారణం మూలం అజ్ఞానం రా నాయనా అంటూన్నది శాస్త్రం.

కనుక అజ్ఞానం పోతేగాని నీ దుఃఖం పోదురా తండ్రీ. గంగలో మునిగినా, యమునలో తేలినా. నోములు నోచినా, వ్రతాలు పట్టినా. ముడుపులు కట్టినా, జుట్టూ పెంచుకొన్నా ఈ దుఃఖం పోదురా అబ్బాయి. అసలు అజ్ఞానం అంటే లాభం కలిగించనివీటి నన్నిటినీ లాభం వస్తుందని తలంచి చేయటమేగా.

ఈ అజ్ఞానాన్ని తీసేసుకోటానికే అనేక జన్మల్లో చేసుకొన్న పుణ్యం అనే గొప్ప వెల యిచ్చి సంపాదించుకొన్న

'మనుష్యజన్మను'

ఈ పిచ్చి తలంపులతోనూ, వ్యర్థ ప్రయత్నాలతోనూ కాలహరణం చెయ్యటానికి తింటం, త్రాగటం, నిద్రపోవటం, సంతానం కలిగించుకోటం అనే మృగాలకు కూడా వుండే వాంఛలను తీర్చుకోటానికి. పొందలేదురా నాయనా; మరేమంటే నీ దుఃఖానికి అసలు కారణమైన అజ్ఞానాన్ని సమూలంగా తీసివేసుకోవటానికి (Eradicate) చేసుకోనటానికి మనుష్య జన్మను పొందావు. కనుక వళ్లువంచి. శాస్త్రం మీద నమ్మకముంచి, కాలహరణం గావీకుండా ఉపనిషత్సారమైన గీతను చదివి, గీతా వాక్యార్థంను శ్రవణం చేసి నీ అజ్ఞానంను నశింపచేసుకోరా నాయనా అని హితబోధ చేస్తున్నది శాస్త్రం.

కనుక ఈ అజ్ఞానం అనే పిశాచం, ఏమి హాని, నష్టం, కష్టం బాధ, దుఃఖం కలుగ జేస్తున్నదో అది పోవటం ఎలాగో, ఈ విషయాలను గురించి ఉపనిషత్తులు, గీత, యేం చెపుతున్నవో విచారించి తెలుసుకుంటే లాభం పొందుతాం. పీడ వదలిపోతుందిగదూ. అందుచేత తెలుసుకుందాం పట్టు

"అజ్ఞానం" అంటే ఏమిటో (Definition) నిరాలంబ ఉపనిషత్తు ఏం చెప్తున్నదో చూడు.

'రజ్జౌ సర్ప భ్రాంతిరివ
అద్వితీయే, సర్వానుస్యూతే, సర్వమయే
బ్రహ్మణి
దేవతిర్యఙ్మనుష్యస్థావర
స్త్రీపురుషవర్ణాశ్రమ బంధ మోక్షోపాధి
నానాత్మ భేద కల్పితం జ్ఞానం అజ్ఞానం'

(నిరాలంబఉపనిషత్తు. ఉ, 25)

తాడునందు. పాము అనే భ్రమ = పొరపాటువలె

(1) అద్వితీయమైనదిన్నీ = తానుతప్ప రెండవదిలేనిదిన్నీ

(2) సర్వానుస్యూతమైనదిన్నీ = ఏయేపదార్థం జగత్తులో కనబడు తున్నదో. వినబడుతున్నదో, దానిలోపలా బయటా అంతటా వ్యాపించి యున్నదిన్నీ. అంటే.

(3) సర్వమయమైనదిన్నీ = అన్నీ తానేఅయి ఉన్నదిన్నీ అయిన బ్రహ్మము = పరమాత్మ = పరమేశ్వరుని యందు. వీరుదేవతలు. ఇవి మృగములు. వీరు మనుష్యులు, వీరు స్త్రీలు, వీరు పురుషులు. అనిన్నీ బ్రాహ్మణులు. క్షత్రియులు మొదలైన వర్ణములనిన్నీ గృహస్థులు. సన్న్యాసులు మొదలైన ఆశ్రమములనిన్నీ. ఇది బంధమనిన్నీ. ఇప్పుడు బంధంలో ఉన్నాను. ఇది మోక్షమనిన్ని. మోక్షంకోసం ప్రయత్నం చెయ్యాలి అనిన్నీ.

వాస్తవంలో వున్నది తాడే అయినా పొరపాటుచేత = భ్రాంతిచేత పాము అనుకొని. పామును కల్పించి. భయంపొంది, బాధను అనుభవించినట్లుగా.

సత్యమై, ఏకమై, అద్వితీయమై సచ్చిదానంద అఖండైకరసమై యున్న "బ్రహ్మమునందు" అనేకమైన దేహాలకు సంబంధించిన భేదాలు ఏ భ్రాంతిచేత, పొరపాటునేత. తప్పుడు తెలివిచేత సంకల్పింపబడు తున్నవో బాగా కల్పింపబడుతున్నవో ఆతప్పుడు తెలివినే "అజ్ఞానం" అంటున్నది నిరాలంబోపనిషత్తు . అంటే

సంకల్పాలు = బాగా, స్థిరంగా కల్పింపబడ్డ అసత్యభావనలు దేని వల్ల కలుగుతున్నవో అదే "అజ్ఞానం" అని చెప్పబడుతున్నది. సంకల్పాలు అంటే (Definition) నిర్వచనం ఏమిటో చూడు.

అధిష్ఠానాజ్ఞానదోషేణ
శుక్తౌ రజత ప్రత్యయవత్
అద్వితీయే, నిర్విశేషే, పరేబ్రహ్మణి
ఘటః, పటః కుడ్యమ్ ఇతి
భ్రాంత్యా సమ్యక్ కల్పితాంత ఇతి
సంకల్పాః విపరీతప్రత్యయాః

అంటే

సర్వాధిష్ఠానమైన పరమేశ్వరుని యొక్క నిజ తత్త్వాన్ని ఆత్మ తత్వాన్ని తెలుసుకోలేకపోవటం అనే "అజ్ఞానదోషం" వల్ల రెండవది లేనిదిన్నీ, ఏ విశేషములేనిదిన్నీ అయిన పరబ్రహ్మము నందు ఇదికుండ. ఇది బట్ట ఇదిగోడ, ఈ మొదలైన భ్రాంతిచేత సం= సమ్యక్ బాగాస్థిరంగా. విడిచిపెట్టటానికి వీలులేకుండా కల్పింపబడ్డ పదార్థాలు సంకల్పాలు అనబడుతున్నవి. అంటే విపరీత భావనలు అన్నమాట అధిషానం అంటే ఏమిటో తెలుసుకుందాం.

భ్రాంతికి = పొరపాటుకు కారణమైనదిన్నీ సత్యమైనదిన్నీ అయిన ఏ వస్తువు గలదో.

ఏది భ్రాంతి కాలంలో ప్రతీతం కాదో, కనబడదో. తోచదో, ఏది ప్రతీతమైతే కనబడితే. తోస్తే భ్రాంతి తొలగిపోతుందో దానిని "అధిష్ఠానం" అంటారు.

ఉదాహరణ :—రజ్జు సర్పము, అంటే తాడును పాము అనుకోటం

తాడు అధిషానము, సత్యము పాము భ్రాంతి. అసత్యము.

పామని భ్రాంతి వున్నంతసేపూ త్రాడు కనబడదు. తోచదూ, తాడును విచారం చేత తెలునుకుంటే, పాము లేకుండాపోతుందిగా.

ఈ విచారించేత ఏం తేలిందయ్యా అంటే సర్వాధిష్ఠానమైనపరమేశ్వరుని నిజతత్వ జ్ఞానం సంపాదించుకుంటే=తన యొక్క జని తత్వాన్ని తెలుసు కుంటే=ఆత్మ యొక్క నిజతత్వాన్ని తెలుసు కుంటే= "అజ్ఞానం" అంతరిస్తుంది. నీ దుఃఖానికి మూలకారణం "అజ్ఞానమే" గనుక, ఈ "అజ్ఞానం" నశిస్తే దుఃఖం లేకుండా పోతుంది.

కనుక "ఈ అజ్ఞానం" "జ్ఞానం" వీటిని గురించి మరింత వివులంగా తెలుసుకోటానికి, ఇతర ఉపనిషత్తులు, గీత ఏం చెప్తున్నవో వాటిలోని కొన్ని వాక్యాల అర్థాన్ని తెలుసు కొందాంపట్టు.

1. దేహోఽహమితి యద్జ్ఞానం తదేవా
జ్ఞానముచ్యతే

(తేజోబిందు ఉ. 5–9?)

నేను దేహమును అనే ఏజ్ఞానం (సామాన్యంగా అందరికి) ఉన్నదో అదే అజ్ఞానం అంటున్నది, తేజో బిందు ఉపనిషత్తు.

2. దేహోఽహమితిసంకల్పో
మహత్సంసార ఉచ్యతే

(తే. బిం. ఉ. 5-89)

'నేను దేహమును' అనే సంకల్పమే
(అసత్యభావనయే) సంసారం.

3. దేహోऽ మితి సంకల్పం తద్దుఃఖ
మితీచోచ్యతే
దేహోహమితీ యద్ జ్ఞానం
తదేవనరకం స్మృతం

(తే. బిం. ఉ. 5-90)

'నేను దేహమును' అనే సంకల్పమే దుఃఖమనబడుతున్నది. 'నేమ దేహమును" అనే భావనయే నరక మనబడుచున్నది.

అంటున్నది తేజో బిందు ఉపనిషత్తు,

ఈ అజానం కే

1) మాయ 2) అవిద్య 3) ప్రకృతి 4) అవ్యక్తం 5) తమస్సు 6) మోహం ఈ మొదలైన పేర్లన్నీ ఉన్నయ్.

కనుక "మాయ"ను గూర్చి కొంత లోతుకుపోయి తెలుసు కుందాం.

మనం మాట్లాడుకోవటంతో కూడ వాడు మాయ ముండాకొడుకురా వాడిదగ్గర మాయ తప్పితే ఏం లేదురా అంటుంటాం. అంటే ఏమిటీ, వాడు అబద్ధాలు చెప్పుతుంటాడు. లేని దానిని ఉన్నట్లుగా కల్పించి నచ్చ చెప్పుతూంటాడు అనేగదా అర్థం.

ఈమాటే ఉపనిషత్తులు గీత చెప్తున్నవి. అసలు మాయ అంటే 'యామాసామాయా యా = ఏది. మా = లేదో. సా = అది. మాయా = మాయ. ఏదిలేదో అదిమాయ అని వ్యుత్పత్తి అర్థం.'

యా నవిద్యతే వస్తుతః సామాయా

(సర్వసార॥ ఉ॥ 12)

ఏదివాస్తవంగా లేదో అదే మాయ.

ఈ అరం ఉత్తములైనవాళ్ళకు. బాగా బాగా అభ్యాసంచేసిఈశ్వర కటాక్షానికి పాత్రులై సూక్ష్మబుద్ధికలిగి పరమేశ్వర తత్వాన్ని అర్థంచేసు కొగల మహాత్ములైన మొదటిరకం వాళ్ళకు పరమేశ్వరుని పొందగలిగే వాళ్ళ కోసం చెప్పబడుతన్నది.

మాయానాస్తి మాయాకార్యాదికం నాస్తి
(తే. బిం. ఉ॥ 5–32)

మాయలేదు. **మా**యయొక్క కార్యము (పని) అని చెప్పబడే ప్రపంచం = జగత్తు = 14లోకాలు. ఈలోకాలలోని పదార్థాలు ఇవన్నీలేనే లేవు.

'బ్రహ్మమాత్రం జగదిదం' బ్రహ్మమాత్రంత్వ మప్యహం
(తే. బిం. ఉ. 5–30)

ఉన్నది బ్రహ్మము ఒక్కటే. ఆ బ్రహ్మమే నీవూ నేనూ అని తేజో బిందు ఉ॥ స్పష్టంగా సందేహానికి తావులేకుండా ఉపదేశిస్తున్నది.

ఈ మాటల అర్థంయొక్క అనుభవం అందరికీ రోజూ నిద్రలో ఉన్నదే గదూ. నిద్రలో నీదేహం గాని, నీమనస్సు గాని, నీఆస్తిపాస్తులు గాని, ఏమీలేకుండా నీ వొక్కడవే గదూ ఉండేది. అప్పటి నీస్వరూపం ఏదైతే ఉన్నదో, పాపపుణ్యాలూ, ధర్మాధర్మాలూ ఆశలుకోరికలూ.భయం బాధా, ఏమీలేకుండా ఆనందమయమైనదే అసలైన నీ ఆత్మస్వరూపం. అదే స్వరూపం జాగ్రత్‌నందు స్వప్నమందు ఎడతెగకుండా ఉన్నప్పటికీ నీ అజ్ఞానం ప్రాపంచిక పదార్థాలమీద ఆశ దాన్ని ఆచ్ఛాదించి కప్పిపుచ్చి ఇంకొ విధంగా కల్పించి, నీకు లేనిపోని పీడంతా కలిగిస్తున్నది అని ఉప నిషత్తులన్నీ బోధిస్తున్నయ్.

ననిరోధోనచోత్పత్తిః నబద్ధోనచసాధకః
నముముక్షుర్నవైముక్తః ఇత్యేషాపరమార్థతా

(అమృతబిందు. ఉ. 10)

(ఆత్మ. ఉ. చివరిమంత్రం)

జగత్తుయొక్క ఉత్పత్తిలేదు. నాశములేదు. జగత్తే లేకపోతే ఇక జగత్తులో ఉన్నారని చెప్పబడే బంధంగలవాడూలేడు

సాధకుడూ లేడు

ముముక్షువూ లేడు. మోక్షం కోరేవాడూలేడు

ముక్తుడూలేడు

ఇదేపరమార్థం = నిశ్చయమైన తత్త్వం అంటున్నయ్. అమృతబిందు ఉ. ఆత్మ ఉ. అంటే సత్యమైంది బ్రహ్మము అని ఒక్కటే అర్థం

ఈ మాటే గీతామాతగూడ చెప్తున్నది.

బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే
వాసుదేవస్సర్వమితి స మహాత్మాసుదుర్లభః

(గీత. 7-19)

అనేక జన్మల్లో చేసిన అభ్యాసపాటవం చేత సంపాదించుకున్న ఈశ్వరకటాక్షం వల్ల పొందిన బుద్ధి నైశిత్యంచేత

పరమేశ్వరతత్త్వం తెలుసుకొన్నజ్ఞాని.

"వాసుదేవస్సర్వమితి" అంతా బ్రహ్మమే. వాసుదేవుడే "సర్వమిదమహంచ బ్రహ్మైవ" ఈసమస్త జగత్తూ నేనూ బ్రహ్మమే అంతా రామమయం. కృషమయం శివమయం అనే నిశ్చయం గలిగి వుంటాడు

అనగా శుకుడూ వామదేవుడూ ప్రహ్లాదుడూ ఆంజనేయుడూ మొదలైన వారివలె చాలా చాలాఅరుదుగా ఉంటాడు. కాదుమరీ బొగ్గులు, బస్తాలు టన్నులూ రైల్వేగుడ్సు పెట్టెలు వాగన్లనిండాఉంటవి–వజ్రాలో

మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే
యతతామపి సిద్ధానా కశ్చిన్మాంవేత్తి తత్త్వతః
(గీ. 7-3)

అంటున్నదిగీత

కాని

అంతపైకిపోనిమధ్య తరగతి వాళ్ళున్నారే వాళ్ళు ఏమంటారంటే ఈజగత్తూదీనిలోని సర్వపదారాలూ, అందరి అనుభవంలో స్పష్టంగా ఉంటుంటే లేదనటం ఏమిటి నమ్మటం ఎట్లా? దీనికి ఏదోకారణం ఉండాలి అంటారు

ఈమధ్యరకంవాళ్ళనుపైకి తీసుకు పోయ్యేటందుకు ఒరే నాయనా బ్రహ్మసత్యం జగన్మిథ్యా॥అసలు సత్యమైందిబ్రహ్మమేరా.

జగత్తు అనేది అంటే దేహము, ఇంద్రియాలు, మనస్సు, ఇతర పదార్థజాలము అంతామిథ్య అంటే లేనేలేవుగాని కలలోని వస్తువులవలె ఉన్నట్లుగామాత్రం కనబడుతున్నవి. తలంచబడుతున్నవి.

అట్లాకనబడటం తలంచబడటం దేనివల్లఅంటే దైవమాయ నాయనా । ఈశ్వరమాయచేతరా అంటున్నయ్ ఉపనిషత్తులలోని కొన్ని వాక్యాలు ఎందుకూ అంటే ఈమధ్య రకంవాళ్ళు ఏపరిస్థితిలో ఉన్నారో దానికి తగినట్లుగా మొదట బోధించి పైమెట్టు ఎక్కటానికి ఏం చెయ్యాలో బోధిస్తాయ్ ఉపనిషత్తులు.

ఈ రెండో రకం వాళ్లు మాయచేత జగత్తు సృష్టింప బడుచున్నది అనిచెప్తే ఓహో అదా విషయం సరిసరి అరం అయింది. అని తలలు ఊపి తాత్కాలికంగా తృప్తి పొందుతారే

గాని

ఎవడైనా మాయచేస్తున్నాడు మోసంచేస్తున్నాడు అంటే ఏదోవాడికి కావలసిన దానిని పొందటానికి వాడికోరిక సిద్ధింప చేసుకోటానికి చేస్తాడుగదా మరి ఏకోరికా లేనివాడున్నూ. సర్వైశ్వర్య సంపన్నుడున్నూ ఏమీ తక్కువ లేనివాడున్నూ అయిన సర్వేశ్వరుడు ఏలాభాన్ని కోరి తనకు లేని ఏవస్తువును పొందటానికి ఎవరి మీద యీమాయా ప్రయోగం చేస్తాడు. ఎవరిని మోసం చేస్తున్నాడు.

అనే విచారం చెయ్యగల సామర్థ్యం ఈ రెండో తరగతి వాళ్ళకు లేని కారణం చేత "సరే" అంటారు.

తరువాత ఇంకా అభ్యాసం చేస్తూపోగా. ఉపనిషత్సారాన్ని పిండి త్రాగటానికి ఇంకా ప్రయత్నం చేస్తూపోగా పరమేశ్వర కటాక్షానికి పాత్రులై

ఈ మాయ

పరమేశ్వరుని కంటె వేరుగా వేరే పదార్థమై వేరేచోట ఉన్నదాలేక ఆయనలోనే ఒక భాగమై ఉన్నదా.

వేరే పదార్థమై ఉందంటే

ఏకమేవాద్వయం బ్రహ్మనేహనానాస్తికించన

(మ. నా. ఉ. 3. అ)

బ్రహ్మము ఏకమూ అద్వితీయమూ ఇచ్చట నానాత్వం లేశలేదు అనే ఉపనిషద్వాక్యానికి వ్యతిరేకమౌతుంది. అందుచేత వేరుగా ఉండటానికి వీలులేదు.

పరమేశ్వరుని లోనే ఉన్నది అందామంటే ఆయన పొట్టలోనా చేతిలోనా. మనస్సులోనా ఎక్కడ వున్నది.

నిష్కలం నిర్వికల్పం నిరాకారం నిర్గుణం బ్రహ్మమునకు ఆకారమే లేదు. చేతులూ కాళ్ళు అనే అవయవాలేలేవు. మనసు లేదు. అనిచెప్పే ఉపనిషద్వాక్యాలకు వైరుధ్యం వస్తుంది.

ఆయనకంటె వేరుగాకుండా అభిన్నంగా ఉందంటామా అంటే.

అభిన్నము అంటే మాయే బ్రహ్మము బ్రహ్మమే మాయ అన్నట్లవుతుంది.

మాయ అంటే అజ్ఞానం గనుక అజానమే బ్రహ్మము అన్నట్లు అవుతుంది కాని

చిద్రూప మాత్రం బ్రహ్మైవ

(తై. బి. ఉ. 3-26)

ప్రజ్ఞానం బ్రహ్మ

(ఐతరేయ. ఉ.)

జ్ఞానమే బ్రహ్మము అను ఉపనిషద్వాక్యములకు వైరుధ్యం వస్తుంది.

అని విచారం చేసి నిజ తత్వాన్ని తెలుసుకొని మాయానాస్తి మాయా కార్యాదికంనాస్తి

అనే నిర్ణయానికి వచ్చి ఈశ్వర కటాక్షాన్ని పొంది విదేహముక్తిని పొందుతాడు.

అదేట్లా అంటే—

యథా నద్యస్స్యందమానాః
సముద్రే అ_స్తం గచ్ఛంతి నామరూపేవిహాయ
తథా విద్వా న్నామరూపా ద్విము_క్తః
పరాత్పరం పురుషముపైతి దివ్యం
(ముండక. ఉ. 3-2-8)

వేరు వేరు చోట్ల పుట్టి వివిధాలైన ఆకారాలతో ప్రవహించేటప్పుడుగంగా, గోదావరీ, కృష్ణా, కావేరీ అనే వేరువేరు నామాలు కలిగిఉన్నప్పటికిన్నీ సముద్రాన్ని చేరిన తర్వాత సముద్రమే అయిపోయినందువలన అంటే ఈపక్కనీరు గంగానదిది, ఆ ప్రక్కనీరు గోదావరి నదిది, ఈ మధ్యనీరు కావేరీనదిది అనే విభాగాలు ఏమీ లేకుండా, అంతా సముద్రమే అయిపోయినందువలన ఇదివరకు వేరు వేరుగా ఉన్న నామరూపాలను పోగొట్టుకొన్న నదుల చందాన

జ్ఞాని బ్రహ్మమే అయిపోయి తన నామరూపాలను వదలగొట్టు కోటం అనే విదేహకైవల్యాన్ని పొందుతాడు. అంటున్నది ముండక ఉపనిషత్తు

'కర్పూర మనలే యద్వత్ సైంధవం సలిలే యథా'
(శాండిల్య ఉ. ప్ర. అ)

అగ్నిలోబడిన కర్పూరం అగ్నే అయిపోయిన చందాన నీటిలో బడ్డ ఉప్పుగడ్డ నీళ్లే అయిపోయిన విధాన మళ్ళీ కర్పూరాన్ని అగ్ని నుండి వేరుచేయటానికి ఎట్లా వీలుగాదో అట్లాగే జ్ఞానితిరిగి సంసారం లోకిరాడు. అంటున్నది శాండిల్య ఉపనిషత్తు.

ఈమాటే చెప్తున్నది గీతామాత

మాముపేత్యతు కౌంతేయ
పునర్జన్మ నవిద్యతే

(గీ. 8-16)

'బ్రహ్మసత్యం మాయానాస్తి.మాయాకార్యాదికంనాస్తి' అనేవాక్యార్థ జ్ఞానాన్ని సంపాదించి పరబ్రహ్మనైన నేనే అయిపోయిన జ్ఞానులకు పునర్జన్మ అనే లేదు,

అని భగవంతుడు గ్యారంటీ ఇస్తున్నాడు.

కనుక వాస్తవంలో లేనిదైనా ఉన్నట్టుగామాత్రం కనబడుతూ చిత్రవిచిత్రంగా నీకు జీవత్వాన్ని కలిగించి ఆత్మ తత్త్వాన్ని నీకు అందకుండా చేస్తున్న ఈమాయను జయించటానికి ప్రయత్నం ఎట్లా చెయ్యాలో చూద్దాం పట్టు.

మాయ అంటే

మం = జీవాత్మానం

అయతి = ప్రాపయతి పరమాత్మానం

అసంగమితి మాయా అని వ్యుత్పత్తి.

అంటే

అసంగమైన నిర్వికారమైన అంటే ఏమార్పు పొందకుండా ఉండే పరమాత్మ స్వరూపమైన నీకు జీవత్వాన్ని కలిగించేది కాబట్టి మాయ అని అర్థం,

మీయంతే పదార్థాః అనయా.

అంటే పరమేశ్వరుని కంటె వేరుగా లేనట్టి జగత్తూ పదార్థాలు వేరుగా సత్యంగా ఉన్నట్లు దీని ప్రభావం చేత భావన గల్గుతున్నది. కాబట్టి మాయ అనబడుతున్నది.

'ఏతద్యోగేన పరమపురుషోజీవో భవతి'

(ముద్గల. ఉ. 4)

ఈమాయా సాంగత్యం వల్లనే యథార్థంగా పరమ పురుషుడవైన నీకు జీవత్వం కల్పిత మవుతున్నది.

(కల్పితమైంది అంతా అళీకమే = అసత్యమేగా) అంటున్నది ముద్గల ఉపనిషత్తు.

యద్వన్మృదిఘటభ్రాంతిః శుక్తౌరజతస్థితిః
తద్వద్బ్రహ్మణిజీవత్వం వీక్షమాణేవినశ్యతి
యథామృదిఘటోనామ, కనకేకుండలాభిధా
శుక్తౌరజత ఖ్యాతిః జీవశబ్ద స్తథాపరే

(యోగశిఖ. ఉ. 1-13-14)

మట్టియందు కుండరూపమైన భ్రాంతిన్నీ మట్టికంటె కుండఅనేది ఒకటి సత్యమైన వస్తువు ఉన్నదా? లేదు గాబట్టి కుండఅనుకోటం పేరుతో ఆకారంతో భావించుట భ్రాంతేగా (పొరపాటేగా)

శుక్తి (ముత్యపుచిప్ప) యందు వెండి అనే భ్రమ అట్లే బ్రహ్మము నందు జీవత్వభ్రాంతి విచారణ చేసి నిజంతెలుసుకొనే వాళ్ళకు భ్రాంతి పోయి పరమేశ్వర నిజతత్వం తెలుస్తుంది.

మృత్తికయందు కుండఅనే పేరు బంగారమందు కుండలము అనే పేరు (అభిదానం) శుక్తియందు రజితము–వెండి (అనేతలంపు)

ఎట్లా అసత్య కల్పనమో

అట్లాగే

అవ్యయ పరబ్రహ్మమునందు జీవుడనే పేరు అజ్ఞానం చేత విచారించకపోవటంవల్ల తెలివిలేకపోవటంచేత కల్పింపబడుతున్నది. అంటున్నది యోగ శిఖ ఉపనిషత్తు.

కొంతమంది ఏమంటారు అంటే -

అసలు ఈ మాయ నాకు

(1) ఎందుకు వచ్చింది.

(2) మొట్టమొదటగా ఎప్పుడు వచ్చింది అది తెలియాలి అంటారు.

ఎందుకో తెలియటం ? తెలిస్తే వీళ్ళకు జరిగేదేమిటో! అసలు ఇట్లా అడగటమే మాయ అజ్ఞానం అని ఈఅజ్ఞాన శిరోమణులు తెలుసుకోవటం లేదు.

అదెట్లాగో విచారిద్దాం పట్టు -

అసలురాలేదు నాయనా అనే పరమార్థాన్ని అన్ని ఉపనిషత్తులు. గీత చెపుతున్నవిరా అంటే ఆపెద్దమాట వీళ్ళకు ఎక్కదు. రాకపోవట మేమిటి ? చస్తూంటే ? ఒకచెంపనుంచి - అంటారు వీళ్ళు.

పోనీ ! సరే నీవన్నట్లు వచ్చిందిరా .
దీనిని తీసేసుకోటానికి ఇది ఉపాయం నాయనా అంటే ఎందుకువచ్చిందో! ఎప్పుడు వచ్చిందో ? అది తేలాలి అంటారు. అంటే ఏమిటి ?

వీళ్ళకు ఈ మాయరోగంతో చస్తూ సతమతమవుతూ నానాగడ్డి తింటూ బాధలు దుఃఖాలు అనుభవించటమే ప్రధానంగాని, దాన్ని తీసేసు కొనేమందును సేవించటం ప్రధానంగాదు.

వీళ్ళ పరిస్థితి ఎట్లావుంది అంటే? 105 డిగ్రీల జ్వరంతో బాధ పడుతున్నప్పటికిన్నీ డాక్టరును పిలిపించి ఆయన చేత పరీక్ష చేయించి ఆ యన చెప్పిన మందును prescription ప్రకారం పుచ్చుకో మంటే డాక్టరుగారిమందు తరువాత పుచ్చుకుంటా.

గాని ఈజబ్బు నాలో ఎందుకు వచ్చిందో ముందు తేలాలి అనే రోగి విధంగా ఉంటుంది. ఇక ఇది ఎప్పుడు మొదలైంది కారణం ఏమిటీ అనేవాళ్లకు శాస్త్రంఏంచెప్తున్నదంటే

## మాయా నామ అనాది రంతవతీ

సర్వసార ॥ఉ॥ 12)

ఈమాయ అనాది గానాయనా
దీని ఆది అంటే మొదలు = కారణంతెలియబడటం లేదు రాతంగ్రీ
అసలు విషయం ఏమిటంటే

## 'యా న విద్యతే వస్తుతః సా మాయా'

(సర్వసార ॥ఉ॥ 12)

ఏదివాస్తవంగా లేదో అది మాయ అనిచెప్పి తేను లేనిదానికి కారణం ఏమిటా నాయనా అంటే తలకెక్కని వాళ్ళకు దీని మొదలు, కారణంతె లియబడదు అని చెప్తున్నవి ఉపనిషత్తులు

ఓహో ఇది అనాది దీని ఆదిలేదు గనుక అంతంగూడా లేదన్న మాటే

మరిదీన్ని తీసేసుకోడానికి శాస్త్రం సాధన చెయ్యాలి అనిచెప్పటం ఏమిటి. ఎందుకు ఈకష్టం గూడా అని అంటారు కబట్టి,కాదురానాయనా, అనాదేగాని

ఇది అంతవతి దీనికి అంతం ఉన్నది దీన్ని అంతం చేసు కోటానికి ఉపాయం ఉన్నది ఆఉపాయాన్ని తెలుసుకొని సాధన చేసిదీన్ని అంతం చేసు కొన్న వాళ్లూ ఉన్నారు అంటున్నవి గీత ఉపనిషత్తులూ.
కాని దీనిస్వరూపం ఏమిటో ఎట్లాఉంటుందో ఎవరికీ తెలియటంలేదు.అందు వల్లే దీనికి
"అవ్యక్తం" "అవ్యాకృతం"అనే పేర్లుగూడాఉన్నవి. దీనినిమహాఅద్భుతా అనిర్వచనీయరూపా" మహాద్భుతం. నిర్వచింప శక్యంగానిది. (The most wonderfuli,:Indefinable)అంటున్నారు పెద్దవాళ్లు.

ఇది చేసేపనివి బట్టి ఇదిఇంథని చెప్పటమేగాని దీన్నిఎవడూ చూడ లేడు చూడలేడు గూడాను. దీన్ని తీసేసుకోవాలంటే దీన్నిచూడాల్సిన అవసరం గూడా లేదు అంటున్నయ్ శాస్త్రాలన్నీ. ఇదిచేసే పనిని మాత్రం దీనివల్లకలిగే "effect" నుతీసేసుకోటాబూ. అనిఏంచెయ్యాలో మార్గాన్ని బోధిస్తున్నవి ఉపనిషత్తులు, గీత

దైవీహ్యేషా గుణమయీ మమమాయా
దురత్యయా మామేవయే ప్రపద్యంతే మాయా
మే తాంతరంతితే

(గీ. 7-14)

పరమేశ్వరుడనైన నాతత్త్వం తెలుసుకోటానికి ప్రయత్నం చేయ టమనే, నాప్రపత్తినే ఎవరు చేస్తారో వాళ్లేమాయను జయిస్తారు అని భగ వంతుని ఉపదేశంనాయనా

సరి అదావిషయం, ఇదిచేసే పనేమిటో, ఇది కలిగించేనిష్టం = క ష్టం = బాధ = దుఃఖం ఏమిటో, తెలిస్తే బాగుంటుందిగా.

అట్లాదారికి వచ్చి వినటానికి సుముఖుడవైతే చెప్తాఅదీ బాగుపడే లక్షణం విను.

'మాయాచ తమోరూపా, తదేతజ్జడం మోహాత్మకం'

(నృ. ఉ. తా. ఉ. 9వ ఖండం)

ఈ మాయ తమోరూపం. చీకటివలె అవరణస్వరూపం. చీకటి ఏం జేస్తుంది. వస్తువుయొక్క సత్యమైన స్వరూపాన్నికప్పేస్తుంది కన బడకుండా చేస్తుంది. పైగా అసత్యమైన స్వరూపాన్ని గూడా తోచింప జేస్తుందిగదూ.

అలాగే ఈమాయ ఏంజేస్తున్నదంటే—

1) "నీవు పరమాత్మవు. ఆనంద స్వరూపుడవు. పుట్టేవాడివి చచ్చే వాడివిగాదు. ఏవిధమైన దుఃఖం లేనివాడివి'' అని గీతామాతా ఉపనిషత్తులూ అన్ని బోధిస్తూంటే—

"నాబొంద నేను పరమాత్మ ఏమిటి ఏమీతెలియని మూఢుణ్ణి (Fool)ను అయితే పుట్టేవాడను చచ్చేవాడనూ అకలిదప్పులూ ఆధి వ్యాధులూ దుఃఖం బాధతో చస్తున్న వాడిని అని అనుకునేట్టు చేస్తున్నదిరా అబ్బాయి ఈమాయ అంటున్నది నృసింహ ఉత్తర తాపిని ఉపనిషత్తు.

ఈమాటే అధ్యాత్మ రామాయణం మరింత స్పష్టంగా చెప్తున్నది చూడు.

'అనాత్మని శరీరాదా వాత్మబుద్ధిస్తు యా భవేత్
సైవ మాయా తయైవాసౌ సంసారః పరికల్ప్యతే'

(అధ్యాత్మరామాయణం 3-4-22)

అంటే తానుకాని శరీరమందు తాను "ఆత్మ="నేను'' అనే భ్రాంతి జ్ఞానం=తప్పుడు అభిప్రాయం ఏది ఉన్నదో అదేమాయ. ఆ మాయ చేతనే దుర్వారమై, దుర్భరమై. దుఃఖజనకమై, దురంతమైన. ఈ సంసారం కల్పింపబడుతున్నది. అంటున్నది అధ్యాత్మ రామాయణం.

ఈ మాటే గీతామాత గూడ చెప్తున్నది. అదెట్లాగో విచారిద్దాం చూడు.

'అజ్ఞానే నావృతం జ్ఞానం
తేన ముహ్యంతి జంతవః'

(గీ. 5-15)

ఆత్మ = (తాను) = నేను అనబడే ఏసత్యమైనవస్తువు ఉన్నదో అది.

1) దేహం ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి ఈ మొదలైనవాటి అన్నిటికంటె భిన్నంగా, వేరుగా ఉన్నదనిన్నీ.

2) అవిక్రియం = నిర్వికారం = ఏవిధమైన మార్పులూ (changes) లేనిదనిన్నీ (immutable) అనిన్నీ

3) చిద్రూపం = జ్ఞానస్వరూపం అంటే స్వప్రకాశంమున్నూ, తన్నుతాను తెలుసుకొనేది, ఇతరములను తెలియజేసేది అలాటే సర్వజ్ఞము = omniscient అనిన్నీ

4) పరిపూర్ణం = అంతటా, అన్ని వస్తువుల బైటాలోపల వ్యాపించి ఉన్నది. All Pervading, Omnipresent అనిన్నీ

5) అద్వితీయం = తాను తప్ప రెండది వలేనిది (Non-dual) అనిన్నీ

6) అఖండైకరసం = చిదానందైకరసం. అజ్ఞానలేశంగూడాలేని జ్ఞాన రసమున్నూ దుఃఖలేశంగూడాలేని అనందరసమున్నూ
Pure knowledge and Unalloyed Blissఅనిన్నీ

అపరోక్షంగా = అనుభవపూర్వకంగా = ప్రత్యక్షంగా సంవేదనము = తెలుసుకోటం, సాక్షాత్కారం చేసుకోటంను "జ్ఞానం" అని చెప్తున్నయ్ శాస్త్రాలన్నీ. దీనికి విరుద్ధంగా వ్యతిరేకంగా నేను "ఆత్మ" ను గాను

మరేమంటే

దేహేంద్రియాదులను
వికారాలు కలవాడినీ
ఏమీంతెలియని మొద్దునూ
పరిమితమైనచోట ఉండేవాడిని

నావలె చాలా మంది వేరుగా ఉన్నారు. ఆత్మ ఒక్కటే గావటం ఏమిటి

అఖండై కరంః. ఆనందస్వరూపంట దుఃఖంతో బాధతో సతమతం అవుతూంటే ఏడ్చినట్లుంది. ఈఉపదేశం

అని

నీ అసలు స్వరూపాన్ని మరుగుపరిచి = కప్పిపుచ్చి = ఆచ్ఛాదించి = ఆవరించి

కనబడకుండా. తెలియకుండా. తోచకుండా చేసి. నీకు తప్పుడు భావాలు గలిగించి నీచేత అవాకులు చవాకులు మాట్లాడించేదిన్నీ శాస్త్రానికి విరుద్ధంగా ప్రవర్తింపజేసేదిన్నీ. ఏది అనుకుంటున్నావు అదే అజ్ఞానం = మాయ = అవిద్య = ప్రకృతి = అవ్యక్తం = నాయనా

2) దానికి రెండు విధమైన శక్తులున్నయ్

1) ఆవరణశక్తి 2) విక్షేపశక్తి

నీ అసలు స్వరూపాన్ని కనబడనీకుండా తోచకుండా చేసేది ఆవరణ శక్తి

తోచకపోతే పోయిందిగాని పైగా తప్పుడు త్రోవను బట్టించి, చచ్చేవాడివి. పుట్టేవాడివి, దుఃఖం అనుభవించే వాడివి అని నీకు లేని లక్షణాలను ధర్మాలను నీమీదపడేసి నిన్ను ముప్పు తిప్పల పెట్టట మనేది విక్షేపశక్తి. ఇదీనాయనా ఈమాయాకార్యం ఇది చేసే పని. దీనివల్ల వచ్చే కష్టం, నష్టం. బాధ. దుఃఖం. సంసారం. ఇదే "జ్ఞానాన్ని" ఆవరించటం వల్ల ఈ జంతువులు = తెలివితక్కువైన fools అందరు మోహాన్ని పొందుతున్నారు. అంటే, ఉన్నదాన్ని ఉన్నరీతిగా తెలుసుకోకపోవటం =

అగ్రహణం = గ్రహించలేకపోవటం, వేరే తప్పుడు రీతిగా తెలుసుకోటం = అన్యధాగ్రహణం. అనే మోహాన్ని పొందుతున్నారు.

"ఇలా దీని ప్రభావం వల్ల గలిగే నష్టం = దుఃఖంఅందరూ అనుభవిస్తున్నారు. గాని దీనిని ఎవరూ చూడజాలకున్నారు.

అదెట్లా అంటే 1) గారడీ చేసేవాని గారడీ చేసే శక్తిని ఎవరూ చూడటం లేదుగాని. గారడీ కార్యమైన డబ్బాలో రూపాయలు పడకపోయినా పడినట్లు చప్పుడు వినబడటం మామిడిచెట్టు పుట్టకపోయినా. పుట్టి దానికి కాయలు గూడ కాసినట్టు కనబడటం, సంచిలో పిల్లవాడు కూర్చోకపోయినా కూర్చున్నట్లున్నూ కత్తి పెట్టి వాడు పొడవబడక పోయినా పొడవబడ్డట్లు కనబడటమున్నూ, ఇవన్నీనిజమని ఎలా భావింపబడుతున్నయ్యో 2) రాహువుచేత రవిబింబం (సూర్యబింబం) గ్రసింపబడుతున్నది. *(Solar ecliple)* అంటున్నారే గాని రాహువుగాని, రాహువు సూర్యుణ్ణి మింగటంగాని ఎవరిచేతనైనా చూడబడుతన్నవా లేదు మరేమంటే బింబం అంతానో. కొంతభాగమో కనబడక పోవటం మాత్రం తెలియబడుతున్నది. చూడబడు తున్నది.

అలాగే ఈఅజ్ఞానం = మాయనుగాని ఇదిజ్ఞానాన్నిఆవరించటంగాని ఎవరిచేత చూడబడటంలేదు. మరేమంటే స్వస్వరూపమైన ఆనందం అనుభవింపబడకపోవటం. దుఃఖం అనుభవింపబడటం మాత్రం తెలియబడుతున్నయ్, అని గీతామాత చెప్తున్నది తండ్రీ

"ఇంకా, ఈ జంతువులు అందరూ మాయా ప్రభావంచేత ఏంబాధ దుఃఖంపొందుతున్నారంటే అది గూడాచూద్దాం పట్టు. వీరి తెలివి తెల్లవారకుండా. నల్లవారి, అంటేతెల్లగాస్వచ్ఛంగా నిర్మలంగా లేకుండా మసిపట్టి నల్లనైన వస్తువువలె మాయచేత కాలుష్యాన్ని మాలిన్యాన్ని పొంది వీళ్లు "మూఢులు" (fools) అయిపోతున్నారు.

"మూఢుడు" (fool) అంటే ప్రాపంచిక విద్యల్లో డిగ్రీలు సంపాదించలేనివాడూ. డబ్బులేనివాడూ. బిజినెస్ చేయలేనివాడు ఈ మొద

లైన సామాన్యంగా ప్రపంచంలో ఉండే అర్థాలు చెప్పటంలే ఉపనిషత్తు మహేమంటున్నదంటే.

## దేహవర్ణాశ్రమకర్తృత్వ భోక్తృత్వాద్యహంకార భావనారూఢో మూఢః

(నిరాలంబ. ఉ. 35)

1) తాను, నల్లగాగానీ, ఎఱ్ఱగాగాని, చామన చాయగాగానీ ఈ విధమైన రంగులు గలదిగానీ అవయవ సౌష్ఠవం సౌందర్యం కలదిగానీ స్ఫోటకం మచ్చలు బొల్లి గలిగి ఉన్నదిన్నీ. కుంటీ గుడ్డీ అయిగానీ, ఇంకా ఇతర విధమైన వికారాలతో వికృతంగా ఉండేదిన్నీ అయిన దేహమనిన్నీ

2) తాను బ్రాహ్మణ వర్ణానికి చెందిన వాడనని "శర్మ" అనిగాని క్షత్రియవర్ణానికి చెందిన వాడనని "వర్మ" అనిగాని, వైశ్యవర్ణానికి చెందిన వాడనని "గుప్త" అనిగాని, ఇంకా ఇతరములైన "నాయుడు" "రాజు" "రెడ్డి" "పిళ్ళె" "యాదవ్" ఈ మొదలైన దేహానికి సంబంధించిన పేర్లను గలిగి ఫలానా వర్ణంవాడి ననీ

3) తాను, శాస్త్రినని, సోమయాజినని, భాగవతార్‌నని, బాబానని, "సరస్వతి" "తీర్థ" "భారతి" అనే దేహానికి సంబంధించిన పేర్లు, గుర్తులు వేషాలుగల ఫలానా ఆశ్రమానికి చెందినవాడ ననీ

4) నేను క్రతువులు యజ్ఞాలు, చేసాను, దానధర్మాలు చేసాను నిష్ఠలు నియమాలు పాటించాను గనుక ఈనాడు ధనంతో వైభవంతో ఆనందిస్తున్నాను. ఇప్పుడూ చేస్తున్నాను, కనుక నాకు స్వర్గంలో "సీట్"

రిజర్వు అయి ఉన్నదనీ, దేహానికి సంబంధించిన కర్తృత్వ భోక్తృత్వాలు చేసేవాడిని. అనుభవించేవాడినీ ఇట్లా భావిస్తూ

తాను కానటువంటి దేహేంద్రియాదుల యొక్క కార్యాలనూ. ధర్మాలను. (వాస్తవంలో తాను దేనితోనూ సంబంధంలేక "అఖండాఖండైక రసచిద్రూప ఆత్మ" అయిఉన్నప్పటికీ అది తెలుసుకోలేక) తనవిగా భావించటం అనే అహంకారం కలవాడు. "మూఢుడు = "fool" అంటున్నది. నిరాలంబ ఉపనిషత్తు

ఇలా మానవుణ్ణి తన మానవత్వాన్ని కోల్పోయేట్టుగానూ విచార హీనుణ్ణిగానూ. దేహేంద్రియాలకు బానిసగానూ, అయినప్పుడూ, కానప్పుడూ, మంచీచెడ్డా విచక్షణ లేకుండా తింటం తాగటం. నిద్రపోవటం. సంతానం కలిగించుకోటంలోనూ. శబ్ద స్పర్శ రూప రస గంధాది విషయానుభవాభిలాషను వృద్ధి చేసికొనేట్టుగానూ మృగాన్నిగానూ చేసేది ఏది అనుకున్నావు నాయనా.

అదే అజ్ఞానం = మాయ

3) ఈరీతిగా స్వార్థపరతతో. మూఢత్వంవల్ల. కర్తవ్యాన్ని మరచిపోవటంచేత ఆసుర భావాలతో నిండిన వాళ్ళై నరకాసురుడికి, మేనత్త కొడుకులున్నూ. రావణాసురుడికి కజిన్ బ్రదర్సు (Consin brothers( నూ, మహిషాసురుడికి మేనల్లుళ్లనూ అయి ఉన్నప్పటికిన్నీ తమలో. ఉన్న నరకాసురత్వం రావణాసురత్వం. మహిషాసురత్వాన్ని గుర్తించలేక దాన్ని పోగొట్టుకోటమే కర్తవ్యం అన్నమాటను మరచిపోయి నరకాసురుడు చచ్చిన రోజుఅని. నరకచతుర్దశినాడూ, రావణాసురుడూ, మహిషాసురుడూ చచ్చిన రోజు అని విజయ దశమినాడు తలంట్లుపోసుకొని, కొత్తబట్టలు కట్టుకొని పిండి వంటలు చేసుకొని స్వీట్లను, హాట్లను. ఆకంఠం మెక్కి సొక్కి.

మిగిలిన టైము ఏదైనా కొంచెం ఉంటే. దాన్ని ఏవిధంగా గడపాలో ఫైనలైజ్ (Finalise) చేసుకోటానికి. సబ్‌కమిటీల నేర్పాటు చేసుకొని

బంధువులూ మిత్రులూ అనబడే వాళ్ళను చూచి రావద్దూ వాళ్లేమనుకుంటారు అని. తమకున్న చీరెలూ. బట్టలూ ఆభరణాలు. అలంకారాలు, వీటిలో ఏవేవి ధరించాలో, తేల్చుకోటానికీ మళ్లీ మరికొంత టైము ను వినియోగంచేసి. ధరించి. వాళ్ల ఇండ్లకుపోయి. తాము చేసికొని తిన్న పదార్థాలను గురించి కొంత చెప్తూ, ధరించుకొన్న వస్త్రాభరణాల గురించి వినేవారికి అసూయ కలిగేట్టుగా ఘనంగా వర్ణించి. తృప్తిచెంది.

వాళ్ళనుగూడా కలుపుకొని. సినిమాలకుపోతూ మార్గమధ్యంలో అల్పాహార భవనంలోనుంచి మసాలాదోసె వాసన. మరి అడుగు వేయనీయక పోవడంవల్ల తప్పనిసరిగా లోపలికిపోయి, మళ్ళీ సాలిడ్స్ (Solids) తో పాటు లిక్విడ్ (liquid) గూడా పుచ్చుకొని, బయటకు వచ్చి

మన మేలునుకోరి పక్కనేఉన్న పాన్, సిగరెట్ షాపువాని క్షేమాన్ని విచారించి "జర్దాతోగూడిన పాన్‌బీడా నోటిలోకుక్కి నశ్యాన్ని రెండు ముక్కుల్లో దట్టించి సిగరెట్‌ను ముట్టించి. పెదిమలకు పట్టించి. అప్పటి కార్యకలాపాన్నంతా, శాస్త్రోక్తంగా సర్వాంగశోభితంగా పరిపూర్ణంగావించి

"విచిత్ర సంసారం" అనే పిక్చర్లో. రోజూచేసే పనులనే ప్రొద్దున పక్కమీదనుంచి లేవకుండానే చొల్లునీరుకారే నోటితో "బెడ్ కాఫీ" (Bed Coffee) ని తాగటంతో ఆరంభమై రాత్రి పడుకోబొయ్యేటప్పుడు

"బ్లాక్ నైట్" విస్కీతో అంతమయ్యే దైవందిన యజ్ఞకార్యకలాపాన్ని "తు" "చ" తప్పకుండ ప్రదర్శిస్తున్నారుగనుక, నేత్రానందంగా దర్శించి. శ్రవణానందంగా వారుచేసే ఉపదేశాన్ని ఏకాగ్రమైన చిత్తంతో శ్రవణంచేసి

తిరిగి ఇంటికోచ్చేటప్పుడు మార్గమధ్యంలోనూ, ఇంటికొచ్చిన తర్వాత భోజనం చేసేటప్పుడున్నూ. భోజనమయినతర్వాతనూ "తచ్చింతనం తత్కథనం అన్యోఽన్యం తత్ప్రబోధనం ఏతదేకపరత్వంచ" అనే ఉపనిషద్వాక్యానుసారం బహిరంగంగానూ తర్వాత మానసికంగానూ నిద్రపట్టేవరకూ మళ్ళామళ్ళా మననంచేసి

మనకు తెలియని వేవైన విశేషాలఉంటే వాటిని చూచాం గనుక విన్నాం గనుక ఆచరణలో పెట్టాలిగనుకనూ ఆచరణలోపెట్టి

స్వప్నంలోగూడా మళ్లా ఒక మాటు స్మరించి

నిద్రపోయేట్టుచేస్తూ నరకాసుర, రావణాసుర, మహిషాసురులు చేసిన పనులనే నూరింతలు ఎక్కువగా చేస్తూ వాళ్ళ మరణంవల్ల కలిగిన ఆనందాన్ని ప్రకటిస్తూ

ఈ రీతిగా, మహా విలువ గలిగిన మానవ జన్మను, అనేక కోట్ల జన్మలలో చేసిన పుణ్యాన్ని ధారపోసి సంపాదించుకొన్న మానవజన్మను మంట కల్పుకొనేట్టుచేసేది ఏది అనుకొన్నావు నాయనా

అదే అజ్ఞానం = మాయరా తండ్రీ ఇంకా చూద్దాం పట్టునాయనా

4. మానవజన్మయొక్క లక్ష్యం కర్తవ్యం వీటిని మరచిపోతూ జ్ఞాపకం చేసేవాళ్లెవరైనా కనబడితే, వాళ్ళను ధిక్కరిస్తూ వేళాకోళం చేస్తూ మానవుడు తన అంతిమ ప్రయాణ సమయంలో తనవెంట తీసుకొని పొయ్యే మనస్సునూ అయిదు ఇంద్రియాలనూ, గీతా మాత ఉపదే

శానుసారంగా పరిశుద్ధం చేసుకోటానికి ప్రయత్నం కొంచమైనా చేయకుండా

ఏ పదార్థాలనైతే ఇక్కడే వదలిపోతారో అట్టి పదార్థాలైన, గృహారామాదులనూ, క్షేత్ర విత్తాదులనూ, సేకరించుకోటానికి, రక్షించుకోటానికి దురాశాపరులై దేశదేశాలకూ, పోతూ పాషండులైనవారిని క్రూర కర్ములనూ గర్వాంధులనూ సేవిస్తూ నౌకరీ చాకరీ, కూలినాలి, చేస్తున్న వాళ్లైయున్నప్పటికిన్నీ

మేం కోటీశ్వరులం
మేం ప్రెసిడెంట్లం
మేం సెక్రటరీలం
మేం చైర్మనాలం
మేం ప్రజాసేవాధురంధరులం
రాజ్యాంగ యుగంధరులం
ప్రతివాదిభయంకరషట్ఛాస్త్రారణ్య శార్దూలాలం
చతుర్వేదకానన పంచాననాలం
లలిత కళాటవీస్వైర విహారమత్తేభాలం

అని బిరుదులూ టైటిల్సూ వహిస్తూ

యథా ఖరశ్చందనభారవాహీ
భారస్య వేత్తా నతు చందనస్య
తథైవ శాస్త్రాణి బహూన్యధీత్య
సారం న జానన్ ఖరవ ద్వహేత్సః

(ఉత్తరగీత)

అను పరమేశ్వర వచనానికి దృష్టాంతాలుగా ఉండే వాళ్లనుగా చేసేదిన్నీ

అక్రమాలు అన్యాయాలు మోసాలు చేయటంలో పట్టినపట్టు విడువని మహాభయంకర భల్లూకలను చేసేదిన్నీ

కాలరూపకాకోదర దంష్ట్రామధ్యస్థమండూ కాలం అనే మాటను మరపింపచేసేదిన్నీ ఆత్మజ్ఞానోజ్జ్వల భాస్కరబింబ దర్శనమందు పాత్రత లేని ఉలూకాలను (గుడ్లగూబ) చేసేదిన్నీ

ఏది అనుకున్నావు నాయనా

అదే అజ్ఞానం = మాయరా అంటున్నది

గీతా మాత శ్రుతి మాత నాయనా

5. ఇంద్రియాలు, మనస్సు ప్యాస్ (pass) చేసే ఆర్డర్లను పాటించటంలో ప్రథమ శ్రేణికి చెందినవాళ్లై

హోదాలోనూ, అధికారంలోనూ, ధనంలోనూ, అంటే అజ్ఞానంలో తనుకంటె పైన ఉన్నారని భావింపబడేవారిని అనిశమూ ఆశ్రయిస్తూ వారి సమక్షంలో వందిమాగధస్తోత్రాలు చేస్తూ

వారు తమకు సుముఖులై ఉన్నప్పుడు ప్రసన్నవదనారవిందంలో తమ ప్రాశస్త్యాన్నీ ప్రాముఖ్యతనూగురించి ప్రగల్భాలు పలుకుతూ

వారు విముఖులైనప్పుడు వారి కోపతాపాలకు, అవమాన తిరస్కారాలకుగురిఅవుతూవారి పరుషభాషణాజనిత పరితాపానలదందహ్యమాన మానసులవుతూ తమకంటె క్రిందనున్నవారని భావింపబడే వారిమీద విరుచుకుపడుతూ వారినిగూడ వాక్పారుష్యంతోనూ క్రూరకృత్యాలతోనూ వ్యథలపాలుచేసే ప్రవర్తన కలిగేట్టు చేసేది ఏదనుకోన్నావు

అదే అజ్ఞానం = మాయరాఅబ్బాయీ

6. ఇంకా విచారించి చూద్దాం పట్టు, ఈ అజానం నిన్ను ఎన్ని విధాల బాధిస్తున్నదో ఎందుకయ్యా ఈగోల అంటావేమో అలా అనకు నాయనా, దుఃఖాన్ని గలిగించేదిన్నీ మహాశత్రువైన దిన్నీ అయిన ఈ అజ్ఞానం బాధగలిగిస్తున్నదిఅనే సంగతినే ఈ దయ్యం చేతులో బడిన వాడెవ్వడూ తెలుసుకోటం లేదు పైగా

కూలిపని చేస్తూ, ఆ పనివల్ల బాధపడుతూ చెమటలుపట్టి శ్రమచెందుతూన్నప్పటికిన్నీ దానివల్లవచ్చే రూపాయో రెండోమీద ఉండే ఆశచేత, ఆ కూలిపనివల్లగలిగే ఆయాసాన్ని గమనించకుండు కూలివానిచందాన

గాలమందు గుచ్చబడిన చిన్న ఎఱముక్క కోసం ఆసచేసి దానిని పొందటం వల్ల సుఖమే గల్గుతుంది అని భ్రాంతిచేత, దానిని మింగటానికి పోయి జాలరివాని బుట్టలోకి తరువాత వాని పొట్టలోకిపోయి తన ఆశవల్లనే, తన సంకల్పం వల్లనే తన నాశనాన్ని తనే కలిగించుకొను చేపచందాన

వేటగాని పాటవలన ఆకర్షింపబడి వాడు పన్నిన వలను గుర్తించక వలలో తగుల్కొని బంధ విమోచనోపాయం లేక తన నాశనాన్ని తానే తెచ్చుకొన్న హరిణం చందాన

ఈ మాయ = "అజ్ఞానం" మనలను ఏవిధంగా మోసం చేసి భ్రాంతిని పొందించి మనకు దుస్థితిని కలిగిస్తున్నదో ఎంత విన్నా ఎంత కన్నా ఎంత చదివినా ఎంత చెప్పుకొన్నా తక్కువే నాయనా అందుచేత ఇంకా చూదాం పట్టు ఇది ఏం చేస్తున్నదో

7. బుద్ధి పూర్వకంగా, కావాలని సంతోషం గలిగించేవాళ్ళని భావించీ భార్యా పుత్రపౌత్రబంధు వర్గాల సంబంధాన్ని సంపాదించీ

అదే జీవిత కర్తవ్యంగా భ్రమించీ
దీనికోసం శాస్త్రాలను కల్పించి
వివాహాలు చెయ్యాలని నిశ్చయించీ
సంబంధాలకోసం విచారించీ
సరైనవి దొరకలేవని చింతించీ

మా అమ్మాయికి ఎన్నో సంబంధాలు విచారించాంగాని కలిసిరాలే దమ్మా చివరకు ఫస్టుక్లాసైన సంబంధం దొరికింది అందుకోసం దాన్ని ఖాయం చేయించాం అనిన్నీ మా అబ్బాయికి ఎన్నో సంబంధాలు వచ్చాయి గాని కొన్ని మాకు నచ్చక కొన్ని వాడికి నచ్చక కాలం గడిచిపోయింది చివరికి ఈ సంబంధం ఖాయం చేసాం అనిన్నీ సంతోషించీ

"సంబంధం" అంటే "సం" = సమ్యక్, వదలించుకోటానికి వీల్లేని మంచిగట్టి "బంధం" = చేతులూ కాళ్లు స్వేచ్ఛతో కదలించటానికి వీల్లేకుండా చేసే ఇనుప సంకెళ్ల వలెనే స్వేచ్ఛను సౌఖ్యాన్ని అపహరించి నీకు దుఃఖాన్ని గలిగించేది అనే "సంబంధం" అనే పదానికిగల అసలు అర్థాన్ని విస్మరించీ.

మనం చేసిన పొరపాటునే మన సంతానానికి గూడ నేర్పి అట్లా చేయకపోతే మహాపాపమని నచ్చచెప్పుకుంటూ వివాహ మహోత్సవాలు గాలించీ

ఈ సంబంధాలు మొదట మొదట కొంత అనుకూలంగా ఉన్నట్లు కనబడటం చేత పండ్లికిలిస్తూ చేటంత మొహం చేస్తూ

పోను పోను వాళ్ళు క్రమ క్రమంగా ప్రతికూలం అవుతూ ఉండడం చేత మండిపడుతూ ధుమ ధుమలాడుతూ

వాళ్ళు కలిగించే దుఃఖాలచేత ఆధివ్యాధుల. చేతా ద్రవ్య నష్టంచేత ఆందోళన అశాంతి పొందుతూ

అర్జించిన అర్థం అంత మొందుట వలన, అక్రమాలూ అన్యాయాలు చేస్తూ ఫలితాలు అనుభవిస్తూ

ప్రయత్నాలు ఫలిస్తే తమ ప్రభావం చేతనని భావిస్తూ

కథ అడ్డంగా తిరిగి తమ స్కీములు తమను వంతలపాలు చేస్తే ఆ దుర్మార్గుడివల్ల ఇట్లా అయిందని వాపోతూ, ఇతరులను దూషిస్తూ కొంత సేపూ ఇంతకూ మనకు ఇది చెడుకాలంలే అని చింతిస్తూ కొంత సేపూ.

దుఃఖంలో నుంచి బయటపడే దారీ తెన్నూగానక శ్లేష్మంలో (కఫంలో) తగుల్కొన్న ఈగవలెనూ సాలీడుగూటిలో ప్రవేశించినపురుగు వలెనూ పట్టుకాయలో పట్టు దారాల మధ్య పట్టుబడిన పట్టు పురుగువలె

దేహమనే జైలులోనూ గృహమనే జైల్లోనూ పట్టుబడటం చేత తన మీద ఆధారపడి ఉన్నారని భావించే వారి సంఖ్య తన సంకల్పం వల్లనే తన పరిశ్రమ కృషి ప్రయత్నం వల్లనే అధికం అవుతున్న కొద్దీ వారి కోసం తన సౌఖ్యాన్ని ధారపోస్తున్నానని భావిస్తూ వారి మంచి చెడ్డలకు తానే కర్తనని అహంకరిస్తూ మమకారం వీడజాలక ఈ సంబంధాల వల్ల కలిగిన సంకెళ్ల నుంచివిడివడేమార్గాన్ని అన్వేషించుకోటానికి "too late" కాగా. చేసేదిలేక

ఆయువు క్షీణించి ఇంద్రియ పాటవం తగ్గి జరాభార పీడితుడై ఇంటివారి నుంచి బయిటివారి నుంచి అవమాన తిరస్కారాలను అనుభవిస్తూ

రోగగ్రస్తుడై మరణ భీతివల్ల బాధనొందుతూ మృత్యువు అసన్నం కాగా

1) అతి భయంకరాకారులైన యమభటుల చేత పాశ బద్ధుడు కాగా

2) వాళ్ళను చూచి భయంకల్గి మలమూత్ర విసర్జనం చేసీ
3) శరీరాన్ని విడిచీ
4) యాతనా శరీరాన్ని పొంది

యమనగరానికి కొనిపో బడుతున్నప్పుడు

1) యమ కింకరుల తర్జన భర్జనలకు భీతిల్లి వణకుతూ
2) మూర్ఛల నొందుతూ,
3) కుక్కలచేత కరవబడుతూ
4) శూలాల చేత పొడవబడుతూ
5) కొరడాల చేత కొట్టబడుతూ
6) ఆకలి దప్పులు అధికంగా అమితంగా అవుతున్నా అన్నం నీళ్లు దొరక్కపోవటం చేత అలమటిస్తూ
7) ప్రచండ ఆతపంచేతనూ (మండుటెండ) వడగాల్పుల వలననూ భరింపరాని బాధను అనుభవిస్తూ
8) 99 వేల యోజనాల దూరాన వున్నయమ పట్టణానికి కొలుతున్న ఇసుక ఎడారి మార్గాన కొనిపోబడేటప్పుడు తానుచేసిన పాపకృత్యాలకు పరితాపం చెందుతూ
9) యమనగర సమీపాన వున్న మలమూత్ర ప్రవాహమైన వైతరిణీ నదిలో ముంచబడి దహనదారుణ జ్వాలలచేత దహింపబడుతూ

ఈ రీతిగా యమనగరం ప్రవేశించి అక్కడ

1) సలసల కాగుతున్న తైలంలో పడవేయబడటం
2) మహాభయంకరమైన సర్పాలచేత కరిపింప బడటం
3) మదపుటేనుగులచేత తొక్కింపబడటం
4) కత్తులూరంపాలచేత కోయబడిన తన దేహంలోని కండలనూ తన చేతనే తినిపింపబడటం

ఈ విధంగా రౌరవాది మహా నరకాలలో యాతనలను శిక్షలనూ, యాతనా శరీరంచేత అనుభవించి కొంత పాపం క్షీణించగా, తిరిగి పాప శేషాన్ని అనుభవించటానికి,

మర్త్య లోకంలో రాయీరప్పా, చెట్టూచేమా, పల్లీ బల్లీ, కుక్క మందీ, మొదలైన హీనయోనులందు ప్రవేశించి దుఃఖాలు అనుభవించి అనుభవించి ఈ రీతిగా ఎన్నికోట్ల జన్మాలైన తరువాతనో గాని మనుష్యజన్మ కలుగకుండగా చేసేదిన్నీ

ఈ విధంగా

''అశనం మే, వసనం మే, జాయా మే,
బంధువర్గో మే, ఇతి 'మే మే' కుర్వాణం
కాలవృకోహంతి పురుషాజం''

''మేమే'' అని అరిచే మేకను పొంచివున్న తోడేలు పంచత్వం పొందించే చందాన

మే = నాకు, అశనం = షడ్రసోపేతమైన రుచిగల పదార్థాలు కావాలి

మే = నాకు, వసనం = అందంగా సన్నగా ఉండే సిల్కుబట్టలు గావాలి

మే = నాకు, జాయా = సుందరమైన స్త్రీ భార్యగావాలి అని పురుషుడూ సుందరమైన పురుషుడు కావాలని స్త్రీ

మే = నాకు, బంధువర్గః = అనుకూలురైన బంధువులుగావాలి

అనే దేహేంద్రియ వ్యామోహంలో చిక్కి ''మేమే'' అని మమత్వంలో మరగుతూ ఉండే మనుష్యరూప అజమును మేకను

కాలమనెడు తోడేలు కడతేర్చుతుంది. కడగండ్లపాలు అవుతాను అనేమాట జ్ఞాపకంరాకుండా చేసేదిన్నీ ఏమిటనుకున్నావు అదే అజ్ఞానం = మాయరా తండ్రీ ఇంకా చూద్దాంపట్టు

7) నీకున్న దుఃఖాన్ని తీసేసుకోవాలి అని గుళ్ళు గోపురాలు దర్శించటం తీర్థ యాత్రలూ. నోములూ వ్రతాలూ చెయ్యటం, చెట్లకూ పుట్లకూ ప్రదక్షిణాలు గావించటం దేవతలతోనూ దయ్యాలతోనూ బేరాలాడుతూ, వాళ్ళకు ముడుపులుకట్టి మొక్కులు చెల్లించటం, మతాలు మార్చుకోటం ఈ మొదలైన తప్పుడు దార్లను నీచేత తొక్కించేది ఏది అనుకున్నావు అదే అజ్ఞానం = మాయ నాయనా.

కనుక. ఇవన్నీ మానేసి నీ అజ్ఞానానికి స్వస్తిచెప్పి, జ్ఞానాన్ని సంపాదించటమే మానవ కర్తవ్యం అని సందేహం లేకుండా తెలుసుకో.

"నాన్యః పంథా విద్యతే అయనాయ"

(శ్వే॥ ఉ॥)

మోక్షం పొందటానికి సంసార దుఃఖం నుంచి విడుదల పొందటానికి వేరే మార్గం లేదంటున్నయ్ ఉపనిషత్తులూ. గీతామాత నాయనా.

అట్లాగా

అయితే వ్రతాలూ చెయ్యటం వల్ల దాన ధర్మాలు చేయటం వల్ల లాభం లేకపోతే పోయిందిగాని ప్రాయశ్చిత్త రూపసత్కర్మలు చేయటంవల్ల బ్రహ్మహత్యాది మహా పాతకాలుగూడ నశిస్తయ్ అని శాస్త్రాలు చెప్తున్నయ్ గదా అట్టి ప్రాయశ్చిత్తరూప సత్కర్మలచేత అసలు లేవిటన్నీ, మిథ్యా భూతమైనటివన్నీ అయిన ఈ యజ్ఞానం ఎందుకు నశించదో చెప్పండీ, అంటావేమో విను

1. న కర్మణా న ప్రజయా ధనేన త్యాగే నైకే
   అమృతత్వ మానశుః

(కైవల్య॥ ఉ॥ 4)

## న కర్మణా

(1) కర్మ అంటే "క్రియత ఇతి కర్మ" కరచరణాదులతో = కాళ్ళూ చేతులూ, ఈ మొదలైన వాటితో చేయబడేది కర్మ అంటే. యజ్ఞాలూ క్రతువులూ నోములూ వ్రతాలూ దానాలు ధర్మాలూ తీర్థయాత్రలూ చేయటం. పుణ్యక్షేత్రాలు దర్శించటం అనే సాధారణంగా అందరి చేతా చేయబడే కర్మలనేవి ఏవి ఉన్నవో, వాటిచేత మోక్షం = దుఃఖని వృత్తిపొందబడదనీ

## న ప్రజయా

అధికార సంపదలూ, తెలివితేటలూ. సౌందర్య సౌష్ఠవాలు, కీర్తి ప్రతిష్ఠలూ, అనేవి గలిగిన వారైనా అజ్ఞానంలో అగ్రగణ్యులైన పుత్ర పౌత్రాదుల చేతనున్నూ ముక్తి = దుఃఖని వృత్తిపొందబడదనిన్నీ

## నధనేన

పైన చెప్పబడ్డ కర్మలన్నీ విత్తసాధ్యములు కమకనూ. ధనముం తేసేఅకర్మలు చేయగల్గుతాంగనుకనూ. జ్ఞానంమాత్రంధనంతో కొనుక్కోబడేదిగాదు గనుకనూ. ధనం చేతనున్నూ ముక్తి = దుఃఖని వృత్తిపొందబడదు. మరేం చెయ్యాలయ్యా అంటే

## త్యాగేనైకే అమృతత్వ మానశుః

శ్రుతులు బోధించే రీతిగా

జగత్తు లేనే లేదనే జ్ఞానాన్నీ లేనిదే ఉన్నట్లు మాత్రం కనబడే మిథ్యాభూతమైంది జగత్తు అనే జ్ఞానాన్ని సంపాదించి, సమస్త లోకాలలో వుండే భోగ్య విషయాల మీద ఆశను వదలివేయటం. = పర్యైషణా పరిత్యాగం అనే జ్ఞానం చేతనే ముక్తిని పొందగల్గుతాం అంటున్నది కైవల్యోపనిషత్తు.

2. జ్ఞానేనైవ హి సంసార వినాశో
నైవ కర్మణా

(రుద్ర హృదయ। ఉ॥ 35)

ఆత్మతత్త్వ జ్ఞానం చేతనే అజ్ఞానాన్ని దాని కార్యం అయిన సంసారాన్ని ఆ సంసారం వల్ల కలిగే దుఃఖాన్ని నాశనం చేయగల్గుతాం. గాని "కర్మం వల్లగాదు" అంటున్నది రుద్రహృదయ ఉపనిషత్తు.

3. నాస్త్యకృతః కృతేన

(ముండక॥ ఉ॥ 1.2 12)

అకృతః = నిత్యసిద్ధమైన ఆత్మ వస్తువు ఒక కర్మచేత దానిఫలం (Result)గా కొత్తగా పొందబడేది కాదు కనుక కృతేన = కరచరణాది అవయవాల చేత చేయబడే ఏకర్మచేత నాస్తి = లేదు మోక్షం కర్మచేత సాధ్యంగాదు అంటున్నది ముండకోపనిషత్తు.

4. అమృతత్వస్య తు నాశాఽస్తి విత్తేన

(బృ॥ ఉ॥ 2.4.2)

విత్తేన = ధనం చేత అంటే డబ్బుచేత సంపాదింపబడే చదువు, డిగ్రీలు, డిప్లమాలు ప్రాపంచిక శాస్త్రాభ్యాసాలు.

ధనం చేత మనం చేయగల్గె సమస్త కామ్య కర్మలు అంటే ఈ లోకంలో సుఖాల కోసమూ పేరుప్రతిష్ఠలకోసమూ, స్వర్గలోకంలో సుఖాలు పొందాలి అనే కోరికతో చేయబడే

అగ్నిష్టోమ, అతిరాత్రి, అశ్వమేధ, పౌండరీకాది సకలయాగాలు

కన్యాదానం, గోదానం, హిరణ్యదానం భూదానం, గృహదానం, వస్త్రదానం ఈ మొదలైన సమస్త దానాలు.

కృచ్ఛ్ర. చాంద్రాయణ, ప్రాజాపత్యాది సర్వప్రాయశ్చిత్త కర్మలు,

అణిమాద్యష్ట సిద్ధి ప్రాప్త్యర్థం చేయబడేహఠ, యోగాభ్యాసాది. శరీరశోషణ రూప తపస్సులు, ఇవి ఏవీ గూడా

అమృతత్వస్య = అజ్ఞానని వృత్తిరూపమైన మోక్షం పొందించు తాయి అనే

ఆశానాస్తి = ఆశకే అవకాశంలేదు. అంటున్నది బృహదారణ్యక ఉపనిషత్తు.

5. ఉప నమీపే యో వాసో జీవాత్మపరమాత్మనోః
ఉపవాస స్సవిజ్ఞేయో నతు కాయస్య శోషణం
కాయశోషణమాత్రేణ కా తత్ర హ్యావివేకినాం
వల్మీకతాడనాదేవ మృతః కిన్ను మహోరగః
(వరాహ॥ ఉ॥ 2.39)

శాస్త్రముచేత గురువుచేత బోధింపబడిన వేదాంత మహా వాక్యార్థ మును ఏకాగ్రమైన చిత్తంతో శ్రవణంచేసి, చేసీ, యుక్తులచేత, దృష్టాం తాలతోనూ, ఏకాంతమందు మననంచేసి చేసీ "అహంబ్రహ్మాస్మి" = నేను పరబ్రహ్మమును అనే సాక్షాత్కారం కోసం = అనుభవం కోసం చేయబడే

జీవబ్రహ్మైకత్వాను చింతనమే "ఉపవాసం" అనే పదానికి అర్థం గాని.

ఆహారం ఏమీ తీసుకోకుండా, దేహాన్ని శుష్కింప జేయటంగాదు "ఉపవాసం" అంటే.

ఆత్మానాత్మ విచారమే తెలియక దేహానికి కావలసిన తగు మాత్ర మైన ఆహారాన్ని తీసుకోకుండా, దాన్ని ఎండగొట్టటం

దురభ్యాసాలు. దుష్టచింతనలు అనే చెత్తనంతా లోపలనే ఉంచు కొంటూ, దేహాన్ని మాత్రం తీసుకుపోయి తిరుపతి. రామేశ్వరాలలోనూ, హరిద్వారం, హృషీకేశాలలోనూ పడెయ్యటం గంగా గోదావరీలలోను. కృష్ణా కావేరులలోనూ ముంచి లేవనెత్తటం ఇంకా వివిధాలైన సకామ కర్మలుచేసే అవివేకులకు ఏం ఫలం లభిస్తుంది. కాలహరణం, డబ్బు దండుగ. వృధా ఆయాసం తప్ప ఏమీ లాభంలేదు.

పుట్ట మీద కొట్టిన మాత్రాన పుట్టలో వున్న భూరిభుజంగం చస్తుందా.

అంటే దేహమనే పుట్టలో మనస్సనే బిలంలో దాక్కొని ఉన్న "అజ్ఞానం" అనే మహాసర్పం దేహాన్ని శుష్కింపజేస్తూ ఎండగొట్టితేమూ ఆ దేహంతో జేయబడే కోటి కామ్యకర్మల చేత గూడానూ ఆ "అజ్ఞాన" సర్పం చావదు నాయనా అంటున్నది వరాహ ఉపనిషత్తు.

ఈ అర్థాన్నే వేమనగూడా ఎట్లా చెప్పాడోచూడు.

ఒడలు బడలజేసి యోగుల మనువారు<br>
మనసు కల్మషంబు మాన్పలేరు<br>
పుట్టమీద గొట్ట భుజగంబు జచ్చునా<br>
విశ్వదాభిరామ వినుర వేమ

శరీరాన్ని శోషింపజేస్తూ శరీరంతో చేసే కర్మల వల్ల మనస్సులో ఉన్న అజ్ఞానం నశించదు. దుఃఖం పోదు అంటున్నాడు వేమన.

ఈ మహాసత్యం అనుభవపూర్వకంగా తెలిసిన జ్ఞాని గనుక.

ఒకమాటు వాళ్ళ అమ్మ వేమనతో నాయనా పుణ్యక్షేత్రాలకుపోయి తీర్థయాత్రలు చేసివద్దాం రా నాయనా నీవు నాతో రా రా అంది. ఆయన ఎందుకమ్మా తీర్థయాత్రలు చెయ్యటం అన్నాడు. పాపాలు పోతయి. పుణ్యం వస్తుంది అందట ఆవిడ.

అట్లా అయితే నీ మెడలో ఓ రాగి బిళ్ళ కడ్తా నీవు తీర్థయాత్రలుచేసి నందు వల్ల అది బంగారం బిళ్ళగా మారితేనేను గూడ తరువాత వస్తా అన్నాడు. ఆవిడ తిరిగి వచ్చిన తరువాత రాగిబిళ్ళ బంగారం బిళ్ళగా మారిందా అని ఆడిగాట్ట. "తీర్థయాత్రలుచేస్తే రాగి బంగారంగా మారు తుందట్రా నీ దంతా చోద్యం" అంది.

అప్పుడాయన ఆ రాగి బిళ్ళను తీసికొని దాని మీద మూత్రవిసర్జనం చేసాడు అది బంగారం బిళ్ళగా మారిందట.

అప్పుడు ఆవిడకు తన కొడుకు మహాత్మ్యం తెలిసి అజ్ఞానాన్ని తొలగించు కోటానికి ప్రయత్నం చేయకుండా కోటి తీర్థాల్లో మునిగినా గాని లాభం లేదనే ఆయన మాట మీద విశ్వాసం కుదిరిందట.

ఇలాంటి కథలు మనం చదువుతున్నా వింటున్నా "అజ్ఞానం"తో నిండిన మనబుద్ధి ఇట్లాంటి కథల యొక్క ముఖ్యోద్దేశాన్ని అవగాహన చేసుకోటానికి బదులు అవిశ్వాసం చేత కుతర్కం చేస్తుంది.

ఏమనంటే

మూత్రం పోసాట్ట, ఎప్పుడు పోసాడు? తెల్లవాని 4 గంటలకు ఒక మాటు పోసాడా? లేక 24 గంటల్లో పట్టి పెట్టిందంతా పోసాడా? ఒక లీటరా రెండా? కొలత ఎంత? దాని బరువు ఎంత (Specific gravity) ఎంత? దాని రంగు ఏమిటి? దాంట్లో సుగర్ ఎంత ఉంది? వేమనకు "డయాబటిక్ కంప్లెంటు" ఉండెనా? ఆరోజున ఏం తిన్నాడు? గొఱ్ఱె మాంసమా గోరు చిక్కుడుకాయ కూరా? ఆవకాయా ఆలుగడ్డ కూరా? ఆయన అట్లా చెయ్యటం ఎవరు చూశారు? ఏ డాక్టరు "ఎక్జామిన్" పరీక్ష చేసాడు? ఈ విధమైన కాకదంత పరీక్షకు సంబంధించిన లక్ష ప్రశ్నలూ ఉప ప్రశ్నల మీదకు అజ్ఞాన శిఖామణులున్నూ, అహంకారపూరితులున్నూ అయిన వాళ్ళ బుద్ధి పోతుందిగాని.

ఏ పాయింటును, ఏ విషయాన్ని నిర్ణయం చేయటానికి ఏ సందర్భంలో ఈ విషయం ప్రస్తావించబడింది అని మాత్రం విచారించవీయదు ఎందుచేత నంటే మనకా విషయాలలో ప్రవేశం లేదు గనుక. అటువంటి శక్తిగల యోగులను మనం చూడలేదు చూడజాలము గనుక, మనం నమ్మం నాయనా.

వేమన వంటి మహా యోగులకు ఇటువంటి శక్తులు ఉండడంలో ఆశ్చర్యమేముంది తండ్రీ?

ఇంతటి మహాయోగి అయినప్పటికీ, వేమన ఎప్పుడూ తన విషయాన్ని ఏ పేపర్లోనూ వేయించుకోలేదు. టిక్కెట్లు అమ్మించి. తనకున్న శక్తుల ప్రదర్శనం చేసి దానివల్ల డబ్బును కీర్తిని గడించటానికి ప్రయత్నం చేసినట్లు కథలు ఎక్కడాలేవు.

మరి ఇదెందుకు చేసాడయ్యా అంటే మనందరివలెనే అజ్ఞానం చేత ఆవరింపబడి ఆవంతి గూడా లాభంలేని సకామ దైహిక కర్మలవల్ల ఏదో పుణ్యం వస్తుంది అని భావించే తల్లి మూఢత్వాన్ని తీసివేయాలని చేసాడే గాని,

ఈ రోజుల్లో స్వార్థంతో కీర్తి నాసించిగాని, ధనకాంక్షచే గాని మండుతూన్న కర్పూరాన్ని మింగటం, ఇసుకను పంచదారలోకి మార్చినట్లు చూపించటం ఈ మొదలైన ఒకటి రెండు చిన్న మ్యాజిక్కులు చేసే అల్పశక్తి గలిగి ప్రదర్శనలు చేసేవాళ్లవలె వేమన చేయలేదు బాబూ.

కనుక శాస్త్ర వచనాల మీద శ్రద్ధనూ. విశ్వాసాన్ని వృద్ధి చేసుకోవోయి తండ్రీ

'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం'

(గీ॥ 4-39)

వాటిలో ఉండే సారాన్ని గ్రహించకవాటిని తిరస్కరిస్తే శాస్త్రానికి లోటులేదు. నీకే నష్టం తండ్రీ. ఈ మాటవాగా విచారించుకో.

ఇంకా చూద్దాం పట్టు. ఈ విషయాన్ని గురించి ఇతర గ్రంథాలు గూడా ఏం చెప్తున్నయ్యో

6. అజ్ఞాననివృత్తిస్తు జ్ఞానాదేవ న కర్మణా

(సూతసం॥ బ్రహ్మగీత)

"అజ్ఞానం" దానివల్ల కలిగే దుఃఖం పోవాలంటే

ఆత్మతత్త్వాపరోక్ష జ్ఞానం వల్లే అది సాధ్య మౌతుందిగాని దేహం, చేతులు. కాళ్ళు వీటితో లక్ష కర్మలు చేసినా పోదు అంటున్నది సూతసంహిత.

పఠన్తు శాస్త్రాణి యజన్తు దేవాన్
కుర్వన్తు కర్మాణి భజన్తు దేవతాః
ఆత్మైక్యబోధేన వినా విముక్తిః
న సిద్ధ్యతి బ్రహ్మశతాంతరేఽపి'

(వి. చూ. 6)

చెత్త శాస్త్రాలను లక్ష చదివినాగాని. యజ్ఞాలూ. యాత్రలూ. నోములూ వ్రతాలూ. దానాలూ ధర్మాలూ మొదలైన కామ్యకర్మలచేత ఇంద్రాది దేవతలను పూజించి. సేవించి తృప్తిపొందించినాగాని. ఇవన్నీ కామ్యకర్మలుగావటంవల్ల నూరు బ్రహ్మ కల్పాలకైనా ఇవి మోక్షాన్ని కలిగించలేవు. ఆత్మజ్ఞానం ఒక్కదానివల్లనే మోక్షం లభిస్తుంది అంటున్నది వివేక చూడామణి.

# పాకస్య వహ్నివత్ జ్ఞానం వినామోక్షో న సిద్ధ్యతి

(ఆత్మబోధ"2)

బియ్యం తెచ్చావు, పప్పుశారలు తెచ్చుకొన్నావు. కుంపటి బొగ్గులూ, కట్టెలూ అన్ని అమర్చుకున్నావు బాగానే వున్నది అగ్ని లేక పోతే వంట తయారవుతుందా, ఆకలి తీరుతుందా.

అట్లాగే నాయనా పొట్టకూటి విద్యలు బాగా నేర్చి డిగ్రీలూ డబ్బూ సంపాదిస్తావు, ఇహలోకంలో భోగాలు అనుభవిస్తావు, స్వర్గలోకంలో సౌఖ్యాలు అనుభవించాలిఅని పుణ్యక్షేత్రాలకు పోతావు. పూజలు పునస్కారాలు చేస్తావు ఆ దేవతలనూ, ఈ దేవతలను ఆశ్రియిస్తావు

కాని ఈ కామ్యకర్మలన్నీ శాశ్వతమైన మోక్షఫలాన్ని పొందింప జేయవు తండ్రి వంట తయారుగావటానికి వహ్ని ఎట్లా ముఖ్యమో ఆత్మ జ్ఞానం లేనిదే మోక్షం సున్న అంటున్నది "ఆత్మబోధ" నాయనా

మీనఃస్నానపరః ఫణీపవనభుక్ మేషోఽస్తిపర్ణాశనః
నీరాశీఖలుచాతకఃప్రతిదినం శైలేబిలేమూషికః
భస్మోద్ధూళిత విగ్రహస్తు శునకోధ్యానాధిరూఢోబక
ఏతేషాం ఫలమస్తికిం నహి నహి జ్ఞానంపరంకారణం

అంటున్నారు మహాత్ములు.

చూడునాయనా! నీ వేమనుకొంటున్నావంటే పుణ్యక్షేత్రాలని కొన్ని ఉన్నవి అనీ అక్కడ నిన్ను పావనం చేసే గంగా. గోదావరి. కృష్ణా కావేరీ మొదలైన నదీ నదాలు ఉన్నయ్ అని అక్కడికి పోయి నీకే హన్ని ఆ నీళ్ళలో మునిగి లేవనెత్తటం అనే స్నానరూపమైన కర్మచేస్తే పాపాలుపోయి పుణ్యం వస్తుందని మోక్షం వస్తుందనీ అనుకొంటున్నావు. ఇది భ్రాంతినాయనా.

ఈ మాట ఎంత వరకు నిజమో కొంచెం విచారించు. నీవు ఎప్పుడో జన్మలో ఒక్కమాటో రెండుమాట్లో కాశీ హరిద్వార యాత్ర చేసి గంగలో మునిగివస్తావు దీనివల్ల నీకు మోక్షం వచ్చేది సత్యమైతే. గంగానదిలో సంవత్సరంపొడుగునా. 365 రోజులు 24 గంటలు స్నానం చేస్తుండే చేపలకు. మొసళ్ళకూ. కప్పలకు మోక్షం రావాలిగా మరి అట్లా ఎక్కడా ఎవరూ, ఏ గ్రంథంలోనూ చెప్పటం లేదు. నీవు కూడా ఆ మాటంటే ఒప్పుకోవుగదా మరి ఈ దౌర్భాగ్యపు అభిప్రాయం నీ బుర్ర లోకి ఎట్లా వచ్చిందో అది ఆలోచించుకో మంటున్నది శాస్త్రం

ఇంకేమనుకొంటున్నావు అంటే, వాళ్ళెవరో మహాత్ములు, యోగు లుటా గుహలో ఉంటారుట ఆకులూ, గాలీ, నీరూ, వాళ్ళకు ఆహా రంట, ఇంకేమి తినరుట ఎంత గొప్పవాళ్ళోమరి, అని వాళ్ళ గొప్పత నాన్ని గట్టిగా నమ్ముతావు, ప్రచారం చేస్తావు. అంతేగాని శాస్త్రం చెప్పే పెద్ద మాటల మీదికి నీ బుద్ధిని పోనిచ్చి విచారించవు.

చూడూ గుహలో వుండటం గొప్ప అయితే ఎలుకలు కొండ బిలాల్లో కన్నాల్లో ఉంటవి. ఆకులు తిని వుండటం గొప్ప అయితే మేకలు ఆకులు తింటాయిగాదు

గాలిని తింటం గొప్ప అయితే పాములు గాలిని తింటాయ్ నీళ్ళే ఆహారంగా గలిగి వుండటం గొప్ప అయితే చాతక పక్షులు వర్షం నీళ్లు త్రాగుతుంటాయ్ బజార్లో దొరికే తెల్లటి గడ్డను పొడిచేసి భస్మం అను కొని దాన్ని దేహంనిండా పూసుకొని తెల్లగా అయ్యేట్టు చేసుకోటం గొప్ప అయితే కుక్కలు కూడా బూడిదిలో పొర్లాడి భస్మోద్ధూళిత దేహాలు గలిగి వుంటయ్. ఇది ధ్యానం చెయ్యాలి ఇది గొప్ప అని అంటావు. కొంగ కూడా ఏ దేక నిష్ఠా గరిష్ఠతతో చేపలకోసం ధ్యానం చేస్తూం టుంది గదూ.

కనుక నీవు మానవుడవై పుట్టిగూడా ఏవో లాభం పొందటానికి దేహానికి సంబంధించిన ఈ కామ్యకర్మలు అన్నీ నిన్ను గొప్పవాణ్ణి చేస్తవని అనుకొంటే, ఈ పనులను అన్నిటిని అనవరతంచేసే పైన వర్ణింపబడ్డ అల్ప జంతువులన్నీనీకన్న ఎన్నో రెట్లు గొప్పఅని చెప్పాలిసొస్తుందిగదూ. ఆమాటంటే మీదపడి కొడ్తావు.

అంతేగాని ఆలోచించి శాస్త్రవచనాలమీద విశ్వాసముంచి, ఒళ్ళువొంచి, ఏంచెయ్యాలో అది మాత్రం చెయ్యవు, నీపాత దౌర్భాగ్యపు అలవాట్లను అంటిపట్టుకొని అలమటిస్తూ, అదే ఆచరణీయమని. చేస్తూ ఆనందం పొందుతున్నాను అనుకొంటావు కాదంటే ఆగ్రహిస్తావు.

అంతేగాని అసలు నీవు ఎవరవో అన్నమాట విచారించి ''ఆత్మజ్ఞానం'' పొందటమే శాశ్వతానందాన్ని కలిగిస్తుంది అని నమ్మి దానికోసం కాసంత ప్రయత్నం అయినా చేయవు. ఈ దైహికములైన కామ్య కర్మల వల్ల లాభంలేదురా నాయనా మోక్షఫలానికి స్వరూపజ్ఞానం ''ఆత్మజానం'' ఒక్కటే కారణం తండ్రీ అంటున్నది శాస్త్రం దాన్ని సంపాదించటానికి ప్రయత్నించు. ఆలస్యంచేయక గీతాభ్యాసం మొదలుపెట్టు తండ్రీ.

ఈ విషయాన్ని గురించి గీతామాత ఏం చెప్తున్నదో ఇంకా చూద్దాం పట్టు.

7. మోఘాశా మోఘకర్మాణో
మోఘజ్ఞానా విచేతసః
రాక్షసీం ఆసురీం చైవ
ప్రకృతిం మోహినీం శ్రితాః

(గీ 9-21)

తాము చేసిన వ్యర్థములూ, దుష్టములూ అయిన కర్మల ఫలగాం. సంప్రాప్తమైనవిన్నీ

ఈశ్వరునిచేత విధింపబడినవిన్నీ తాము అనుభావిస్తేనే తప్ప పోని విన్నీ

అయిన దుఃఖాలు చౌకబేరాలతో దేవతలకు భూతాలకు కానుకలు చెల్లిస్తే పోతవనే

వ్యర్థమైన ఆశలతో నిండిన వాళ్లున్నూ అట్లాంటి ఆశలు గలవారు కనుకనే—

కాశీవిశాలాక్షిని కండ్లతో చూచి స్వయంగా
దరఖాస్తును ఇచ్చి,
మధురమీనాక్షితో మాట్లాడి కష్టాలను
చెప్పుకొని అప్లికేషన్ ఫైల్ చేసి,
కంచికామాక్షితో కలసి మనకు కావలసిన వాటిని
గురించి నచ్చ చెప్పి,
అలమేలు మంగమ్మను ఆశ్రయించి ఆపదలు
అంత మొందించు మాయమ్మా అని శ్రావ్యంగాపాటపాడి

ఈరీతిగామనకంటె చాలా గొప్పవారని భావింపబడే ఈ తలులందరికీ పసుపు కుంకుమ చీరె, రవికా, ఇవన్నీ తక్కువైనయ్ అని తలంచి, వాటిని సమర్పించీ

పాపాలు పోయినవనిన్నీ మళ్లీ కొత్తవి చేయటానికి లైసెన్సు పొందామనిన్నీ భావించీ

ఇంటికి తిరిగి వచ్చి నీతి నియమాలు విడిచి పశువాంఛలతో బ్రతుకు సాగించటానికి మళ్లా పాతరాగాన్నే మరింత దీర్ఘంగా ఆలాపన చేసే.వ్యర్థమైన కర్మలు చేసే వారున్నూ

MEMORIAL

ఈ రీతిగా వివేకం లేక శాస్త్రోపదేశానికి వ్యతిరేకంగా వ్యర్థమైన జ్ఞానం గలిగి, దాన్నే వృద్ధి చేసుకుంటూన్న మూఢులు

పరమేశ్వర తత్త్వాన్ని తెలుసు కోకుండా, జ్ఞానం సంపాదించి బాగు పడే మార్గాన్ని అవలంబించకుండా, ఆసుర సంపదగలవారై అంతులేని పంసార దుఃఖానికి పాలు అవుతున్నారు జాగ్రత అంటున్నది గీతామాత.

8. ఈ రీతిగా కామ్య కర్మలు కోట్ల కొద్దీ చేసినాగాని అజ్ఞానం ఎందుకు నశించదయ్యా అంటే

కర్మాజ్ఞానసముత్థత్వా న్నాలం మోహాపను త్తయే
సమ్యగ్జ్ఞానం విరోధ్యస్య తామిస్రస్యాంశుమానివ

(నైష్కర్మ్య సిద్ధి 1-82)

కర్మ అంతా గూడా అజ్ఞానం వల్ల జనించినదే కావటం వల్ల అజ్ఞానాన్ని నశింపజేసే సామర్థ్యం దానికిలేదు

అంధకారాన్ని (చీకటిని) నశింపచేసే అంశుమంతునివలె (సూర్యునివలె).

అజ్ఞానానికి ఆత్మజ్ఞానం విరోధిగావటం వల్ల అజ్ఞానాన్ని ఆత్మజ్ఞానం మాత్రమే నశింప జేస్తుంది అంటున్నది నైష్కర్మ్యసిద్ధి

9, అవిరోధి తయా కర్మనావిద్యాం వినివ ర్తయేత్
విద్యాఽవిద్యాం నిహంత్యేవ తేజ స్తిమిర
సంఘవత్

(ఆత్మబోధ-3)

కర్మమూ, అజ్ఞానం ఈరెండూ భాయీభాయీ వీటికి విరోధంలేదు గనుక, కర్మము అజ్ఞానాన్ని తీసెయ్యలేదు. కాని తేజస్సు, చీకటినితొలగ జేయునట్లు విద్య = జ్ఞానమే అవిద్యను అంత మొందిస్తుంది" అంటున్నది "ఆత్మబోధ"

ఎందుకంటే

అవిద్య = అజ్ఞానం = మూలప్రకృతి ప్రపంచానికి మూలకారణం గనుక ప్రపంచం ఏవిధంగా ప్రకృతివల్ల పుట్టిందో అట్లాగే ప్రపంచంలో ఖా..మైన కర్మలు గూడా ప్రకృతి వల్లనేపుట్టినయ్‌గాన

జన్య జనకములైన కర్మలకూ, అజ్ఞానానికి పరస్పర విరోధంలేదు.

అందువల్ల కర్మము అజ్ఞానాన్ని అభివృద్ధి చేస్తుందేగాని నశింప జేయదు.

అదెట్లా అంటే

అమావాస్యనాటి అంధకారంను మేఘావరణం ఎట్లా ఎక్కువ చేస్తుందో అట్లాగే కర్మలు అనే మేఘాలు అజానమనేఅమావాస్య చీకటిని మరింత వృద్ధి చేస్తవి గాని చీకటిని తీసేస్తయ్యా

మరి సూర్యుడు ఏలాగున ఆచీకటిని తొలగిస్తాడో, అలాగే

అజ్ఞానాన్ని ఆత్మజ్ఞానం నివర్తింపచేస్తుంది.

(10) ఈమాటే గీతామాత చెప్తున్నది చూడూ

జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశిత మాత్మనః
తేషాం ఆదిత్యవత్ జ్ఞానం ప్రకాశయతి తత్పరం
(గీ॥ 5-16)

ఎవరి అజ్ఞానమైతే ఆత్మజ్ఞానంచేత నాశనం పొందిందో సూర్యుడు తన తేజస్సుచేత చీకటిని తొలగించి పదార్థజ్ఞానాన్ని కలిగేట్టు ఎట్లా చేస్తాడో అట్లాగే

జ్ఞానమనే సూర్యుడు అజ్ఞానమనే తమస్సును తొలగించగానే తాను పరమాత్మ అనే సత్యమైన వస్తుపరిజానం కలుగుతుంది అంటున్నది గీత.

సకామకర్మలవల్ల ఎందుకు మోక్షలాభం = ఆత్మలాభం లేదో ఇంకా విచారించి చూద్దాం పట్టు

చతుర్విధ మేవ హి సర్వం కర్మ కార్యం
ఉత్పాద్య మాప్యం సంస్కార్యం వికార్యంవా
నాతఃపరం కర్మణాం విషయోఽస్తి
(శాం॥ భా॥ ముండక 1-2-12)

అంటే

కర్మల యొక్క కార్యములు = ఫలములు అన్ని

1. ఉత్పాద్యము
2. ఆప్యము
3 సంస్కార్యము
4. వికార్యము

అను నాల్గు విధాలుగా మాత్రమే ఉన్నవి. అంతకంటె ఇంకొకటి లేదు.

అందుచేత ముక్తి కర్మ యొక్క కార్యంగాదు కర్మచేత సాధింపబడేదిగాదు.

క్రియత ఇతికర్మ = చేయబడునది కర్మ ఈ కర్మ ద్రవ్యములందు (గుణములకు ఆశ్రయములైన పృథివ్యాదులకు ద్రవ్యాలని పేరు) ఉత్పత్తి ప్రాప్తి, సంస్కారము. వికృతి. అనే నాలుగు విధాలైన గుణాలను కలుగ జేస్తుంది. అదెట్లాంటే

## 1. ఉత్పత్తి, ఉత్పాద్యము

తంతు వాయునిచేత = సాలెవానిచేత చేయబడే తంతు సంయోగ కర్మ = దారాలకు సంయోగం = కలయిక. కలిగించటమనే కర్మ వస్త్రానికి. ఉత్పత్తిని కలుగచేస్తుంది = వస్త్రాన్ని పుట్టిస్తుంది.

ఆత్మ (ముక్తి) అనేది నిత్య సిద్ధంగా ఉన్నదిన్నీ ఒకదానిచేత పుట్టింపబడేదిగాదు = ఉత్పాద్యంగాదు. గనుక కర్మవల్ల ఆత్మ పొందబడదు.

## 2. ప్రాప్తి-ఆప్యము

ఒకనిచేత చేయబడే గమన కర్మ కాళ్లతో నడవటమనే కర్మ ఇంకో గ్రామాన్ని ప్రాప్తింప చేస్తుంది = పొందింపచేస్తుంది, కాని, ఆత్మ సర్వవ్యాపకం కాబట్టి ఒకచోటి నుంచి ఇంకోచోటికి పోవటంవల్ల పొందబడేదిగాదు కనుక గమనకర్మచేత పొందబడదు.

## 3. సంస్కారము, సంస్కార్యము

మాలిన్యం. జిడ్డు. మురికి గలిగివున్న దర్పణం = అద్దం మీద ఉన్న మాలిన్యం మొదలైన వాటిని తీసేసి దాన్ని శుభ్రపరచటానికి భస్మవిఘర్షణం అనేకర్మ = బూడిదతో రుద్దటం అనే కర్మ చెయ్యాలి. దానివల్ల అద్దం శుభ్రమై ప్రతిబింబాన్ని గ్రహించే యోగ్యతను = సంస్కారాన్ని పొందుతుంది. కాని. నిత్య శుద్ధమై నిర్మలమైన ఆత్మకు సంస్కారం = శుభ్రత కలిగించటం అనే మాటేలేదు గనుక సంస్కారాన్ని కలిగించే ఏ కర్మవల్లా ఆత్మపొందబడదు.

## 4. వికృతి, వికారం, మార్పు

క్షీరంలో చేయబడే ఆతంచనాది కర్మ = పాలలో తోడు వెయ్యటం అనేకర్మ క్షీరానికి పెరుగు రూపమైన వికారాన్ని = మార్పును గలుగ చేస్తుంది. కాని. ఆత్మ నిరవయువనము నిష్కలము. నిరాకారము, నిర్వికారం గనుక, ఏ భాగాలు లేకుండా, నిరాకారమై. మార్పులులేనిది గనుక వికారాన్ని కలిగించేకర్మ దేనిచేతను "ఆత్మ" పొందబడదు.

MEMORIA

## ఈ రీతిగా "ఆత్మ"

(1) నిత్యసిద్ధం కాబట్టి వస్త్రంలాగా ఉత్పత్తికి యోగ్యం గాదు.
(2) సర్వ వ్యాపకంగాబట్టి గ్రామాదులు లాగా ప్రాప్తికి యోగ్యంకాదు.
(3) నిత్యశుద్ధంగాబట్టి మలిన దర్పణంలాగా సంస్కారమును కోరదు.
(4) నిరవయంగా బట్టి క్షీరములాగా వికారాన్ని పొందదు.

అందుచేత ఈ నాలుగు విధాలైన కర్మ ఫలాలలో చేరేదిగాదు గనుక ఆత్మ కర్మ చేత పొందబడదు మరేమంటే జ్ఞానం చేతనేఆత్మ పొందబడుతుంది = మోక్షం పొందబడుతుంది. కర్మచేతగాదు. అని చెప్తున్నవి శాస్త్రాలు.

సాలగ్రామాన్ని, రత్నాన్ని, లక్షణ పరీక్ష చేతనూ, బంగారాన్ని గీటురాయిమీద రాసి పరీక్షచేయటం చేతనూ. వాటి మంచి చెడ్డలను నిర్ణయించాలేగాని.

ఉండు. స్నానం ప్రాణాయామం తీర్థయాత్రా చేసివస్తే దాని విషయం తెలుస్తుంది అని ఎవరైన అనేవారు వున్నారా.

స్నాన సంధ్యావందన. ప్రాణాయామ. తీర్థయాత్రాది కర్మలచేత రత్నమూ. బంగారము మొదలైన వస్తుతంత్రమైన జ్ఞానం ఎప్పనికి. ఎన్నటికినీ. ఎట్లాసాధ్యంగాదో. అట్లాగే ఆత్మజ్ఞానంకూడా. ఆత్మానాత్మ విచారం వల్లనేగాని యజ్ఞయాగాదులూ ప్రాణయామ యోగాభ్యాసాలు అనే కామ్య కర్మలవల్ల కోటి జన్మలకైన సాధింప శక్యంగాదవి నిశ్చయంగా తెలుసుకో మంటున్నవి ఉపనిషత్తులూ గీతా.

మరి ఈ కర్మలన్నిటినీ వేదాల్లోనూ వ్రతకల్పాల్లోనూ ఎందుకు చెప్పినట్లూ (అందరూ ఎందుకు చేస్తున్నట్లూ) అని అంటారు చాలామంది.

ఔను నాయనా శాస్త్రవాక్యాల్లో ఉండే అసలైన అంతరార్థం అనే దాన్ని అవగాహన చేసుకోకుండా, అజ్ఞానంచేత ఆవరింపబడి అఘోరిస్తూ ఉండే అష్టావక్రులు అడుగుతారు ఈ ప్రశ్నను.

అసలు విషయం ఏమిటంటే

చిత్తస్య శుద్ధయే నతు వస్తూపలబ్ధయే
వస్తుసిద్ధి ర్విచారేణ నకించి త్కర్మకోటిభిః

(వివేక చూడామణీ–11)

జీవ బ్రహ్మైకత్వ నిశ్చయమనే వస్తుసిద్ధి = జ్ఞానం = మోక్షం ఒక్క బ్రహ్మతత్త్వ విచారం చేతనేలభిస్తుందిగాని యజ్ఞదానవ్రతాది కామ్య కర్మలు కోట్లకొద్దీ చేసినప్పటికీ లభించదు.

అంటున్నది వివేక చూడామణి

మరి కర్మలవల్ల ఫలం ఏమిటయ్యా అంటే

ఈ కర్మలను నిష్కామంగా ఏకోరికలు లేకుండా దేవతలతో బేరాలాడకుండా చిత్తశుద్ధికావాలి. మనస్సుకు అనేక జన్మలనుంచిపట్టుకొని వున్న కోరికలు అనే జిడ్డు మకిల చిలుము మాలిన్యం తీసేసుకొని ఆత్మజ్ఞానాన్ని పొందటానికి అర్హమైందాన్నిగా చేసుకోవాలనే లక్ష్యంతో చేస్తే మనస్సు పరిశుద్ధమై ఏకాగ్రమై నిశితమై ఆత్మజ్ఞానంను గ్రహించే శక్తిని పొందుతుంది.

అంతేగాని కోరికలతో ఇంద్రియార్థాలు పొందాలి అనుభవించాలి అనే ఉద్దేశ్యంతో కర్మలు చేస్తే ఏమీలాభం లేకపోగా సంసారంలో తిరుగాడటం అనే మహాదుఃఖం గలుగుతుంది అనిన్నీ నిష్కామకర్మనే చెయ్యాలనిన్నీ గీతామాత మొదటి నుంచి చివరిదాకా చెప్తున్నది నాయనా కనుక కొన్ని గీతావాక్యాల అర్థం తెలుసుకొందాం పట్టు.

కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన
మాకర్మఫలహేతుర్భూః మా తే సంగోఽస్త్వకర్మణి
(గీ॥ 2-47)

ఆత్మజ్ఞానాన్ని పొందగోరేవాడు కర్మలు నిష్కామంగానే చెయ్యాలి. ఈ కర్మ నేను చేస్తున్నాను. దీనివల్ల ఈ ఫలం రావాలి అనే కర్తృత్వమూ భోక్తృత్వమూ ఈ రెంటినీ విడిచి కర్మలు చేస్తే మనస్సు శుద్ధమవుతుంది. ఆత్మజ్ఞానం కలుగుతుంది.

అంతేగాని కర్మఫలంమీద ఆసక్తి ఉంచుకొని దానికోసం నోరు తెరుచుకు కూర్చుంటే కర్మఫలంగా అనేకమైన దేహాలు వస్తయ్ అనేకంగా దుఃఖాలను సంపాదించుకొంటావు.

అందువల్ల సకామంగా కర్మ చేయవద్దు.

యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ
సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగఉచ్యతే
(గీ॥ 2-48)

నేను చేసేవాడిని, నా పేరు ఫలానా సుబ్బయ్య నాది ఫలానాగోత్రం నేను ఉండేది కృష్ణాగోదావరీ మధ్య దేశంలో నా ధర్మపత్నితోగూడి. నా కుటుంబం యొక్క క్షేమస్థైర్య విజయాదులకోసం ధన కనక వస్తు వాహనాదుల కోసం ఈ పూజ చేస్తున్నాను. ఈ కర్మ చేస్తున్నాను. అని సర్వజ్ఞుడైన పరమేశ్వరునితో హిస్టరీ నీ జాగ్రఫీ చెప్పి నీ వెందుకు పూజ చేస్తున్నావొ "నోట్" చేసుకోమని దరఖాస్తుపెట్టూ, నీవడిగిందిస్తే సంతోషించీ, రాకపోతే దుఃఖించీ మళ్ళి ఇంకో దేవత దగ్గర నీ అప్లికేషన్ దాఖలు చెయ్యటమనే వ్యభిచారాన్ని వదలివేసి ఫలం

పొందటం అనేమాటే లేకుండా. ఫలం వచ్చినా రాకున్నా పరమేశ్వర సేవ చిత్తశుద్ధికొరకు చేయాలి అనే భావనతో సిద్ధి అసిద్ధులలో, ఫలం కలిగినా కలుగకపోయినా. సమబుద్ధితో, కర్మలు నిష్కామ బుద్ధితో చెయ్యటం యోగము'' అనబడుతుంది నాయనా.

దూరేణ హ్యవరం కర్మ బుద్ధి యోగాత్ధనంజయ
బుద్ధౌ శరణ మన్విచ్ఛ కృపణాః ఫలహేతవః

(గీ॥ 2.49)

నిష్కామ కర్మకంటే. కామ్య కర్మానుష్టానం అత్యంత నీచాతి నీచము. అధమము, నికృష్టము, మూఢులు బుద్ధిలేనివాళ్లు చేస్తారు. వాళ్లు నీచులు, హీనులు ఎందుకంటె సకామ కర్మఫలమైన. జన్మలనూ. దుఃఖాలను బాధలను కావాలనికోరి తెచ్చుకొనేవాళ్ళు పూల్సు (fools) కాకపోతే మరేమిటౌతారు. అందుచేత బుద్ధిగలవాళ్ళు ఏంచెయ్యాలంటే. నిష్కామ కర్మే చెయ్యాలి.

ఎందుకంటే

నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయోనవిద్యతే
స్వల్ప మప్యస్య ధర్మస్యత్రాయతే మహతోభయాత్

(గీ॥ 2.40)

నిష్కామ కర్మకు ఫలమైన చిత్తశుద్ధి కలగకపోవటంగాని తప్పులుచేస్తే దోషం (Danger) గానీ లేదు. దీనిని కొంచెంగా చేసినప్పటికీ జనన మరణ ప్రవాహ రూపమైన సంసారమనే మహాభయంనుంచి విడుదల కలుగుతుంది.

బాగా విచారించి చూడు నాయనా.

MEMORIAL
V.P. NARI

లోకంలో వ్యవసాయం మొదలైన పనులకో ఫలం తప్పకుండా వస్తుందని నమ్మకం లేదుకదూ. వర్షాలు లేకపోవటం వల్ల గానీ ఎక్కువ వర్షాలు కురిసినందువల్ల గానీ పంటలు పాడై పోవచ్చు.

రోగం పోగొట్టుకోటానికి చికిత్స చేయించుకుంటే మందు పుచ్చు కుంటే రోగం కురురుతుందనే నమ్మకంలేదుగదూ. మంచి మందుదొరకక పోవచ్చు, మంచి డాక్టరు లేకపోవచ్చు ఈరెండూ ఉంటే, నీవు పథ్యం చేయకపోతే వ్యాధి వృద్ధి గావచ్చు

చూశావా ఈ సకామ కర్మలో ఇన్ని "వచ్చులు" ఉన్నవి.

కాని నిష్కామంగా పరమేశ్వరారాధన చేస్తే ఫలం కలగక పోవ టంగానీ అపాయంగానీ ఏమీలేవు చిత్తంలోవున్న మాలిన్యం, మకిల = కోరి కలు నశించి, మనస్సు పరిశుద్ధమవుతుంది. క్రమక్రమంగా జ్ఞానం పొం దుతాం అజ్ఞానం దాని కార్యమైన సంసారం పోతవి. ఇదీ నాయనా నిష్కా మకర్మవల్ల కలిగే మహా సౌభాగ్యం.

ఈ నిష్కామ కర్మనే చేయ్యాలి అని మాటిమాటికి భగవంతుడు గీతనిండా ఈక్రింద పేర్కొన్న శ్లోకాల్లోగూడ ఉపదేశించాడు చూచుకో నాయనా శుభం కలుగుతుంది.

(గీ॥ 2-51: 3-9: 3-19)
(గీ॥ 4-19: 4-20; 5-10, 12)
(గీ॥ 6-1: 9-21; 12-6.7.11)
(గీ॥ 17-11; 18-1.2, 6. 33)

(11) మరి మనకింత మహోపకారం కలిగించే ఈ జ్ఞానం ఎట్లా వస్తుందో ఏమిటో అది చెప్పండి. అది తెలిస్తే కొంత ప్రయత్నంచేసి బాగుపడటానికి మార్గం చూచుకోవచ్చుగా అంటే విను.

దాని కోసమే నీలో సద్బుద్ధి గలిగి నీవు జ్ఞాన సంపాదనకోసం ఉత్సాహం కలిగించుకోవాలి అనేగా ఇంతగా ప్రయత్నిస్తున్నది.

అసలు నిప్పు రవ్వంటూ ఒకటి ఉంటే, కట్టెల చిదుగులను ఒక్కొక్కటి ఆ రవ్వ దగ్గర చేర్చి జ్వాలవచ్చేదాక కళ్ళలోకి ముక్కులోకి నోట్లోకి పొగపోతున్నాగానీ లెక్కచేయకుండా కళ్ళనుంచి నీళ్ళు ముక్కునుంచి చీమిడీ వస్తూ చికాకు గలిగిస్తున్నాగానీ విసుగూ వేసటా లేకుండా మాటిమాటికీ విసురుతూ వాయు సహాయం గలిగించటంవల్ల వచ్చిన ఆ చిన్న జ్వాలను మహాజ్వాలగా విజృంభించేట్టు చేయటానికి దీక్షతో ప్రయత్నం చేసినట్లే.

నీలో సత్సంస్కారం అనే నిప్పురవ్వను శాస్త్రవచనాలు భగవద్గీతా వాక్యాలు అనే చిన్నచిన్న చిదుగులను ఒక్కొక్కటిగా దానిముందుంచి ఆ సంస్కారం అనే రవ్వ మొదట చిన్న జ్వాలగా వృద్ధిపొందేదాకనీవు మధ్యమధ్య తెంచుకుపోవటం శ్రవణం చేయకపోవడంచెప్పినట్లు అభ్యాసం చేయకపోవటం పాత అలవాట్లు వదలక పోవటం అనే పొగ చేత చీకాకు కలిగించినప్పటికీ విసుగూ వేసటా లేకుండా విడవకుండా నీ వెంటబడి గీతావాక్యాల అర్థాన్ని రజోగుణం తమోగుణం అనే పొగను పోగొట్టి

శాస్త్రానుకూలమైన అభ్యాసం అనే సత్వగుణాన్ని వృద్ధిపొందించి

మహాజ్వాలగా అయ్యేట్టు చెయటానికే మానవ కర్తవ్యంఅనే చిన్న చిన్న పుస్తకాలు ప్రచురించ బడుతున్నయ్

అందుచేత నీకు పరమ శ్రేయస్సును గలిగించే జ్ఞానాన్ని ఏట్లా పొందుతావో అది తెలుసుకొందాంపట్టు.

(1) నాయమాత్మా ప్రవచనేన లభ్యః
న మేధయా బహునా శ్రుతేన
యమే వైష వృణుతే తేన లభ్యః
తస్యైష ఆత్మా వివృణుతే తనూగ్ం స్వాం

(కఠ॥ ఉ॥ 1-2-23)
(ముండక॥ ఉ। 3 2-3)

అనేకంగా చెత్త శాస్త్రాలు చదవటంచేతనూ, పొట్టకూటి విద్యలు నేర్వటంచేతనూ పాండిత్యాలు ప్రదర్శించి, టైటిల్సూ బిరుదులూ, కనకాంకణాలు, కాశ్మీరు శాల్వాలూ, మొదలైనవి పొందటంచేతమన్నూ.

"ఉదర నిమిత్తం బహుకృత వేషః" అను వచనాను సారంగా తాను వేషాలు మార్చటంచేతనూ వేషాలు మాత్రం మార్చిన వారిని పూజించటంచేతనూ

వాగ్వైఖరీ శబ్దఝరీ శాస్త్ర వ్యాఖ్యాన కౌశలం
వైదుష్యం విదుషాం తద్వత్
భుక్తయే నతు ముక్తయే.

(వివేక చూడామణి)

వాగ్వైఖరిచేతనూ (Stylish way of lecturing) శబ్దఝరీ చేతనూ, (Eloquence) శాస్త్రవ్యాఖ్యాన కౌశలం, శాస్త్రవచనాలకు, ఒక్కొక్క మాటకూ, వాక్యానికీ వింత వింతగా పదచ్ఛేదంచేసి, అయిదారు అర్థాలు చెప్పే నేర్పుగలిగి ఉంటటంచేతనున్నూ

ఆత్మజ్ఞానం పొందబడదు నాయనా.

## 'భుక్తయేనతు ముక్తయే'

ఇవన్నీ గూడా షడ్రసోపేతంగా భోజనాలు చెయ్యటానికిన్నీ సుందరమైన వస్త్రాలు సంపాదించి ధరించటానికిన్నీ గృహారామ క్షేత్రాదులను సేకరించుకోటానికిన్నీ పనికి వస్తయ్యేగాని, ఆత్మజ్ఞానాన్ని = ముక్తిని ప్రసాదించవు అంటున్నవి కఠోపనిషత్తూ ముండకోపనిషత్తూ, వివేక చూడామణీ

మరి దేనివల్ల ఆత్మజ్ఞానం కలుగుతుంది అంటే

ఆత్మజ్ఞానం పొందాలనే తీవ్రమైన పట్టుదలతో ఇతర వాంఛలనన్నిటినీ తృణప్రాయంగా వదలివేసి. నిష్కాముడై ఆత్మకాముడై శాస్త్రానుగుణ్యంగా గీతా ఉపనిషత్తులు, వీటి ఉపదేశానుసారంగా అంటే నిరాడంబరంగా నైరంతర్యంగా శ్రవణాది సాధనలను చేసి చేసి ఈశ్వర కటాక్షానికి పాత్రులై ఎవరు "అహం బ్రహ్మాస్మి" అని అభేదానుసంధానం చేస్తారో వాళ్ళచేతనే ఈ ఆత్మ పొందబడుతుంది. అట్టివారికి ఈ ఆత్మ తానే అపరోక్షానుభూతిని ప్రసాదిస్తుంది.

అని ఉపాయం చెప్తున్నవి కఠోపనిషత్తు ముండకోపనిషత్తులు.

ఇంకా ఏమంటున్నది కఠోపనిషత్తు అంటే

2. నావిరతో దుశ్చరితాన్నాశాంతో
నాసమాహితః
నాశాన్తమనసో వాఽపి
ప్రజ్ఞానేనైన మాప్నుయాత్

[కఠ॥ ఉ॥ 1.2.24]

దుస్పృహావాసాలూ, దురభ్యాసాలూ, దుష్టకర్మలూ, దుష్టచింతనలూ వృథా సంభాషణలూ వృథా మనోరథాలు ఇవన్నీ మానేస్తేనేగాని ఈ ఆత్మ లభ్యంగాదు అంటున్నది కఠోపనిషత్తు

## నాయ మాత్మా బలహీనేన లభ్యః

(ముండుక॥ ఉ॥ 3.2.4)

మదించిన గుఱ్ఱాలవలె ఉన్న ఇంద్రియాలను వాటి ఇష్టంవచ్చినట్లు పోనిస్తూ, కళ్ళెంవేసి కంట్రోల్లో ఉంచుకోటానికి ప్రయత్నం చెయ్యలేని బలహీనులచేతను ధైర్యంలేని దద్దమ్మలచేతనూ సాధన చేయ్యలేని చపలులచేతనూ.

శ్రవణం చేసేటప్పుడు చంచలచిత్తులు కావటంచేత చిత్తైకాగ్రత లేని చెత్తరకం నాగన్నలచేతనూ, ఉపనిషద్వాక్యాల అర్థంను గ్రహించే శక్తి(Grasping power) తెలుసుకొన్నదానిని జ్ఞాపకముంచుకొనే శక్తి (retention power) లేని మందప్రజ్ఞుల చేతనూ ఈ ఆత్మ పొందబడదు.

ఎవరైతే ఆత్మజ్ఞానోపార్జన మీదనే దృష్టినుంచటం, దాని కోసం పరితాపంతో ప్రతి నిమిషం, పరమేశ్వర కటాక్షం కోసం ఫలం కలిగే వరకు ప్రార్థిస్తూ, భజిస్తూ, శ్రవణాది సాధనచేస్తూ ఉండట మనే ప్రజ్ఞ కలిగి ప్రయత్నిస్తూ ఉంటారో

వారికే ఈఆత్మ సాక్షాత్కారానంద సౌభాగ్యం చేకూరుతుంది. అంటున్నది ముండకోపనిషత్తు.

## 3. మచ్చింతనం మత్కథనం అన్యోఽన్యం మత్ప్రభాషణం మదేక పరమో భూత్వా కాలం నయ మహామతే

(వరాహ॥ ఉ॥ 2-46)

మంచిబుద్ధిగలవాడా, నాయనా,

i సద్గురువులవద్ద జీవాత్మ పరమాత్మ తత్త్వాన్ని శ్రవణంచేస్తూ

ii శ్రవణానుసారం శాస్త్రంబోధించే యుక్తులచేతా, దృష్టాంతాల చేతా విన్నదానిని మననంచేస్తూ

iii నీఒంటి అభ్యాసకులను నీవు కలుసుకున్నప్పుడు ఇతర సంభాషణ లేవీ చెయ్యకుండా విన్నటువంటి ఆత్మ తత్త్వాన్నే ఒకరికొకరు చెప్పుకొంటూ.

vi ఈ తత్త్వాన్ని శ్రవణం చెయ్యటానికి కుతూహలంగల వాళ్ళకు దాన్ని కధనం చేస్తూ బోధిస్తూ.

v నిశ్చయమయ్యేవరకు దీనినే సర్వదా ధ్యానిస్తూ కాలాన్ని వినియోగించుకో నాయనా

ఈ రీతిగా చేయబడే నిరంతర అభ్యాసాన్నే బ్రహ్మాభ్యాసమని బుధులు = తెలిసినవారు చెప్తున్నారు.

అందుచేత అట్లా చేస్తేనేగాని ఈ ఆత్మ లభ్యంగాదు అనీ.

4. సుప్తే రుద్ధాయ సుప్త్యం తం బ్రహ్మైకం
పరి చింత్యతాం

వరాహ॥ ఉ॥ 2.64)

పొద్దుననిద్రనుంచి లేచిందిమొదలు మళ్లీ రాత్రి నిద్రపొయ్యేవరకూ ఇతరసంభాషణలూ. ఆలోచనలూ, వ్యాపారాలూ (engagements)అన్నిటినీ వదలివేసి, నిరంతరంగా ఆత్మచింతనలోనే కాలం గడపటం కర్తవ్యమని తెలుసుకొని అట్లా చేయగా చేయగా ఆత్మజ్ఞానం లభ్యమవుతుందన్ని ఉపదేశిస్తున్నది వరాహ ఉపనిషత్తు

5. నిద్రాయా లోకవార్తాయాశ్శబ్దాదే రాత్మవిస్మృతేః
క్వచి న్నావసరం దత్త్వా చి న్తయాత్మానమాత్మని

(అధ్యాత్మ ఉ॥)

తమోగుణంగల వాళ్ల లోపస్థమార్కుసంపాదించినవాడవున్నూ నిద్ర పోవటంలో కుంభకర్ణుని తమ్ముడవూగాకుండా, ప్రాపంచిక విషయపరి జ్ఞానం బాగా సంపాదించాలనే కుతూహలంతో, అ విషయాలతోనిండి ఉన్న దిన, వార, పక్ష మాస పత్రికలన్నిటినీ చదవటమనే అభ్యాసాన్ని ఆ విషయాలను ఇతరులతో చర్చిస్తూ నీ గొప్పతనాన్ని ప్రకటించుకోటమనే అలవాటునూ, విడిచి, ఆత్మ తత్వాన్ని శ్రవణంచేస్తూ, శ్రవణాను సారంగా నీలోనీవే ఏకాంతమందు మననం చెస్తేనేగావి ఆత్మజ్ఞానం పొందబడదు అంటున్నది. అధ్యాత్మ ఉపనిషత్తు. ఈమాటే గీతామాత గూడ చెప్తున్నది చూడు.

6. తద్బుద్ధయ స్తదాత్మాన:
తన్నిష్ఠా స్తత్పరాయణా:
గచ్ఛం త్యపునారావృ త్తిం
జ్ఞాననిర్ధూత కల్మషా:

(గీ॥5-17)

అఖండమై, అద్వితీయమై ఆనందరసమైన బ్రహ్మమే గమ్యము = పొందదగినదనే నిశ్చయముగలవాళ్ళున్నూ అ బ్రహ్మముకంటె ఇతరము లైన సమస్త పదార్థాలమీద ఆసక్తిని విడిచివేసిన వాళ్ళున్నూ, నిరంత రంగా, ఆత్మతత్వాన్నే శ్రవణాది సాధనలచేత పొందుటకు, నిష్ఠాగరిష్ఠు లైన వాళ్ళున్నూ, ఆ సాధన పరిపాకం చెందటంచేత నిశ్చయాత్ములై బ్రహ్మతత్వాన్ని, అపరోక్షంగా అనుభవించటంచేత సమస్త కాలు ష్యాలు = కోరికలు = జన్మలు గలుగటానికి కారణాలైన మంచీ, చెడ్డా కర్మల యొక్క ఫలాలన్నీ నశించటం వల్ల, జన్మలు ఎత్తటం దుఃఖాలు అనుభవించటం అనే సంసారం నుంచి విముక్తులవుతారు = పునరా వృత్తిలేనివారవుతారు, అంటున్నది గీతామాత.

Acc No: 56

శాస్త్రానుసారంగా ఆచార్యుడు = గురువు చేత ఉపదేశింపబడ్డ వేదాంత మహావాక్యార్థమును, మాటిమాటికి శ్రవణం చేస్తూ శ్రవణం చేసిన దాన్ని మననం చేయగా చేయగా, పొందబడిన నిదిధ్యాసనం నిశ్చయం వల్లనే ఆత్మతత్త్వ అపరోక్షజ్ఞానం కలుగుతుంది అంటున్నది బృహదారణ్యక ఉపనిషత్తు.

తమేవైకం జానథ ఆత్మానం
అన్యా వాచో విముంచథ అమృతస్యైష సేతుః
(ముండక॥ ఉ॥ 2.2 5)

తమేవ = ఈ దేహేంద్రియాది మిథ్యాభూతమైన, అసత్యమైన సమస్త జగత్తుయొక్క కల్పనకు, అధిష్ఠానమై ఉన్న అద్వితీయాఖండైకరస ఆత్మను = అంటే, భ్రాంతిచేత లేని పాము ఉన్నది అనుకోటానికి అధిష్ఠానమై (తాడువలె) సత్యమై ఉన్న ఏకం = ఒకేఒక పరమాత్మను మాత్రమే జానథ = శాస్త్రము గురువు ఉపదేశించిన విధంగా శ్రవణ, మనన, నిదిధ్యాసలచేత తెలుసుకో నాయనా:

అన్యావాచ విముంచథ = ఇతరములైన మాటలను అంటే ఆత్మకు సంబంధించనివీ అనాత్మకు సంబంధించినవీ = ప్రాపంచిక విషయాలకు సంబంధించిన సంభాషణలు, విద్యలు, శాస్త్రాలు వీటినన్నింటిని, విడిచిపెట్టుతండ్రి.

ఎందుకంటే అమృతస్య, ఏష సేతుః = మోక్షం పొందటానికి అంటే అసారమై, అపారమై, దుర్వారమై, దుస్తరమైన సంసార పారావారం = సముద్రం యొక్క అవలిగట్టును పొందటానికి = తిరిగి మాతృగర్భమనే నరక కూపంలో పడకుండా ఉండటానికి

ఏషః = ఇదే ఈ ఆత్మతత్వ అపరోక్షజ్ఞానం ఒక్కటే

MEMORIAL LIBRARY
V.R. NARLA
D.P.R.I.

సేతుః = సేతువువంటిది = (Bridge) వంటిది ఇంతకంటే వేరే ఉపాయంలేదు తండ్రి అంటున్నది ముండక॥ ఉ॥

ఈ మాటే గీతామాత చెప్తున్నది.

9. తేషాం సతతయుక్తానాం
భజతాం ప్రీతిపూర్వకం
దదామి బుద్ధియోగం తం
యేన మా ముపయాంతి తే

(గీ 10-10)

సతతయుక్తానాం = ప్రాపంచిక విషయాలను అనుభవించాలి అనే ఆశను అవి తుచ్ఛములని తెలుసుకోటంచేత విడిచి వేసి అందువల్ల వాటిని సంపాదించటానికి కాలాన్ని పాడుచేసుకోకుండా

తమకున్న ఆధివ్యాధులు పోవాలనిగానీ తమకులేని శబ్దస్పర్శాది సుఖాలు కలగాలనిగానీ అభిలాషలేకుండా

ప్రీతిపూర్వకం = కేవలం ప్రేమపూర్వకంగా ఆత్మజ్ఞానం కోసమే

భజతాం = పరబ్రహ్మమైన నన్ను సంతోషంతో భజించటానికి ఎవరు నిరంతర ప్రయత్నం చేస్తారో

తేషాం = వారికి

బుద్ధియోగం = నన్నుపొందే బుద్ధికౌశల్యాన్ని అంటే ఆత్మతత్త్వాన్ని పొందటానికి కావలసిన. శ్రవణాది సాధనాసంపత్తిని కలుగజేసుకొనే బుద్ధి సామర్థ్యాన్ని

దదామి = అనుగ్రహిస్తాను.

ఇదివరకు అట్టి బుద్ధికుశలతను పొందినవారికి ఏం లాభం గలిగిందో. ఇప్పుడూ ఇకముందుగూడా. ఏమికలుగుతుందో చూడు.

వీతరాగ భయక్రోధాః
మన్మయా మా ముపాశ్రితాః
బహవో జ్ఞానతపసా పూతాః
మద్భావ మాగతాః

(గీ 4-10)

వీతరాగభయక్రోధాః

రాగము = 1. ఈ లోకంలోనూ పరలోకంలోనూ ఉండే విషయ సుఖాల మీద ప్రీతి. వాటిని అనుభవించాలి అనే ఆశ

2. తనకు ఉపకారం చేసే వాళ్ళమీద ప్రేమ, అంటే తనకు ప్రాపంచిక సుఖాలు కలిగించే వాళ్ళమీద ప్రేమ

భయం = ఇప్పుడు తనకులేని దుఃఖాలు కలుగుతవనీ, ఉన్న సుఖాలు పోతవనీ ఆందోళన కలిగించేదిన్నీ ఆ రెండు సంభవించకుండా చేసుకోడానికి ప్రయత్నం చేయించేదన్నీ అయిన చిత్తవృత్తి.

క్రోధం = తనకు అపకారం చేసే వారిమీదా అంటే తనకున్న సుఖానికిన్నీ దాన్ని కలిగించే పదార్థాలకున్నూ నష్టం. నాశనం గలిగించే వారిమీద ద్వేషం వాళ్ళకుబాధ కలిగించాలి వాళ్ళను నాశనం చెయాలి అనే చిత్తవృత్తి

ఈ దోషాలుగలవారు రాగభయక్రోధులు.

దీనికి వ్యతిరేకంగా

మోక్షం పొందాలి అనిన్నీ, ఈ దోషాలు మోక్షానికి అడ్డంవచ్చేవి అనిన్నీ, గురుసేవ శాస్త్రాభ్యాసం వీటివల్ల సందేహరహితంగా తెలుసుకొని

ఎవరైతే ఈ దోషాలను నిశ్శేషంగా తీసేసుకోవాలని గట్టి ప్రయత్నం చేస్తూ పరమేశ్వరుణ్ణి ప్రార్థిస్తూ ఇవి తీసేసుకోటంలో క్రమ క్రమంగా ఎక్కువ ఎక్కువగా మార్కులు సంపాదించుకొంటూ చివరకు నూటికి నూరు మార్కులు సంపాదించుకొంటారో వారు వీతరాగభయ క్రోధులు

జ్ఞాన తపసా పూతాః

జ్ఞాన తపస్సుచేత = "బ్రహ్మైవాహం" బ్రహ్మమేనేను ఆత్మనేను దేహాదులుగాను అనే నిరాటంకమైన బుద్ధినిశ్చయం = జ్ఞానం గలగటంచేత

**బ్రహ్మాది ఐశ్వర్య ఆశాసిద్ధ సంకల్ప బీజ సంతాపరూపం తపః**

(నిరాలంబ॥ ఉ॥ 37)

అన్నిటికంటె అన్ని విధాల గొప్పది అయిన చతుర్ముఖ బ్రహ్మగారి పోస్టు, ఉద్యోగం, పదవిని గూడా తుచ్ఛంగా భావించి, వాంఛించకుండా ఉండేబుద్ధి నిశ్చయంకోసం చేయబడే ప్రయత్నం దానివల్ల కలిగే ఏకాగ్రత "జ్ఞాన తపస్సు" అనబడుతుంది.

అట్టి జ్ఞాన తపస్సుచేత పూతాః = పరిశుద్ధమైన అంతఃకరణం = మనస్సు గలవారు.

ఈ రీతిగా వీతరాగ భయక్రోధులున్ను జ్ఞాన తపస్సుచేత పవిత్రులున్ను అయిన బహవః = శుకుడు, వామదేవుడూ, జనకుడూ, ఈ మొదలైన చాలామంది తీవ్ర ముముక్షువులు మాం = నన్ను, ఆత్మను, బ్రహ్మమును, అంటే

అపూర్వం = తనకు కారణం లేనిదిన్నీ
అనపరం = తనకు కార్యం లేనిదిన్నీ = సృష్టి అనే కార్యం లేనిదిన్నీ
అనంతరం = త్రివిధపరిచ్ఛేద రహితమున్నూ = అంటే దేశ పరిచ్ఛేదం = ఒకచోట ఉండి వేరేచోట లేకపోవటం అనేది
కాలపరిచ్ఛేదం = ఒకప్పుడు ఉండి ఇంకొకప్పుడు లేకపోవటం అనేది.
వస్తుపరిచ్ఛేదం = ఒకవస్తు స్వరూపమై ఇంకొక వస్తు స్వరూపం కాకపోవటం అనేది

ఈ మూడు పరిచ్ఛేదాలు లేని బ్రహ్మమైన నన్ను

ఉపాశ్రితాః = ఉపాశ్రయించినవారై ఉపాశ్రయణం అంటే, అద్వితీయాఖండైకరసం అయిన ఆత్మనే నేను, అనే స్వస్వరూప తత్త్వాన్ని. స్వానుభవంచేత పొందటం

దీనికొసమేనన్ను భజించినవారు.

మన్మయాః మద్భావమాగతాః = ఆత్మతత్త్వాన్ని అపరోక్షంగా సాక్షాత్కరింప చేసుకొన్నవారై అజ్ఞానం దానివల్ల ఉన్నవి అనుకొనబడే దేహాలను నాశమొందించుకొన్నవారై

అక్షణమందే. నా భావాన్ని పొందారు బ్రహ్మత్వాన్ని పొందారు = విదేహమ్కై వాల్యన్ని పొందారు అంటే ఏమిటో గీతామాత ఏం చెప్తున్నదంటే

11. మమ సాధర్మ్య మాగతాః
సర్గేఽ పి నోపజాయంతే
ప్రలయే న వ్యథ న్తి చ

(గీ॥ 14- )

వాళ్లంచరూ నేనే అయిపోవటం వల్ల సృష్టిసమయంలో పుట్టటం అనే బాధగాని ప్రళయ సమయంలో నశించటం అనే దుఃఖంగాని లేని వారైనారు.

అంటే జననమరణ ప్రవాహ సంసారం లేనివారు అయివారు.

అని భగవంతుడు తనను పొందే బుద్ధి కౌశల్యాన్ని తనకటాక్షం చేత, పొందినవారు సంపాదించే సౌభాగ్యాన్ని విశదీకరించి. ఇదివరలో అట్లా పొందిన వాళ్లెవరైన ఉన్నారా అంటే చాలామంది ఉన్నారు. నీవు గూడా ప్రయత్నం చేస్తే నీవు గూడా పొందటంలో ఏమీ సందేహంలేదు అని గీత నిండా బోధించి, బోధించి

ఈ మాటనే. చివరసారి 18 వ అధ్యాయంలో మళ్లీ చెప్పి ముగించాడు భగవంతుడు.

భక్త్యా మా మభిజానాతి
యావాన్ య శ్చాస్మి తత్త్వతః
తతో మాం తత్త్వతో జ్ఞాత్వా
విశతే తదనంతరం

(గీ॥ 18.55)

అనవరతాభ్యాస పాటవంచేత పరమేశ్వర తత్త్వజ్ఞాన రూపమగు పరాభక్తిని పొందటం వల్ల, జ్ఞాని

పరబ్రహ్మనైన నేను మాయాశక్తి విలాసమహా వ్యామోహం చేత, కల్పింపబడ్డ అనేకములైన ఉపాధుల = దేహాల భేదం చేత ఎంతటి వాడనో

అసలు ఉపాధులచేత ఆరోపింపబడే భేదం లేసలేనందువల్ల వాస్తవంలో, సచ్చిదానంద స్వరూపుడనైన నేను ఎట్టివాడనో

సాకల్యంగా తెలుసుకొంటాడు వెంటనే ఆక్షణంలోనే నన్ను ప్రవేశిస్తాడు. నాలో చేరిపోతాడు, నాసాయుజ్యాన్ని పొందుతాడు. స్విచ్ వేయటానికి, లైటు రావటానికి మధ్యకాల విలంబం ఎట్లాలేదో అట్లాగే సాధనమైన జ్ఞానానికీ ఫలమైన ముక్తికీ మధ్యకాల విలంబంలేదు

అని గ్యారంటీ ఇస్తున్నాడు భగవంతుడు

కనుక తండ్రీ పరమేశ్వరుని గ్యారంటి మీద నమ్మకం కలిగి ఆవాక్యాలనూ ఆ గ్యారంటీని అందరికీ అర్థమయ్యేటట్టు అందించేందుకు

"వ్యాసుడు" అనే పోస్టు = ఉద్యోగం = పదవికి యోగ్యత = Qualification కలవాని నియమించి (appoint చేసి) ఆయన మనకు శ్రేయోమార్గాన్ని చూపించేటట్టు చేసాడు గనుక ఆ మహాత్ముని మాటలను నమ్మి "జ్ఞానాన్ని" సంపాదించుకోటానికి ఈనాడే కంకణం కట్టుకో తండ్రీ నీ పాతబాట అంటే

మితిమీరి. అయిన వస్తువునూ కాని వస్తువునూ ఎక్కడబడితే అక్కడ తింటం

బెడ్ కాఫీ, విస్కీ తాగటం, బ్రాందీ బాటిల్సునూ ఖాళీచేస్తూండటం

సినిమాలను సిగరెట్లనూ సేవించటం ముక్కుపొడుంను నాసికా రంధ్రాల్లో దట్టించటం

అన్యాయాలు అక్రమాలుచేసి డబ్బు ఆర్జించటం.

అట్లా ఆర్జించిన దాన్ని అన్యాయాల కోసం ఖర్చు పెట్టటం

ఇట్లాంటివే అయిన సవాలక్ష అక్రమమైన అభ్యాసాలకు బానిసవై ఇదే జీవిత లక్ష్యం ఇంకా చెయ్యాలిసింది ఏమీలేదు అనుకొంటూ నీకు నీవే ద్రోహం చేసుకొనే పాత బాటను విడిచేసి

గీతామాత వాక్యానుసారంగా జ్ఞానాన్ని పొందేందుకు అభ్యాసాన్ని ఆలస్యం చేయకుండా ఆరంభంచెయ్యిబాబూ అజ్ఞానంతోనూ, అహంకారం తోనూ కూడినవాడై సదుపదేశంచేసే గ్రంథాలమీద పెద్దలమీద ఆగ్రహంచెంది అధోగతికి పోకు తండ్రీ

జ్ఞానం ఎంత గొప్పదో అది నీకు మహోపకారం ఎట్లా చేస్తుందో జ్ఞానం అంటే ఏమిటో దాన్ని పొందటం ఎట్లాగో ఈ విషయాలన్నిటినీ గురించి "గీతామాత ఏంచెప్తున్నదో" యింకా యింకా విశదీకరించుకుందాం పట్టు.

విసుగుచెంది వెఱ్ఱివాడవై ఈ విచారం అనే తపస్సును ఏకాగ్రమైన చిత్తంతో చేయకుండా విడిచేసి ఇంకేం చేసినా లాభం లేదని శాస్త్రాలు అన్నీ ఏకగ్రీవంగా చెప్తున్నసంగతి అర్ధమైంది గదూ విను.

1. శ్రేయాన్ ద్రవ్యమయా ద్యజ్ఞాత్
జ్ఞానయజ్ఞః పరంతప
సర్వంకర్మాఖిలం పార్థ
జ్ఞానే పరిసమాప్యతే

(గీ 4.33)

దేవతలకు కానుకలు సమర్పించటమనే ద్రవ్యయజ్ఞాలూ తపోయజ్ఞాలూ ప్రాణాయామ యజ్ఞాలూ అనేదేహంతోచేయబడే యజ్ఞాలూ స్వాధ్యాయ యజ్ఞం అనే వాచిక కర్మయజ్ఞం శాస్త్రార్థ జ్ఞానయజ్ఞం ధ్యానయోగ యజ్ఞాలూ అనే మానసిక కర్మ యజ్ఞాలు ఇవన్నీ నశ్వరాలైన = అంత మొందే ఫలాన్ని కలిగించే యజ్ఞాలు గనుక వీట న్నిటి కంటె నిత్యమైన మోక్షాన్ని కలిగించే స్వస్వరూపజ్ఞాన యజ్ఞం ఆత్మజ్ఞాన యజ్ఞం చాలగొప్పది. కర్మలను నిష్కామంగా చేస్తే చిత్తశుద్ధి కలిగి అంతే మనస్సులోని కోర్కెలన్నీ నాశమొంది జ్ఞానం పొందటాని కి అర్హత కలుగుతుంది జ్ఞానం కలిగితే ఇంకా కర్మలెందుకూ వంటంతా అయిన తర్వాత ఇంకా కట్టెలు కాలబెట్టటం దేనికి.

అంతగొప్పది నిష్కామకర్మ దానివల్ల కలిగే "జ్ఞానం"

2. అపిచేదసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః
సర్వం జ్ఞానప్లవే నైవవృజినం సన్తరిష్యసి
(గీ 4–36)

పద్నాల్గు లోకాల్లోనూ పాపాలుచేసిన వాళ్ళ లిస్టులో నీవే ఫస్టు అయినప్పటికీ ఏమీ భయపడనక్కరలేదు.

ఈ పాప సముద్రాన్ని జ్ఞానమనే నావతో దాటేస్తావు. అందుచేత అయ్యోనేను పాపిష్టివాడను. నాకు జ్ఞానం కలుగుతుందో లేదో అనే భయం వద్దు నాయనా

అంత గొప్పది నిష్కామకర్మ దానివల్ల కలిగే "జ్ఞానం"

3. న హి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే
తత్స్వయం యోగసంసిద్ధః కాలేనాత్మని విందతి
(గీత 4-38)

నిన్ను పవిత్రుణ్ణి చేయటంలో జ్ఞానంతో సమానమైనది ఇంకొకటి లేదు. జపతపాలు, స్నానసంధ్యలూ, నోములూ, వ్రతాలు నిన్ను పవిత్రుణ్ణి చేయటంలో జ్ఞానంవలె సమర్థవంతములు గావు. క్రమక్రమంగా నీ అభ్యాసపాటవంచేత నీ మనస్సును అంటిపెట్టుకొని ఉన్న కోరికలు నశిస్తూ పోగాపోగా ఆ రీతిగా బాగుపడిన మనస్సులో కాలక్రమేణా ఈశ్వరకటాక్షంచేత జ్ఞానం ఆవిర్భవిస్తుంది పవిత్రుడవవుతావు

అంత గొప్పది జ్ఞానం

4. జ్ఞానం తేఽహం సవిజ్ఞానం
ఇదం వక్ష్యా మ్యశేషతః
యద్ జ్ఞాత్వా నేహ భూయో ఽన్యత్
జ్ఞాతవ్య మవశిష్యతే

(గీ॥ 7.2)

నీకు జ్ఞానం (Theoritical knowledge) విజ్ఞానం (P.actical knowledge) రెండు చెప్తా దాన్ని తెలుసుకొంటే మళ్ళా ఇంకొకటి తెలుసు కోవాలిసింది మిగిలి ఉండదు తండ్రీ

అంతగొప్పది జ్ఞానం

ఎందుకంటే

5. యద్ జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్

(గీ 9.1)

దేన్ని తెలుసుకొన్నందువల్ల అశుభంనుంచి = పుట్టటంచావటంఅనే సంసార బాధనుంచి విడుదల పొందుతావో మోక్షం పొందుతావో అది జ్ఞానం నాయనా.

అంతగొప్పది జ్ఞానం

6. రాజ విద్యా రాజగుహ్యం
పవిత్ర మిద ముత్తమం
ప్రత్యక్షా వగమం ధర్మ్యం
సుసుఖం కర్తు మవ్యయం

(గీ॥ 9—37)

ఈ బ్రహ్మవిద్య విద్యల్లోకెల్లా చాలా శ్రేష్ఠమైంది. ప్రాయశ్చిత్తాది కర్మలవల్ల కలిగే పవిత్రతకంటే చాలాచాలా ఎక్కువగా పవిత్రతను గలిగిస్తుంది. ఎందుకూ అంటే నీకు గల సంచిత కర్మనూ ఆగామి కర్మనూ భస్మంచేసి ప్రారబ్ధాన్ని భయం లేకుండా అనుభవించే మహా ధైర్యాన్ని కలుగచేస్తుంది. దీనివల్ల అసలు ఫలం వస్తుందో రాదో? వస్తే ఎప్పుడు వస్తుందో అనే మాటే లేదు. ఇప్పుడు ఇక్కడ ఆ ఫలం నీవు అనుభవిస్తావు. ఇది పొందటానికి ఏమీ ఆయాస పడాలిసిన అవసరంలేదు డబ్బులే దేఅని భయపడ నక్కరలేదు. ఒక్క పైసాగూడ అక్కర లేదు. మరి దీని వల్ల వచ్చే ఫలమో అనంతమూ నిరవధికమూ శాశ్వతయూ నాయనా.

అంత గొప్పది జ్ఞానం.

7. యథైథాంసి సమి ద్ధోఽగ్నిః
భస్మసాత్కురుతే ఽర్జున
జ్ఞానాగ్ని స్సర్వకర్మాణి
భస్మసా త్కురుతే తథా

(గీ 9.2)

బాగా మండుతున్న అగ్ని జ్వాల ఎన్ని కట్టెలనైనా ఎట్లా భస్మం చేసేస్తుందో!

అట్లాగే "జ్ఞానం" అనే అగ్ని అనేక కోట్ల జన్మల్లో చేసిన విన్నీ. నీకు సంసారం కలిగించే విన్నీ అయిన కర్మ రాశులన్నిటినీ భస్మం చేసేస్తుంది మోక్షాన్ని కలిగిస్తుంది నాయనా.

అంత గొప్పది జ్ఞానం

8, జ్ఞానీ తు ఆత్మైవ మే మతం

(గీ॥ 7-18)

జ్ఞానం సంపాదించన జ్ఞాని పరమేశ్వరుడనైన నేనే. నాకూ అతనికి భేదం లేనేలేదు. అని భగవంతుని ఉపదేశం.

అంత గొప్పది జ్ఞానం

ఇదం జ్ఞాన ముపాశ్రిత్య
మమ సాధర్మ్య మాగతాః
సర్గేఽపి నోపజాయన్తే
ప్రలయే న వ్యథన్తి చ

(గీ॥14-2)

ఈ జ్ఞానంను పొందిన శుక వామదేవ జనకాదులు పరమేశ్వరుడనగు నా స్వరూపాన్ని అంటే సచ్చిదానందత్వాన్ని పొందారు. అందువల్ల వారు కల్పాంత ప్రళయంలో నశించటం సృష్టికాలంలో మళ్ళా పుట్టటం అనే దుఃఖం బాధా లేనివారయినారు.

అంత గొప్పది జ్ఞానం

10) మరి ఈజ్ఞానాన్ని పొందటం ఎట్లా గంటావు. విను.

తద్విద్ధి ప్రణిపాతేన
పరిప్రశ్నేన సేవయా
ఉపదేక్ష్యన్తి తేజ్ఞానం
జ్ఞానిన స్తత్త్వదర్శినః

(గీ। 4.34)

జ్ఞానవంతులూ తత్త్వాన్ని = నిజాన్ని దర్శించినవారు = అవగాహన చేసుకొని అనుభవించినవారూ అయిన వారిని

i) వినయ విధేయతలతో సమీపించీ

ii) సాష్టాంగ దండ ప్రణామంగావించీ

iii) సంసారబంధం ఎట్లా గలిగింది ఎట్లా పోతుంది మోక్షం ఎట్లా గలుగుతుంది అని ప్రశ్నించీ

vi) వారికి అనుగ్రహం గలిగే వరకూ వారిని సేవించీ

v) ఈ రీతిగా నీవు యోగ్యత గలవాడవని వాళ్ళకు నమ్మకం కలిగిస్తే

వాళ్లు నీకు జ్ఞానాన్ని ఉపదేసిస్తారు నాయనా. అంతేకాని డబ్బుతో దీన్ని పొందలేవు డబ్బు తీసుకొని చెప్పేవాడు వాడికి తెలియదు నీకు చెప్పలేడు.

11. శ్రద్ధావాన్ లభతే జ్ఞానం
తత్పర స్సంయతేన్ద్రియః
జ్ఞానం లబ్ధ్వా పరాం శాన్తిం
అచిరే ణాధిగచ్ఛతి

(గీ॥ 4–39)

అయితే అడ్డమైన వాళ్ళందరూఏవో ప్రాపంచిక లాభాలు పొందే ఉద్దేశ్యంతో గూడా దొంగ నమస్కారాలు చేసేవాళ్ళుగూడా ఉంటారు గనుక

వాళ్ళలో ఎవరు జ్ఞానానికి అరులో

(i) శ్రద్ధ-శాస్త్ర వాక్యాలమీద ప్రబలమైన విశ్వాసం ఉందా లేదా అవీ

ii) తత్పరత = జ్ఞానాన్ని పొందాలి అనే తీవ్రమైన ఆసక్తి ఉందా లేదా అనీన్నీ

iii) సంయతేంద్రియత : ఇంద్రియాలను కంట్రోల్లో ఉంచుకొనే శక్తి ఉన్నదా లేదా అనీన్నీ పరీక్ష చేస్తారు. పరీక్షకాగిన వాళ్ళకే జ్ఞానాన్ని బోధిస్తారు. కాని డబ్బు ఇయ్యగల వాళ్ళకూ ఇచ్చే వాళ్ళకు బోధించరు.

సరే "జ్ఞానం" యొక్క గొప్పతనం తెలుసుకొన్నాం

మరి జ్ఞనం అంటే ఏమిటో గీతామాత ఏంచెప్తున్నదో అది గూడా బాగా తెలుసుకుందాం పట్టు.

క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి
సర్వక్షేత్రేషు భారత
క్షేత్రక్షేత్రజ్ఞయో ర్జ్ఞానం
య త్తద్ జ్ఞానం మతం మమ

(గీ। 13-3)

క్షేత్రము = శరీరము
క్షేత్రజ్ఞుడు = శరీరంలో ఉండేవాడు

వాడేశరీరం గలవాడు

గనుక "శరీరి" అని దేహంగలవాడు గనుక 'దేహీ' అనిన్నీ "జీవుడు" "జీవాత్మ" అనిన్నీ చెప్పబడు తాడు.

అన్ని క్షేత్రాలలో ఉన్న జీవుడెవరంటే పరమేశ్వరుడనైన "నేన" కనుక "జీవాత్మ" అని చెప్పబడేది అన్ని దేహాల్లో ఒక్కటే. నల్లిలోను, పిల్లిలోను దేవతలోనూ దయ్యంలోనూ సర్వత్ర ఉండే జీవాత్మ ఒక్కడే పరమేశ్వరుడే మరి ఈ భేదాలు ఇవన్నీ ఏమిటయ్యా అంటే

అవి దేహాలకూ మనస్సులకూ సబంధించినభేదాలు గానీ జీవాత్మకు సంబంధించినవికావు. అసలు పరమార్థంలో వాస్తవంలో ఈదేహాలుఅనేవి లేనేలేవు గనుకనూ సత్యంగా ఉన్నది జీవాత్మ అనుకోబడే పరమాత్మ = పరమేశ్వరుడే గనుకనూ ఈ భేదాలు గూడా లేనేలేవు. ఇవి అబద్ధాలు భ్రాంతులు అని నిశ్చయంగా తెలుసుకోటమే "జ్ఞానం".

అంటే సత్యవస్తువు

'ఏకమే వాద్వితీయంబ్రహ్మ'

(పైంగల, ఉ॥)

ఏ భేదాలు లేకుండా రెండవది లేకుండా బ్రహ్మమే ఉన్నది. అని తెలియటం అన్నమాట.

రోజూ నిద్రలో మన అనుభవంలో ఉన్నది అదేగా

"జ్ఞానం" అంటే ఇదేననీ ఉపనిషత్తుల సారమైన గీతామాత చెప్తున్నది నాయనా.

బాగానే ఉంది ఇట్లా జగత్తు లేకపోతే పీడాపోతుంది గానీండీ—

మరిఇది సామాన్యంగా అందరిఅనుభవంలోకిరావటంలేదే. అందరూ తాముదేహాల మనిన్నీ జగత్తు సత్యమని అనుకుంటున్నారుగా

నాయనా ఇదేగా అజ్ఞానం అనిఈపుస్తకంనిండా ప్రమాణాలతోనూ ఋజువులతోనూ యుక్తులతోనూ చూపించి ఈ అజ్ఞానం పోవటానికి జ్ఞానం సంపాదించటానికి మనఅభ్యాసం ప్రయత్నం చెయ్యాలి అనీ ఈ అభ్యాసం చేయటానికేమనుష్యజన్మ ఎత్తామనిన్నీ మాటిమాటికీమంచి పోతావేమో అని మనసులో నాటుకు పోయే టట్లు చెప్తున్నది.

మరి అభ్యాసం అంటే ఏమిటో ఎట్లా చెయ్యాలో దీన్ని గురించి గీతామాత ఏం చెప్తున్నదో ఇంకా తెలుసుకొందాంపట్టు.

1. అమానిత్వం అదంభిత్వం
అహింసాక్షాంతిరార్జవమ్
ఆచార్యోపాసనం శౌచం
స్థైర్యమాత్మవినిగ్రహః

(గీ॥ 13-7)

2, ఇంద్రియార్థేషు వైరాగ్యం
అనహంకార ఏవచ
జన్మమృత్యు జరావ్యాధి
దుఃఖదోషాను దర్శనం

(గీ॥ 13- 8)

3. అసక్తి రనభిష్వంగః
పుత్రదారగృహాదిషు
నిత్యంచ సమచిత్తత్వం
ఇష్టానిష్టోపపత్తిషు

(గీ 13.9)

4. మయి చానన్యయోగేన
భక్తి రవ్యభిచారిణీ
వివిక్తదేశ సేవిత్వం
అరతి ర్జనసంసది

(గీ 13.10)

5. అధ్యాత్మజ్ఞాననిత్యత్వం
తత్త్వజ్ఞానార్థదర్శనమ్
ఏతద్ జ్ఞానమితిప్రోక్తం
అజ్ఞానం యదతోఽన్యథా

(గీ 13.11)

ఈ అయిదు శ్లోకాలలో నీవు బాగుపడాలంటే నీవు ఏమి చెయ్యాలో ఏ లక్షణాలకోసం అహోరాత్రాలూ, విసుగూ వేసటా లేకుండా పరిశ్రమ చేసి పొందాలో ఆ లక్షణాలను వివరించాడు భగవంతుడు. కనుక ఒక్కొక్క శ్లోకంలో ఒక్కొక్క మాటలో వున్న అమృతాన్ని పిండి ఆస్వాదిద్దాం పట్టు.

నీ పాత అలవాట్లు, పశువృత్తులూ, డేబరింపులూ, దేవతలతోనూ, భూతాలతోనూ, బేరాలాడుతూ బిచ్చం ఎత్తటం మానేసి

భగవంతుడు చెప్పిన లక్షణాలు సంపాదించటానికి నడుం బిగించి కంక ణం కట్టుకో.

అసలు 'జ్ఞానం' అనేది ఇతరులకు కనబడేది గాదు. కాని కొన్ని లక్షణాలచేత ఒకడు జ్ఞానం సంపాదించిన వాడా కాదా అన్నమాట తెలు స్తుంది. ఎట్లాంటే.

మల్లెపూవులు మొదలైనవి విచ్చి నయ్యంటే పరిమళం ముక్కు దగరకు రావటం ఎంత సహజమో అట్లాగే జ్ఞానం సంపాదించటంలో ప్యాసు మార్కులు అయినా సరే సంపాదించాడంటే, వాని లక్షణాలే వేరుగా ఉంటయ్. అవి ఏమిటో చూద్దాం.

## 1. అమానిత్వం

మానిత్వం అంటే తాను తనజాతి గొప్పను గురించిగాని, చదువూ డిగ్రీల గొప్పను గురించిగాని పదవి గొప్పను గురించిగాని.

అర్థబలం, అంగబలం, సౌందర్య సౌష్టవాల గొప్పను గురించి గాని,

తనకు సంబంధించిన భార్యా పుత్ర పౌత్ర బంధుమిత్ర వర్గాలకున్న గొప్పను గురించిగాని తానే పొగడుకోటం, మెచ్చుకోటం.

తనకున్నవి లేనివి అయిన గుణాలను గురించి ఇతరులు ఉగ్గడిస్తే గొప్పగా చెప్పితే సంతోషించటం. ఆ సంతోషాన్ని ప్రకటించటం. ఇట్లా పొగడేవారు ఎవరూ లేకపోతే, తానే డబ్బిచ్చి పేపర్లలో వేయించుకోటం.

తనను ప్లాట్ఫారం మీద కూర్చోపెట్టి, పూలమాలలువేసి, సన్మాన పత్రాలు చదివి, కట్నాలు సమర్పిస్తే పొంగిపోవటం, ఏనుగ మీద కూర్చో పెట్టి ఊరేగిస్తే ఉబ్బిపోవటం. అట్లా చెయ్యకపోతే మొహం ముడుచు కోటం. మానిత్వం అంటే ఇది

అమానిత్వం అంటే ఈపైన చెప్పినవి ఏమీ లేకపోవటం నాయనా కనుక ఈ "అమానిత్వాన్ని" సంపాదించటానికి ప్రయత్నం చెయ్యి. ఇదినీలో ఎంత వరకున్నదో చూచుకొని సెంట్ పర్సెంట్ సంపాదించటానికి, ప్రయత్నించు. ఇదే తపస్సు పూజ = ఆరాధన = వ్రతం సర్వం ఇదే అని తెలుసుకో నాయనా.

## 2. అదంభిత్వం

మహాలోభి అయిన ధనవంతుడు ప్రాణాలైనా బలిఇవ్వటానికి ఒప్పుకుంటాడేగాని; తన ధనం ఎక్కడ ఉన్నదో అగుపట్టును ఇతరులకు ఏలాగున చెప్పడో.

పతివ్రత అయిన స్త్రీ తన మానం కాపాడుకోటానికి ఎట్లా ప్రాణాలు వదలటానికి సంసిద్ధురాలుగా వుంటుందో.

ఆ రీతిగా. తను చేసిన పుణ్యకార్యాలను సత్కర్మలనూ, ఆర్జించిన జ్ఞానాన్ని గురించి ఎట్టి పరిస్థితులంలో నైనాసరే గొప్పగా తాను చెప్పకోటంగానీ ఇతరులు తన్ను గురించి గొప్పగా చెప్పుకోవాలని తలంచటం గానీ. ఇతరులు తన్ను పొగడుతూంటే ఆసక్తితో వినటంగానీ తనకున్న పేరుప్రతిష్ఠలను ధనంలోకి మార్చుకోవాలనీ (exchange) చేసుకోవాలనీ. అంటే వాటిని ఆధారం చేసుకొని వాటివల్ల స్వార్థంకోసం ధనం సంపాదించాలనే ఉద్దేశ్యం కలిగి తాను చేసిన ఆసత్కర్మలనూ పుణ్య కార్యాలనూ ప్రకటించుకోటం advertise చేసుకోవటంగానీ అనేవి ఏమీ లేకుండటం అదంభిత్వం అంటారు నాయనా:

ఈ అందభిత్వానికి వ్యతిరేకం అయిన దంభిత్వం గలవాడు అసుర భావం గలవాడు ఏమంటూంటాడో ఏం జేస్తాడో అదిగూడా తెలుసుకొందాం పట్టు. లేకపోతే మనం మోసపోతాం.

నాకు నారసింహమంత్రం, ఆంజనేయ మంత్రం సిద్ధి అయినయ్ ఆ దేవతలు నాకు సాక్షాత్కరించారు. నేను మీ అందరి కష్టాలుదుఃఖాలు తీసేస్తా. నేను మంత్రాలు ఉపదేశిస్తా. దానిరేటు "ఇన్ని"రూపాయలు. నేను మీ రోగాలు కష్టాలు పోవటానికి తాయెత్తులు రక్షరేకులూ ఇస్తా. దానిరేటు "ఫలానా". నేను చిన్న చిన్న జబ్బులకైతే విభూతి ఇస్తా దాని రేటు "ఇంత" నా "భిక్ష" రేటు "ఇంత" అని ప్రకటించు కొంటూం టాడు నాయనా.

కనుక అదంభిత్వం అనే జ్ఞాన లక్షణం తెలుసుకొని అదినీలో ఎంత వరకున్నదో చూచుకొని వృద్ధిచేసుకోటానికి నీకెంత ధైర్యంగావాలో నీవుదానికోసం ఎంత వేగంగా పరుగెత్తాలో విచారించుకొని

దీనిని కొంత వరకైనా వృద్ధి చేసుకొనే శక్తిని ప్రసాదించు మా తండ్రి అని

పరమేశ్వరుణ్ణి పరితాపంతో ప్రార్థించు నాయనా

ఇదే తపస్సు = పూజ = ఆరాధన = నోము = వ్రతం దీక్ష యాత్ర అని తెలుసుకోనాయనా అంటున్నది గీతామాత.

## 3. అహింస

ఏ ప్రాణికిని, తన కాయంతో. చేతులూ కాళ్ళతోను, వాక్కుతోను. ఎన్నడు. ఏ పరిస్థితిలోనైనప్పటికి హింస. కలిగింపకపోవటం, కష్టం నష్టం. దుఃఖం కలిగించకుండా ఉండటం మనస్సులో ఇతర ప్రాణుల గురించి దుష్టచింతన చెయ్యకుండటం అనేది అహింస అనబడుతుంది. ఇదీ నూటికి నూరు మార్కుల అహింస నాయనా! ప్రాణికోటి కంతటికి అభయ ప్రదానం అన్నమాట. దీన్ని అభ్యాసం చెయ్యటంలో ఒకమెట్టు మీద నుండి పైమెట్టుకు పోవటానికి ప్రయత్నం చెయ్యాలి తండ్రీ.

## 4. క్షాంతి

" అంటే ఓర్మి = సహనశక్తి.

ఎట్టికష్టాలనైనా, నష్టాలనైనా, విసుగు ఏడుపు లేకుండా సహించటం వాటిని తనకు కలిగించారు అనుకొనేవాళ్ల మీద ద్వేషం, అపకారబుద్ధి లేకుండటం క్షమ అనబడుతుంది. ఎవరైనా కత్తిదూసి తన్ను చంప వచ్చినప్పటికిన్నీ తొణకకుండా.

నైనం ఛిదంతి శాస్త్రాణి నైనం దహతి పావకః

(గీ॥ 2.23)

ఆత్మ స్వరూపమైన నన్ను కత్తులు కోయలేవు. అగ్ని కాల్చలేదు. అలాంటినన్ను ఇంకొకడు చంపడం ఏమిటి. ఇక దేహాన్ని చంపుతాడు అంటావా. అని విచారిస్తే "నాసతో విద్యతేభావో (గీ 2.16) అసత్తు అయి. అసలే లేని దేహాన్ని ఒకడు చంపటం ఏమిటీ. అనే విచారం చేత ఏభయం లేకుండా.

వృక్ష మివతిష్ఠా సేత్ ఛిద్యమానోఽపి నకుప్యేత
నకంపేత ఉపల మివతిష్ఠాసేత్ ఛిద్యమానోఽపి
నకుప్యేతనకంపేత ఆకాశమివతిష్ఠాసేత్
ఛిద్యమానోఽపి నకుప్యేతన కంపేత

(సుబాల॥ ఉ॥ 13వ ఖండం)

ఎవడైన గొడ్డలితో తన్ను నరకటానికి వస్తూంటే, వద్దునాయనా, నీ కాళ్లు మొక్కుతానన్ను నరకవద్దు. అనిదైన్యాన్ని ప్రకటించటంగానీ. నన్ను నరుకుతావుట్రా చూడు విన్నేం చేస్తానో అని కోపంతో తిరుగబడటంగానీ. లేకుండా. కదలక. మెదలక ఊరకుండే చెట్టు లాగున.

సమ్మెటతో పగల కొడ్తుంటే భయంతో ప్రార్థించకుండా, కోపంతో ఎగిరి మీద పడకుండా రాయి ఎట్లా ఊరుకుంటుందో,

ఆకాశంలో కత్తి తిప్పినా, మంటమండించినా, ఏ విధంగాను కోపతాపాలుచెందకుండగా,ఆకాశం ఎట్లా ఉంటుందో,

అట్లాగే నూటికి నూరు మార్కుల శాంతిని సంపాదించినవాడు ఉంటాడు నాయనా, ఈశక్తిని ప్రసాదించమని పరమేశ్వరుణి ప్రార్థించాలి తండ్రీ.

## 5. ఆర్జవం

అంటే కౌటిల్యం లేకుండటం తలంచేది ఒకటి చెప్పేది వేరొకటి చేసేది మరొక్కటిగాకుండా ఏది మనస్సులో ఉందో అది చెప్పటం దాన్ని చేయటం ఆర్జవం అనబడుతుంది.

## 6. ఆచార్యోపాసనం

అహకారం లేకుండా ఆచార్యుణ్ణి = గురువును సేవించి ఆత్మజ్ఞాన భిక్షను పొందటం.

## 7. శౌచం

అంతఃకరణశుద్ధి = ప్రాపంచిక విషయ వాసనలను, విడిచిన, మనస్సు గలిగివుండటం,

## 8. స్థైర్యం

మోక్షాన్ని, కాంక్షించి ఎన్ని ఆటంకాలు వచ్చినా సరే నిడవకండా ప్రయత్నం సాగించటం.

## 9. ఆత్మ వినిగ్రహః

ఆత్మ వినిగ్రహః = దేహేంద్రియ మనస్సులను వాటియిష్టం వచ్చినట్లు పోనీకుండా నిగ్రహించి అభ్యాసానికి అనుకూలమైన వాటినిగా హిత. మితాహారంతోను. తగినంత నిద్రతోను వాటిని తన వశంలో వుంచుకోటం.

## 10. ఇంద్రియార్థేషు వైరాగ్యం

ఇంద్రియార్థేషు వైరాగ్యం = ఈ లోకంలోపి. స్వర్గలోకంలో శబ్దాది విషయ సుఖాలూ మోక్షానికి భంగం కలిగిస్తవని నిశ్చయంగలిగి వాటియందు వాంతాశనమందు, ఈగలు. దోమలు వాలుతూ చెద్దకంపు కొడుతూవున్న కక్కిన కూటిమీద నీ కెంత అసహ్యమో అంత అస హ్యత గలిగివుండటం.

## 11, అనహంకారః

దేహేంద్రియాదులు నేనుగాదుఆత్మనేనేను అనే భావం స్థిరంగా గలిగివుండటం.

## 12. జన్మ మృత్యుజరావ్యాధి దుఃఖదోషానుదర్శనం

తల్లి గర్భంఅనే నరకంలో తొమ్మిది పది నెలలు తలక్రిందుగా పడివుండటం. ఆగర్భంలోవున్న జఠరాగ్నిచేత దహింపబడుతూ తాపం చెందటం. తల్లితింటూండే కారం, ఉప్పు మొదలైన రసాలు. ఆవిడ సేవించే వేడి కాఫీ. టీ. చల్లని అయిస్ క్రీమ్ మొదలైనవి గర్భంలో వున్న అతి కోమలమైన తన శరీరంమీద పడుతూంటే అపరిమితమైన, మంటా. బాధా అనుభవించటం గర్భంలో దుర్గంధంతో నిండివున్న రెండు కిడ్నీలు. మూత్రశాలల్లోనుంచీ, దీర్ఘంగావున్న ఇంటెస్టిన్స్ అనే పాయి

ఖానాలోనుంచీ "గాస్''లు (Gases) వస్తూ కోమలమైన శరీరాన్ని పోట్లు పొడుస్తూవుంటే భరింపలేని తాపాన్ని అనుభవించటం. ఇదంతా అయిన తరువాత ధనంజయ వాయువుచేత బయటకి నెట్టబడి మూత్ర ద్వారం గుండా బయటపడటం అనేవి జన్మలోగల దుఃఖదోషాలు నాయనా.

యిక బయట పడింది మొదలు వ్యాధులతోటి బాధపడటం. శిశువుగావున్నప్పుడు బాధే. బాలుడుగానున్నప్పుడూబాధే. యౌవ్వనంలోనూ బాధె ముసలితనంలోనూ బాధే. అంత అయిపోయి అంతిమ ప్రయాణం మృత్యువూ బాధే గనుక ఇన్ని బాధలను కలిగించే జన్మ, వ్యాధి జరా మృత్యువుల దోషాన్ని విచారించుకోటం అనే అభ్యాసం పునర్జన్మ లేకుండటం అనే మోక్షంకోసం ప్రయత్నం చేయుటం జ్ఞానం అని ఉపదేశిస్తున్నాడు భగవంతుడు నాయనా.

## 13. 14. అసక్తి రన భిష్వంగఃపుత్రదారగృహాదిషు

తన శరీరం, భార్యా పిల్లలు ఇళ్లు భూములు తోటలూ ధనం వీటి మీద ప్రీతి కలిగి ఉండటం సక్తత అనబడుతుంది.

భార్యా పిల్లలూ సుఖంగా ఉంటే తాను సుఖంగా ఉన్నానని తలంచటం, వారిలో ఎవరైనా దుఃఖంలో ఉంటే తానుగూడ దుఃఖంలో ఉన్నానని తలంచటం వాళ్లు జీవించి ఉంటే తాను జీవించి ఉన్నట్లని వాళ్ళు మృతులైతే తానుగూడ మృతుడైనట్టేనని తలంచటం అభిష్వంగం అనబడుతున్నది.

మోక్షాన్ని కోరేవాడు ఈసక్తత, అభిష్వంగం లేకుండా చేసుకోటానికి ప్రయత్నం చేయాలి అంటున్నాడు భగవంతుడు. అదెట్లా సంభవం అవుతుంది అంటావేమో విను నాయనా.

నీదేహమూ, భార్యాబిడ్డలు, ఆస్తిపాస్తులు, క్షేత్రవిత్తాలు ఇవన్నీనీ ప్రారబ్ధానుసారం వస్తున్నయ్ నాయనా. ఈ జన్మలో నీవు పూర్వజన్మలో చేసుకొన్న మంచికర్మ యొక్క ఫలంగా కొన్నాళ్లు సుఖ సంపదలు కలిగినీ బంధువులు క్షేమంగా ఉండటం నీ చెడు కర్మ యొక్క ఫలంగా నీకు కొన్నాళ్లు దుఃఖ దారిద్ర్యాలూ బంధునష్టం కలగటం జరుగుతూంటుంది. అంతేగాని నీ ఆస్తిపాస్తులను రక్షించుకోటానికి గాని నీవారినందరినీ క్షేమంగా ఉంచుకోటానికి గాని ఈనాడు నీవు చేసే ఏ ప్రయత్నం అక్కరకురాదు. అంటున్నవి శాస్త్రాలు:

ఒక కుటుంబంలో గల వేరు వేరు వ్యక్తులు తమ ప్రారబ్ధాన్ని తాము అనుభవించటానికీ, ఇతర వ్యక్తులకు, తాముబాకీపడి ఉన్నదాన్ని తీర్చుకోటానికీకొన్నాళ్లు శత్రుత్వంతోనూకొన్నాళ్లుమిత్రత్వంతోనూసంతోషంతో కొన్నాళ్లు, దుఃఖంతో కొన్నాళ్లు గడపటానికి కలుసుకొంటారు. తరువాత వారివారి సమయం వచ్చినప్పుడు, పోతూ ఉంటారు. రైలుపెట్టెలో ఎక్కినవారు, ఇదివరకు పరిచయం లేకపోయినా పెట్టెలోనున్నంత సేపూ పిన్నీ మామయ్యా తాతయ్యా అను వావివరసలతో మాట్లాడుకొంటూ, ఎవరి స్టేషన్ వచ్చినప్పుడు, వారు ఎట్లా దిగిపోతారో.

వేరు వేరు పనులమీద, వేరు వేరు ఊళ్లనుంచి, ఒక ఊరి సత్రంలో కలుసుకొని మూడు రోజులో నాలుగు రోజులో ఆ సత్రంలో ఉన్న సమయంలో అమ్మమ్మా తాతయ్యా పిన్నీ మామయ్యా అనే వావివరసలు కల్పించుకొని ఒకరి కొకరు చేతనైన సహాయం చేసికొంటూ ఉండి, ఎవరి పని అయిపోతే వారు సత్రాన్ని వదలిపెట్టి కొందరు ముందుగానూ, కొందరు ఆలస్యంగాను ఎవరి దోవను వారు పోయినట్లుగానే.

ఎక్కడెక్కడివారో ఈ జీవులు, ఋణానుబంధం చేత ఇల్లూ కుటుంబం అనే సత్రంలో కొంత కాలంకోసం, ఋణాలు తీర్చుకోటానికి

కలుసు కొంటారు. ఎవరి ఋణం తీరితే, ఎవరిపని అయిపోతే, ఎవరి స్నేషనువస్తే వారు ఉగిపోతారు. దేహం విడిచి = చచ్చిపోతారు. మళ్లీవేరే చోట. వేరే కుటుంబంలో. వేరే మనుష్యుల ఋణాలు తీర్చుకోటానికి;

ఋణానుబంధరూపేణపశుపత్నీసుతాదయః
ఋణక్షయేక్షయంయాంతి
'సత్రాగత జనసముదాయా ఇవసమ్మిళితేఏతే భవంతి'

అవిశాస్త్రాలు మనకు. జన్మ ఎందుకు కలుగుతున్నదో మరణం ఎందుకు గలుగుతున్నదో. ఈ జనన మరణప్రవాహ సంసారం ఎంత దుఃఖాన్ని కలిగిస్తున్నదో బోధించి.

నాయనా, ఈ విధంగా విచారణచేత విషయాన్ని తెలుసుకోటానికీ, దుఃఖాన్ని తీసేసుకోటానికి ప్రయత్నం చెయ్యి అనీ మమతలూ ప్రేమలూ పెంచుకొని భంగపాటు చెందకు అనీ హెచ్చరిస్తున్నవి నాయనా. అట్లా అభ్యాసం చెయ్యి.

15, నిత్యంచ సమచిత్తత్వంఇష్టా నిష్టోప పత్తిషు

తనకు కావలసిన పదార్థాలు లభిస్తే సంతోషం. దానికి వ్యతిరేక మైతే దుఃఖం. ఇలాంటి వికారాలు ఏమి లేకుండా, ఏది సంభవించినా గానీ నాప్రారబ్ధానుసారం వస్తుంది అనే నిశ్చయంతో. సమచిత్తం గలిగి ఉండటం.

16. మయి చానన్యయోగేన భక్తిరవ్య భిచారిణీ

"వాసుదేవునికంటె వేరే దైవంలేడు పరమేశ్వరుడే నాకుశరణ్యం" అని, ఇతర దేవతా భజన అనే వ్యభిచారాన్ని మానేసి పరమేశ్వరుడనైన నాయందేభక్తి కలిగి వుండటం.

## 17. వివిక్త దేశ సేవిత్వం

ఏకాంతమునందుండి పరమేశ్వర తత్త్వాన్ని ధ్యానించటం.

## 18. అరతిర్జన సంసది

ప్రాపంచిక విషయాలమీద వ్యామోహం గల వాళ్ళతో కలసి వుండటం మానేసి సజ్జన సాంగత్యంలో వుండటం ఆత్మతత్త్వ విచారం శ్రవణం చేయటం

## 19, అధ్యాత్మ జ్ఞాననిత్యత్వం

ఆత్మాను సంధానం చేస్తూ ముక్తినిగూర్చి ఆలోచించటం.

## 20. తత్త్వజ్ఞానార్థదర్శనం

తత్త్వజ్ఞానార్థదర్శనం = తత్త్వజ్ఞానాన్ని అనుభావంలోకి తెచ్చుకోటానికి నిరంతర ప్రయత్నం చేయటం

జ్ఞానం అంటే ఈ లక్షణాలు గలిగివుండటంవీటికివ్యతిరేక లక్షణాలు గలిగి ఉండటం అజ్ఞానం అని గీతామాతఉపదేశం నాయనా.

ఏమండోయ్, మీరేమిటో చెప్తూపోతున్నారుగాని ఈ లక్షణాలలో ఏ ఒక్కటైన సంపాదించదగిందనిగానీ, ఆచరణయోగ్యమైదనిగానీ. నమ్మకం సుతరాంగలగటంలా ఏమిటో ఈ శాస్త్రాలన్నీ చదివితేనూ వింటేనూ లేనిపోని గొడవ కలిగి కొరివితో తలగోక్కున్నట్లు అవుతుంది.

అసలు ఎవడైనా. వీటిలో ఏ ఒక్కదాంట్లోనైనా పది మార్కులైనా సంపాదించినవాడు ఉన్నాడా అంటూ చెప్పండి. ఇట్లా అసంభవాలైన (Impossible) అయిన ఉపదేశం గీతామాత ఎందుకు చేసినట్లు చెప్పండి అంటావేమో నాయనా చెప్తావిను.

సంపాదించ తగినవి కాకపోతే భగవంతుడు ఎందుకు చెప్తాడు నాయనా. ఇవి సంపాదించదగినవే. వీటిని సంపాదించినవారు ఏకాలం

లోనూ ఉన్నారు. వెనకా వున్నారు, ఇప్పుడూ వున్నారు. ఇకముందూ ఉంటారు.

అయితే నీ పరిస్థితి ఎట్లావుంటంటే రెండో క్లాసు చదువుతున్న వాడు. ఎం. ఏ క్లాసు పుస్తకాలను వీటిని ఎవడైనా చదివేవాడున్నాడా అని భావిస్తూ భయాశ్చర్యాలతో కూడినవానివలె ఉన్నది నాయనా నీ పరిస్థితి.

మన పురాణాలలోనూ, ఇతిహాసాలలోనూ, అంటే చాలాచాలా పాతకాలానికి సంబంధించిన హిస్టరీ బుక్కుల్లోనూ వామదేవ, ప్రహ్లాద జనకశుకాదుల చరిత్రలలోనూ,

ఆ తరువాత వైన హిస్టరీ బుక్కులలోనూ అంటే శంకరాచార్యులు ఏసుక్రీస్తు మొదలైనవారి చరిత్రలలోనూ ఆ తరువాతవైన మొన్న మొన్నటి హిస్టరీ బుక్కులలోనూ రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి మొదలైనవారి చరిత్రలలోనూ ఈ లక్షణాలను పొందటంలో వారివారి కృషికి తగినట్లుగా

పలభయ్యో. అరవయ్యో. తొంబయ్యో మార్కులు సంపాదించు కొన్న వారున్నట్లు మనకు తెలుస్తూనే ఉందిగదూ. ఇట్లా అనేక జన్మల ప్రయత్న ఫలంగా మనుష్యుడు మోక్ష పథంలో పురోగమనం చేసి-ముక్తిని పొందుతాడు అని గీతామాత స్పష్టంగా చెప్తున్నది చూడు—

ప్రయత్నా ద్యతమానస్తు యోగీసంశుద్ధకిల్బిషః
అనేకజన్మ సంసిద్ధః తతోయాతిపరాంగతిమ్

(గీ॥ 6.45)

మోక్ష మార్గంలో ప్రయత్నశీలి అయినవాడు = యోగి ఒక జన్మలో చేసిన ప్రయత్నం కంటె తరువాత తరువాత వచ్చే జన్మల్లో అధికాధికంగా ప్రయత్నంచేస్తూ సెంట్‌పర్సెంటు (నూటికి నూరు మార్కులు) జ్ఞానం సంపాదించటంలో అడ్డుగాఉన్న ప్రతిబంధకమైన

పాపరాశిని అంతటినీ భస్మీ పటలం చేసి పరిశుద్ధమైన మనస్సు గలవాడై ముక్తిని పొందటానికి అర్హతను పొంది.

బహూనాంజన్మనామంతే జ్ఞానవాన్ మాంప్రపద్యతే
వాసుదేవస్సర్వమితి సమహాత్మా సుదుర్లభః
(గీ॥ 7-19)

తేనెటీగ ఒక్కొక్క పువ్వులో నుంచి ఒక్కొక్క మకరంద బిందువును సంగ్రహించి క్రమక్రమంగా. పట్టుదలతో పరిశ్రమించి పెద్ద తేనె తుట్టెను తయారు చేసుకొని మధువును ఆస్వాదించి ఆనందించి నట్లుగా

అనేక మనుష్య జన్మలలో కొంచెం కొంచెంగా శాస్త్రీను గుణ్యంగా ప్రయత్నం చేస్తూ చేస్తూ కూడ బెట్టుకొన్న సంస్కారం పరిపాకం చెందటంచేత చివరి జన్మలో జీవుడు జ్ఞానంలో నూటికి నూరు మార్కులు సంపాదించుకొన్నవాడై

సర్వమిదం అహంచ వాసుదేవః బ్రహ్మైవ
బహిరంతశ్చభూతానాం
అచరం చరమేవచ
(గీ॥ 13-16)

యచ్చకించి జ్జగత్సర్వం దృశ్యతే శ్రూయతేఽపివా
అన్తర్బహిశ్చతత్సర్వం వ్యాప్య నారాయణఃస్థితః
(మంత్రపుష్ప)

కనబడేదీ ఉన్నది అనుకోబడేదీ అయిన ఈ లోకం ఉన్నదని మనం వింటూన్న స్వర్గలోకం, అంటే జగత్తు అనబడేదీ, సమస్తమూ, నేనుగూడా వాసుదేవుడే పరబ్రహ్మమే అని ఆత్మ భజనము చేస్తాడు.

అని మనుష్యుడు చేసే ప్రయత్నంవల్ల వచ్చే మహాసౌభాగ్యాన్ని స్పష్టీకరించి నీవు అట్లా చేయ్యాలి నాయనా అని ఉపదేశంచేస్తూన్నవి కండీ గీతామాతా, ఉపనిషత్తులూ.

మరి నీవో ఏ ప్రయత్నం లేకుండా సిగరెట్టు ముట్టించి పెదిమలకు తగిలించుకున్నంత తేలిగ్గాను. పొడుం డబ్బాలోనుంచి పొడుం తీసి ముక్కులోకి ఎక్కించినంత చులకనగాను. ఆర్డరివ్వగనే కాఫీహోటల్లో మసాలాదోసె నీ ముందుకు వచ్చినంత వేగంగాను

నీ ప్రయత్నం ఏమీ లేకుండా జ్ఞానం = మోక్షం రావాలంటావు దానికోసం అసలైనదీ అతి సులభం అయిన మార్గాన్ని విడచి అడ్డదార్లలో పోయి సంపాదిద్దామని విశ్వప్రయత్నం చేస్తావు. ధనం, కాలం, బలం పాడుచేసుకొంటావు. కాని శాస్త్రం బోధించిన రీతిగా రవ్వంత ప్రయత్నం గూడా చేయటానికి చేతకాక లక్షసాకులు చెప్తావు. మూర్ఖత్వం (foolishness) అంటే ఇంకేమిటి? ఇదేగదా!

చూడు కోఠి దగ్గర క్యూలో నుంచొని టిక్కెట్టు తీసికొన్నాగాని బస్సు వచ్చేటప్పటికి క్యూ విచ్ఛిన్నం కాగా సోదర ప్రయాణీకులను మోచేతులతో నెట్టుకుంటూ బస్సులోని ఇనుప కడ్డీని గట్టిగా పట్టుకొని వేళ్లాడుతూ హోరా హోరీ యుద్ధంచేసి బస్సులో ప్రవేశం పొంది సీటును సంపాదించటానికి కూడా ఘనతరమైన ప్రయత్నం చెయ్యాలే.

మరి నీనుంచి ఏ ప్రయత్నం లేకుండా. ఎవడో నెత్తినచెయ్యి పెట్టి నీకు ఎగ్గిరే శక్తినిచ్చి మోక్షాన్ని పొందింప చేస్తాడు అనుకొంటూ ఉండటం.

ఎమ్. ఎ. పి. హెచ్. డి. ని ఎఫ్. ఆర్. సి. యస్. సివిల్ సర్జనూ, బారెట్లానూ, ఫిలాసఫీ ప్రొఫెసరునూ, డాక్టర్ ఆఫ్ ఫిజిక్సునూ, డైరక్టర్ ఆఫ్ సైంటిఫిక్ రీసర్చినూ, శాస్త్ర పారంగతుడనూ సాహిత్య శిరోమణినీ అనుకునే నీకు దౌర్భాగ్యం కాకపోతే మరేమిటీ.

అందుచేత మహోత్కృష్టమైన మాణిక్యం వంటి మానవజన్మను

దేవతలచేత గూడ ప్రార్థింపబడే మహావిలువగల మానవజన్మను

అనేక కోట్ల పూర్వజన్మల్లో ఆర్జించుకొన్న పుణ్యరాశినంతటిని ధారపోసి పొందిన మానవజన్మను

పరమానంద పరమపద ప్రాప్తికి సోపాన పంక్తిని నిర్మించుకోటానికి, యోగ్యమైన మానవజన్మను

పశువులకుండే పరి పరి విధాలైన వాంఛలతోపాడు చేసుకోకు తండ్రి

పోయిన వయస్సు పోనే పోయింది. అది తిరిగిరాదు. ఇక ముందు ఈ మానవజన్మ అనే క్యాంపులో ఎన్నాళ్లుంటావో తెలియదునీకు. చిన్న వయస్సు. మధ్య వయస్సు. వార్ధక్యం అనే కాలనియమం లేకుండా

బ్లడ్ ప్రెషర్ ఎక్కువై పక్షవాతం రావొచ్చు

"క్యాన్సరు ఫారమ్" అయి కంఠ బిలం పూడుకుపోవచ్చు

మేహరణం "డెవలప్" అయి. మేనంతాకుళ్లిపోవచ్చు.

"హార్టు ఫేలయి". నీ ఆఖరి ఘడియ ఈనాడే రావచ్చు రేపే రావొచ్చు

కనుక తండ్రీ

అభ్యాసేనతు కౌంతేయ

(6-35)

అభ్యాస యోగయుక్తేన

(గీ: 8.8)

అభ్యాసయోగేనతతో

(గీ॥ 12.9)

అభ్యాసం చెయ్యి తండ్రీ, నీ అభ్యాసమే నిన్ను రక్షిస్తుంది "నాన్యః పంధావిద్యతేఽయనాయ" ఇంకో మార్గం లేనేలేదు అని బోధించే గీతా వాక్యాలమీద విశ్వాసముంచి,

నీ పాత అలవాట్లను మార్చుకొని నీ వ్యర్థ ప్రయత్నాలకు స్వస్తి చెప్పి, అభ్యాసం చెయ్యి నాయనా, అట్లా చేయకుండా, ఈ మానవజన్మను వఋవాంఛలతో పాడుచేసుకొంటూ, ఇదంతా ఎవడు చేస్తాడు. ఇదంతా నిజమా ఏమిటీ, ఏమిటో, ఎవడు చూడొచ్చాడు అని తృణీకార భావంతో ఈ జన్మను నాశనం చేసుకొంటే, మళ్ళీ ఈ జన్మరాదు, క్రిమికీట, పశు పక్ష్యాది జన్మలనూ, సరీసృప, శార్దూల భల్లూకాది క్రూరమృగ జన్మ లనూ, చెట్టూ చేమ, రాయీ రప్పా మొదలైన స్థావర జన్మలనూ,

ఆసురం యోనిమాపన్నా మూఢా జన్మని జన్మని
మామప్రాప్యైవ కౌన్తేయ తతోయాన్త్యధమాంగతిమ్
(గీ. 16-20)

ఇట్లా అసుర యోనులందు పడిపడి ఒకదానికంటె మరొక, నికృష్టమైన, అథమాధమమైన జన్మలను పొందిపొంది దుఃఖమూ, బాధా అనుభవించి అనుభవించి.

ఈ రీతి నీచ జన్మల్లో శిక్షానుభవం చేత, మహోత్కృష్టమైన మానవజన్మను మంటగల్పుకొన్నందువల్ల వచ్చిన మహాపాపం క్షీణించిన తర్వాత మళ్ళీ ఎప్పటికోగాని, ఎన్నికోట్ల జన్మలైన తర్వాతనో గాని ఈ మానవజన్మ రాదు నాయనా

అప్పుడైనా శాస్త్రాలూ శాసనాలూ మారి ఏదైనా చౌకమార్గం ఉంటుందనుకొంటున్నావేమో ఉండదు లేదు ముమ్మాటికీ లేదు. "నాన్యః పంథా విద్యతేఽయనాయ" ఇది శిలాక్షరం, దీనికి మించినది లేదు.

ఉంకబోదు అప్పుడైనా నీవే ఈ అభ్యాసం చెయ్యాలి. ఇట్లాగే చెయ్యాలి తప్పదు దుర్మతీ అంటున్నవి గీతామాతా ఉపనిషత్తులూ.

కనుక సుమతివై శాస్త్రానుసారం సదభ్యాస సంపత్తిని ఈ వచ్చిన మానవజన్మ అంతమయ్యే సమయం రాకముందే సుంతైనా సంపాదించుకో నాయనా,

1. భగవద్గీతను. పఠించు
2. భగవద్గీతను పారాయణంచెయ్యి
3. భగవద్గీతను కంఠస్థం చేసుకో.
4. భగవద్గీతామృతాన్ని ఆస్వాదించి ఆనందించు
5. భగవద్గీతోపదేశానుసారం నీ దైనందిన జీవితాన్ని సరిదిద్దుకో
6. ఈ ప్రయత్నంలో నీ వెంత వరకు పురోగమిస్తున్నావో ప్రతి దినమూగాని, వారం. పక్షం, మాసంలో ఒకమారైనాగాని చూచుకొనే అలవాటు చేసుకో.

అంటే నీ దురభ్యాసాలు ఎన్ని నిన్ను వదలిపోతున్నాయో చూచుకో సదభ్యాసం ఎంతవరకు సాధింపబడిందో చూచుకో.

7. ఇట్లా చెయ్యటానికి ఈనాడే కంకణం కట్టుకో, వారాలూ, వర్జ్యాలూ రాహుకాలాలూ కేతుకాలాలూ మీన మేషాలూ, తిధివారనక్షత్రాలూ లెక్కబెట్టుకొంటూ కాలహరణం చెయ్యకు. ఈనాడేఅభ్యాసం ఆరంభించు

8. ఇట్లాచేయటానికి శక్తి. ధైర్యం పూనిక కలగటానికి గీతామృత మహోదధిని పరమేశ్వరుణ్ణి, జగద్గురువుని ప్రతిదినమూ, పరితాపంతో ప్రార్థించు.

అంతేగాని నీ పాతపాట అయిన క్షేమ. స్థైర్య, విజయ. ఆయురా రోగ్యాలకోసం ధన కనక వస్తు వాహనాదుల కోసం దేవతలనూ దయ్యా లనూ భూతాలనూ పూజిస్తూ బిచ్చం ఎత్తకు.

దుఃఖాలు నీవు కోరక పోయినప్పటికి అవి రావలసిన సమయంలో నీకు తప్పని సరిగా పూర్వ జన్మను నీవు చేసుకొన్న దానికి ఫలంగా ఎట్లా సంభవిస్తున్నవో అట్లాగే సుఖాలు కూడా నీకు రావలసినప్పుడు నీవు ఏం ఏం జేసుకొచ్చావో దానికి తగినట్లుగా రానేవస్తవి అనే సంపూర్ణ విశ్వా సంతో కాలంగడుపుతూ గీతాభ్యాసం చెయ్యితండ్రీ పరమేశ్వరకటాక్షానికి పాత్రుడవగుదువుగాక.

## ఓం గీతామృత మహోదధయే నమః

ఓం

కృష్ణానంద ముకుంద మురారే వామన మాధవ గోవింద
శ్రీధర కేశవ రాఘవవిష్ణో శ్రీనారాయణ చిద్రూప
యదక్షర పద భ్రష్టం మాత్రాహీనం చయద్భవేత్
తత్సర్వం క్షమ్యతాందేవ శ్రీకేశవ నమోఽస్తుతే

వాసుదేవ నమోఽస్తుతే
నారాయణ నమోఽస్తుతే

ఓం

నమోభగవతే వాసుదేవాయ
నమః పురుషోత్తమాయ,

నమస్సర్వ లోకగురవే

నమస్సర్వ లోకపిత్రే

నమస్సర్వ లోకపితామహాయ

నమస్సర్వలోక ప్రపితామహాయ

నమస్సర్వ లోక ప్రధానాయ

నమస్సర్వ లోకేశ్వరాయ.

నమస్సర్వ లోక విశిష్టాయ

నమస్సర్వ లోక సుఖ ప్రదాయ.

నమస్సర్వ లోక కర్త్రే

నమస్సర్వ లోక భర్త్రే

నమస్సర్వ లోక హర్త్రే

నమస్సర్వ లోక నిధయే

నమస్సర్వ లోక నిధానాయ

నమస్సర్వ లోక హితాయ

నమస్సర్వ లోక హితకరాయ

నమస్సర్వ లోకోద్భవాయ

నమస్సర్వ లోకోద్భవకరాయ

నమోవిష్ణవే. ప్రభవిష్ణవే

సర్వస్యచాహం హృది సన్నివిష్టో

మత్తస్స్మృతి ర్జ్ఞాన మపోహనంచ

వేదైశ్చ సర్వై రహమేవవేద్యో
వేదాంత కృద్వేద విదేవ చాహం
మన్మనాభవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు
మామేవైష్యసి యుక్త్వైవం ఆత్మానం మత్పరాయణః

ఓం

కాయేన వాచామన సేంద్రి యైర్వా
బుద్ధ్యాత్మనావా ప్రకృతే స్స్వభావాత్
కరోమి యద్యత్సకలం పరస్మై
నారాయణాయేతి సమర్పయామి

ఓం తత్సత్

శ్రీకృష్ణానందాశ్రమ గీతా ప్రచార సంఘం

తృతీయ సుమం



BCI

ADUA105B115
BC

V.R. NARLA MEMORIAL
V.R.NARLA
DPHT
Acc. No

లలితా ప్రెస్ ఖైరతాబాదు, హైదరాబాదు-4

## మనన ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA105B115 |
| పుస్తకం పేరు | శ్రీమద్భగవద్గీత మానవకర్తవ్యము03 |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 125 |
| పెద్ద సైజు పేజీలు | no |
| ఖాళీ పేజీలు | ci BCi |
| లేని పేజీలు | no |
| తయారు చేసినది | kethura |
| పేజీలు విడదీసినది | kethura |
| స్కాన్ చేసినది | Teja |
| పరీక్ష చేసినది | BUJJI |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |